www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 32 No | విజయవాడ, శనివారం 2 ఫిబ్రవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.





విజవాడ లెనిన్ సెంటర్‌లో మోడీ దిష్టిబొమ్మ దహనం

ఓటు పద్దు!

తాత్కాలిక బడ్జెట్ నిండా ఎన్ని'కల'లే!

రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా ఆరువేలు

ఆదాయపన్ను పరిమితి 5లక్షలకు పెంపు

కార్మికులకు ప్రధానమంత్రి శ్రమ ఫించన్లు

సినీ నిర్మాణ సంస్థలకు సింగిల్ విండో

మారుమూల ప్రాంతాల్లో పక్కారోడ్లకు 19వేల కోట్లు



మరికొద్ది నెలల్లో సాధారణ ఎన్నికలకు దేశం సిద్ధమౌతున్న వేళ నరేంద్రమోడీ ప్రభుత్వం తిమ్మిని బమ్మి చేసి టక్కుటమార విద్యను ప్రదర్శించింది. ప్రజానీకాన్ని భ్రమల్లో ముంచెత్తే ప్రయత్నం చేసింది. పెడుతున్నది తాత్కాలిక బడ్జెట్టే అయినా, దాని కాలపరిమితి రెండు నుండి మూడు నెలల మాత్రమే అని తెలిసినా భారీ పథకాలను ప్రకటించి వంచనాశిల్పకళను ప్రదర్శించింది. నాలుగన్నరేళ్ల ఎన్‌డిఎ పాలనలో అన్ని విధాల అన్యాయానికి గుర్రైంది అన్నదాతలు ...మధ్యతరగతి ప్రజలు..వేతన జీవులు ...కార్మికులే. వీరందరినీ ఊరడించేందుకు తాత్కాలిక ఆర్థికమంత్రి పియుష్ గోయల్ పెద్ద ప్రయత్నమే చేశారు. అయినా, ప్రతిది పైన పటారం, లోన లోటారమని తెలిసిపోతూనే ఉంది. కిసాన్ సమ్మాన్ పథకంలో 5 ఎకరాల లోపు రైతుకు ఎటా 6 వేల రూపాయలను నేరుగా బ్యాంకు ఖాతాకు చెల్లిస్తామంది. దీంతో కుటుంబానికి నలుగురు సభ్యులు ఉన్నారనుకుంటే తలకు రోజుకు నాలుగు రూపాయలు వస్తాయి. ఒక్కటీ ఖరీదు కూడా లేని ఈ విదిలింపునే 'నభూతో..నభవిష్యత్' గా చెప్పుకుంటూ మోడీ అండ్‌కో ఓట్ల వేటకు సిద్ధమౌతోంది. మూడు సంవత్సరాలుగా మధ్య తరగతి ప్రజలను ఊరిస్తూ వచ్చిన ఆదాయ పన్ను పరిమితిని ఐదు లక్షల రూపాయలకు పెంచింది. కార్మికుల కోసమంటూ అట్టహాసంగా ప్రకటించిన ప్రధాన మంత్రి శ్రమ యోజన పథకంలోనూ ఆర్భాటమే ఎక్కువ! ఈ పథకం కింద నెలకు 100 రూపాయల వంతున కార్మికులు 30 ఏళ్లు చెల్లిస్తే ఆ తరువాత నెలకు 3వేల రూపాయల మొత్తాన్ని పింఛన్‌గా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎప్పటి మాదిరిగా ఈ ఏడాది కూడా ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయ్యే దక్కింది.

బడ్జెట్ వార్తలు 3లో

రైతుల్ని అవమానించారు..

15మంది పారిశ్రామికవేత్తలకు రూ.3.5లక్షల కోట్ల రుణాలను ప్రధాని మోడీ మాఫీ చేశారు. రైతులకు మాత్రం రోజుకు 17 రూపాయలు ఇస్తామంటున్నారు. ఇది రైతులను అవమానించడం కాదా? గత నాలుగున్నరేండ్లుగా మోడీ సర్కార్ విధానాలు రైతుల జీవితాల్ని చిన్నాభిన్నం చేశాయి. దేశ రైతాంగం తీవ్ర ఆగ్రహంతో ఉంది. వారిని మభ్యపెట్టడానికే ఈ పథకాన్ని తీసుకొచ్చారు.'

- రాహుల్‌గాంధీ

హామీలకు కాగితమంత విలువ లేదు

'ఈ బడ్జెట్‌లో పేర్కొన్న హామీలకు వారు వినియోగించిన కాగితమంత విలువ లేదు. 10 కోట్ల ఉద్యోగాలు, 100 నూతన స్మార్ట్ నగరాలు, గంగ శుద్ధి, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తామని హామీలను గుప్పించి 2014లో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ముందు మరోసారి ప్రజలను మోసగించడానికి ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈసారి విజయం సాధించదు.'

- సీతారాం ఏచూరి

ఇది ట్రైలర్ మాత్రమే

'ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను పరిగణలోకి తీసుకుంది. దేశాన్ని మరింత బలోపేతం చేయనున్నది. స్వాతంత్ర్యం తర్వాత తీసుకొచ్చిన భారీ పథకం 'పీఎం కిసాన్ యోజన'. ఎన్నో ఏండ్లుగా ఉన్న ఆదాయ పన్ను పరిమితి పెంపు డిమాండ్‌ను నెరవేర్చాం. ఇది కేవలం ట్రైలర్ మాత్రమే. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరువాత మరింత అభివృద్ధి కనపడుతుంది. **- ప్రధాని మోడీ**

రాష్ట్రానికి అన్యాయం

'చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్యాయం జరిగింది. ప్రత్యేకహోదా, విభజన హామీల అంశాలను బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. రాష్ట్ర ప్రజల ఆందోళనను కేంద్రం పట్టించుకోవడం లేదు. వృద్ధి రేటును పెంచడానికి కేంద్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అది పెరిగితేనే నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుంది. ఇది ఎన్నికల బడ్జెట్టే!'

- యనమల రామకృష్ణుడు

ఆంధ్రావని ఆగ్రహం

నిలిచిన బస్సులు రాకపోకలు

బైక్ ర్యాలీలు- దిష్టి బొమ్మల దగ్ధం

ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేట్ సంస్థల మూత

ప్రత్యేక హోదా, విభజన హామీలపై రాష్ట్రమంతటా నిరసన

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలనీ, విభజన హామీలను అమలు చేయాలనే డిమాండ్లతో ఆంధ్రావని మరోసారి ఆందోళనకు దిగింది. కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రజలు శుక్రవారం నిరసనలు చేపట్టారు. ప్రత్యేక హోదా సాధన సమితి ఇచ్చిన పిలుపుమేరకు బంద్ జరిగింది. సిపిఐ, కాంగ్రెస్, టిడిపి సంఘీభావం ప్రకటించాయి. కాగా కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మల దహనానికీ, బైక్ ర్యాలీల నిర్వహణకు సిపిఎం ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర వ్యాపితంగా నిరసనలు జరిగాయి. పలు చోట్ల ఆందోళనల్లో జనసేన కార్యకర్తలూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు జిల్లాల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. వ్యాపార సంస్థలను తెరవలేదు. సినిమా హాళ్లు ఉదయం వేళల్లో మూతపడ్డాయి. విజయవాడలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. విజయవాడలో నవజీవన్ రైలును కొద్దిసేపు నిలిపివేశారు. కడప సహా పలు జిల్లాల్లో అరెస్టులు జరిగాయి. రాష్ట్ర వ్యాపితంగా ఎపిఎన్‌జిఓలు, జర్నలిస్టులూ ఈ ఆందోళనల్లో వేర్వేరుగా పాల్గొన్నారు. కాగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎక్కడా నిరసనల్లో పాల్గొనకపోవడం గమనార్హం.

వార్త 8లో

నల్ల చొక్కాతో సిఎం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, విభజన చట్టంలో హామీలు అమలు చేయకపోవడానికి నిరసనగా ముఖ్యమంత్రి చంద్రబాబు నల్లచొక్క ధరించి శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు. నిత్యం ఒక గోదుమ రంగు దుస్తులతో ఉంటే సిఎం శుక్రవారం మాత్రం నల్లచొక్కా, తెల్లప్యాంటు ధరించారు, ఆయతోపాటు మంత్రులూ, టిడిపి శాసనసభ్యులు నల్ల దుస్తులు ధరించారు.. స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌లు సాధారణ దుస్తులతో వచ్చినప్పటికీ నల్ల బ్యాడ్జీలు ధరించారు.




ఎన్నికలప్పుడే వరాలా?

అధికార, ప్రతిపక్ష పార్టీలను సాగనంపండి

మంగళగిరి సభలో సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు

12



అంకెల్లో బడ్జెట్

తాత్కాలిక బడ్జెట్ 2019-20

(రూ.కోట్లల్లో)

	2017-18 తుది లెక్కలు	2018-19 అంచనాలు	2018-19 సవరించిన అంచనాలు	2019-20 అంచనాలు
రెవెన్యూ ఆదాయం	14,35,233	17,25,738	17,29,682	19,77,693
పెట్టుబడి ఆదాయం	7,06,742	7,16,475	7,27,553	8,06,507
మొత్తం ఆదాయం	21,41,975	24,42,213	24,57,235	27,84,200
మొత్తం ఖర్చు	21,41,975	24,42,213	24,57,235	27,84,200
రెవెన్యూ లోటు	4,43,602	4,16,034	4,10,930	4,70,214
ప్రభావిత రెవెన్యూ లోటు	2,52,568	2,20,689	2,10,630	2,69,474
ద్రవ్య లోటు	5,91,064	6,24,276	6,34,398	7,03,999
ప్రాథమిక లోటు	62,112	48,481	46,828	38,938

రాష్ట్రానికి మొండి చెయ్యి



- సెంట్రల్, గిరిజన యూనివర్శిటీలకు నామమాత్ర కేటాయింపు
- మిగతా వాటికి శూన్యం
- కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా మధ్యంతర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎప్పటి మాదిరిగా మొండిచెయ్యి చూపింది. ఎన్డీఏ సర్కారు చివరి బడ్జెట్లో కూడా ఏపికి నిరాశే మిగిల్చింది. కేవలం ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ, గిరిజన యూనివర్శిటీకి మాత్రమే నిధులు కేటాయించారు తప్ప మిగతా వాటి ఊసే లేదు. విభజన చట్టంలోని పేర్కొన్న హామీల ప్రస్తావన గానీ, ప్రత్యేక హోదా, రైల్వే జోన్ గురించికానీ ఈ బడ్జెట్‌లో లేదు.

ఏపి పారిశ్రామికాభివృద్ధికి ఇవ్వాల్సిన రాయితీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు కలిపి వడ్డీ రాయితీ కింద 2018-19 బడ్జెట్ అంచనాలను రూ.100 కోట్లుగా చూపి, సవరించిన అంచనాల్లో సున్నాగా చూపారు. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించలేదు. అలాగే 2019-20కి కూడా ఈ పద్దు కింద నిధులు కేటాయించలేదు. రెవెన్యూ లోటు భర్తీ బకాయిల గురించి, రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులకు సంబంధించిన ప్రస్తావన లేదు. దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్‌ప్లాంట్, విశాఖ పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌లు, విశాఖ, విజయవాడ మెట్రో రైళ్ల గురించి ఏమీ చెప్పనేలేదు. విశాఖ రైల్వే జోన్ ప్రస్తావనే లేదు. పారిశ్రామిక కారిడర్‌లకు కేటాయింపులు లేవు. అయితే, కొన్ని జాతీయ సంస్థలకు దేశవ్యాప్తంగా ఒకే కేటగిరిలో కలిపి చూపించారు.

ఏపికి కేటాయింపులు

సెంట్రల్ యూనివర్శిటీ	రూ.13 కోట్లు
గిరిజన యూనివర్శిటీ	రూ.4 కోట్లు
విశాఖ పోర్టు ట్రస్టు	రూ.131.12 కోట్లు

కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ జయరామ్ హత్య



- మిస్టరీని ఛేదిస్తాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - నందిగామ

కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ చిగురుపాటి జయరామ్ హత్యకు గురయ్యారు. ఇటీవల విదేశాల నుంచి వచ్చిన ఆయన హైదరాబాద్-విజయవాడ మధ్య కృష్ణాజిల్లా నందిగామ శివార్లలో కారులో మృతి చెంది ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఐతవరం శివారులో శుక్రవారం తెల్లవారు జామున 65వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు పక్కనే ఉన్న కందకంలోకి వెళ్లి ఉండడాన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కారులో మృతి చెందిన వ్యక్తి చిగురుపాటి జయరామ్‌గా గుర్తించారు. ఆయన ఎక్స్‌ప్రెస్ టీవీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సంఘటనపై నందిగామ డిఎస్‌పి పిఎస్‌సి బోస్ విలేకర్లకు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆమెరికాలో ఉంటున్న జయరామ్ గత నెలలో హైదరాబాదు వచ్చారు. గురువారం మధ్యాహ్నం తన

మిగతా 9లో

జెఇఇ బిఆర్క్ ఫలితాల విడుదల

- మొదటి రెండు స్థానాలు మనవే



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మమైన జెఈఈ - పేపర్ 2 (బిఆర్క్, బి ప్లానింగ్) ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు 100 శాతం పర్సంటైల్ (ఎన్‌టిఏ స్కోర్) సాధించగా...ఆ ఇద్దరు తెలుగు విద్యార్థులే. జెఇఇ మెయిన్స్ పరీక్షల కోసం దేశ, విదేశాల్లో 255 పట్టణాల్లో 390 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పేపర్-1 (బిటెక్)కు 9,29,198 మంది దరఖాస్తు చేసుకోగా, 8,74,469 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరితో పాటు పేపర్-2 (బి-ఆర్క్, బి-ప్లానింగ్) పరీక్షకు దేశవ్యాప్తంగా 1,80,052 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 1,45,386 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గొల్లపూడి ఎన్ లక్ష్మి నారాయణ, గుండ్ల రఘునంధన్‌రెడ్డిలు వందశాతం పర్సంటైల్ సాధించి వరుసగా ఒకటి, రెండు స్థానాల్లో నిలిచారు.

ఇవిఎంలపై అనుమానాలున్నాయి

- సోమవారం ఎన్నికల సంఘంతో భేటీ
- 21 బిజెపియేతర పార్టీల సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇవిఎంల విషయమై సోమవారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు 21 బిజెపి యేతర పార్టీల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రజలకు ఈవిఎంలపై అనుమానాలున్నాయని, వాటిపై శ్రద్ధపెట్టాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానికి ఉందని సమావేశం పేర్కొంది. శుక్రవారం నాడిక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 21 బిజెపియేతర పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఎకె అంటోని, గులాం నబీ ఆజాద్, ఎండి సలీం, టికె రంగరాజన్ (సిపిఎం), డి.రాజా(సిపిఐ), తదితరులు పాల్గొన్నారు. "సేవ్ నేషన్, సేవ్ డెమోక్రసీ" పేరుతో దాదాపు రెండు గంటల సేపు సాగిన ఈ సమావేశంలో ఈవిఎం, రైతు సమస్యలు, నిరుద్యోగం, రాజ్యాంగ సంస్థలపై దాడి వంటి అంశాలపై చర్చించారు. సీట్లు, పొత్తుల గురించి ఎలాంటి చర్చ జరగలేదని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. మోడీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని, పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. 15 మంది పారిశ్రామికవేత్తలకు రూ.3.5 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసిన మీరు (మోడీ) రైతులకు రోజుకు

మిగతా 9లో

1900 ఎఎన్‌ఎమ్ పోస్టులకు నోటిఫికేషన్

ఈనెల 20లోగా దరఖాస్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆరోగ్య ఉపకేంద్రాల్లో పనిచేసేందుకు రెగ్యులర్ ప్రాతిపదికన 1900 ఎఎన్‌ఎమ్ (మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ ఫిమేల్) పోస్టులను భర్తీ చేసేందుకు వైద్యఆరోగ్య శాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలవారీగా ప్రాథమికంగా ఖాళీల సంఖ్య శ్రీకాకుళంలో 52, విజయనగరం 29, విశాఖపట్నం 150, తూర్పు గోదావరి 227, పశ్చిమ గోదావరి 193, కృష్ణా 168, గుంటూరు 242, ప్రకాశం 99, నెల్లూరు 176, చిత్తూరు 182, కడప 97, అనంతపురం 140, కర్నూలు 145 పోస్టులున్నట్లు ప్రకటించింది. పదోతరగతి అర్హత ఉండి, ఎఎన్‌ఎమ్ కోర్సు పూర్తిచేసిన 42 ఏళ్లలోపు వారు దరఖాస్తు

మిగతా 9లో

చంద్రబాబుకు కాపు నేతలు సన్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తూర్పు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర తూర్పు కాపు సంఘం నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర నాయకత్వ శిక్షణా శిబిరం డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర తూర్పుకాపు సంఘ నాయకులు సిఎంను గజమాలతో సత్కరించారు. అడగకుండానే కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు తూర్పు కాపులంతా రుణపడి ఉంటారని సిఎంకు అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర తూర్పు కాపులకు ఒబిసి ధృవీకరణ పత్రాలు ఇస్తున్నప్పటికీ మిగతా ప్రాంతాల్లో ఒబిసి పత్రాలివ్వడంలేదని సిఎంకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కునుకు రాజశేఖర్, జోగినాయుడు, మహంతి వాసుదేవరావు, చింత చిన్న, కెఎస్ఆర్ నాయుడు, పిన్నింటి రామారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



3న తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవం

హాజరుకానున్న చీఫ్ జస్టిస్ గొగోయ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి రాజధాని అమరావతిలో ఈనెల 3న తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభోత్సం, శాశ్వత హైకోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ హాజరుకానున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై తనకార్యాలయంలో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ కార్యక్రమానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి, ఎపి,తెలంగాణ రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు హాజరుకానున్నట్లు తెలిపారు. హైకోర్టుకు వెళ్లే మార్గంలోనూ, ముఖ్యంగా కరకట్ట నుండి సభాప్రాంగణం వరకు హోర్డింగులు ఏర్పాటు చేయాలని సమాచార కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమం అంతా లైవ్ కవరేజి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి అవసరమైన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిజిపి ఆర్పి ఠాకూర్ స్పష్టం చేశారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి ఈనెల 2న విజయవాడ చేరుకుంటారని, బెర్మ్ పార్కులో డిన్నర్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి ఎన్ శ్రీకాంత తెలిపారు. సిఆర్డీయే కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ సభాప్రాంగణం వద్ద 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి 1500మంది న్యాయవాదులు, 500 మంది ఇతర జ్యుడిషియల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వెయ్యి మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో శాంతిభద్రతల అదనపు డిజి రవిశంకర్, విజయవాడ పోలీస్ కమిషనర్ ద్వారకా తిరుమలరావు, రాష్ట్ర ఫైర్ సర్వీసెస్‌శాఖ డిజి కె సత్యనారాయణ, న్యాయశాఖ కార్యదర్శి వెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏదీ కాదంటున్నారు

- మోదీ సర్కారుపై శాసనసభ ధ్వజం
- జరిగిన అన్యాయంపై తీర్మానం ఆమోదం
- కక్ష సాధింపు చర్యలేనని విమర్శలు





ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి రావాల్సిన నిధులు, చేయాల్సిన సాయం చేయకుండా కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని రాష్ట్ర శాసనసభ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు శుక్రవారం శాసనసభలో రవాణా మంత్రి అచ్చెన్నాయుడు, మండలిలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విభజన హామీలపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయడం లేదని తీర్మానంలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పై అనుసరిస్తున్న వివక్ష పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు. అమరావతి నిర్మాణం, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం, ఓడ రేవు, పెట్రో కెమికల్ పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విమర్శించారు. వాటితోపాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రెవెన్యూ లోటును భర్తీ, వంటి వాటిని కూడా కేంద్రం సహకరించడం లేదని వివరించారు. రైల్వేజోన్ ఇవ్వడం కుదరదంటున్నారని, ఉక్కు కర్మాగారం లాభపాటి కాదని, ఓడ రేవుకు అభ్యంతరాలు పెడుతున్నారని, పెట్రో కెమికల్ పరిశ్రమకు ఐదు వేల కోట్ల రూపాయల వయబిలిటీ ఫండింగ్ భారాన్ని రాష్ట్రమే భరించాలంటున్నారని ఆరోపించారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో డ్రైనేజి కోసం ఇచ్చిన డబ్బు కూడా రాజధాని అమరావతికి ఇచ్చినట్లు చెప్పడం శోచనీయమని ఆరోపించారు. యుటిలైజేషన్ సర్టిఫికేట్లు ఇచ్చినా ఇవ్వలేదన్నట్లు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలోనూ కేంద్ర సాయం సక్రమంగా అందకపోవడం దురదృష్టకరమని శాసనసభ తీర్మానంలో విమర్శించారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులను అనుసరించి ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని, గతం నుంచి హోదా ఉన్న రాష్ట్రాలకు కూడా ఇకపై కొనసాగించబోమని కేంద్రం చెప్పినప్పటికీ, ఇతర రాష్ట్రాలకు పన్ను రాయితీలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. సహకార సమాఖ్య వ్యవస్థలో అన్ని రాష్ట్రాల అభివృద్ధికి సహకరించాలని, కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి మరింత సాయం అందించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని పేర్కొన్నారు. కానీ అందుకు విరుద్ధంగా రాష్ట్రంపై వివక్షతో వ్యవహరించటం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాయితీలతో కూడిన ప్రత్యేక హోదాతో పాటు తమ న్యాయమైన డిమాండ్లని కేంద్రం గుర్తించి, అమలుచేయాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించారు.


అడ్డుకున్నది ముఖ్యమంత్రే - ఇవ్వనన్నది మోడీ, జైట్లీనే

- మండలిలో టిడిపి, బిజెపి పరస్పర విమర్శలు
- వెల్‌లోకి దూసుకొచ్చిన ఇరుపక్షాల సభ్యులు

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు, ప్రత్యేక హోదాపై శాసనమండలిలో జరిగిన చర్చలో బిజెపిపై సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిజెపి ఎమ్మెల్సీ మాధవ్, సోము వీర్రాజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉద్దేశించి చేసిన పరుష వ్యాఖ్యలతో సభలో దుమారం రేగింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా ఉండటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కారణమని మాధవ్ విమర్శించారు. మాధవ్ చేసిన వ్యాఖ్యలను రికార్డుల్లో నుంచి తొలగించాలని టిడిపి సభ్యులు పట్టుబట్టారు. ఈ క్రమంలోనే టిడిపి, బిజెపి సభ్యులు తమ స్థానాల్లో నుంచి చైర్మన్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. టిడిపి సభ్యులు బీదా రవిచంద్ర, మంతెన వెంకట సత్యనారాయణ రాజు, బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజువైపు ఆవేశంగా దూసుకెళ్లారు. రాష్ట్రాన్ని మోసం చేసింది మీరంటే, మీరని ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. హోదా సంజీవని కాదని, హోదా వల్ల ఏ రాష్ట్రాలు అభివృద్ధి చెందాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే అన్నారని మాధవ్ గుర్తుచేశారు. శాసనసభ, మండలిలో కూడా ప్రభుత్వం ఇలానే మాట్లాడిందని, ఇప్పుడు మాట మార్చిందని విమర్శించారు. ప్రత్యేక హోదాలో ముద్దాయిగా ఉన్న వారు శుక్రవారం నిర్వహించిన బంద్‌లో పాల్గొన్నారని అన్నారు. అబద్ధాలు, భ్రమలు కల్పించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. హోదా కంటే ప్యాకేజే మంచిదని ఆర్థిక శాఖమంత్రి యనమల రామకృష్ణుడు టిడిపి కార్యకర్తల సమావేశంలో చెప్పారని తెలిపారు. హోదా కావాలని అడగలేక ముఖ్యమంత్రిపై దాడి చేస్తున్నారని విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ విమర్శించారు. బిజెపి వ్యవహరిస్తున్న తీరు వల్ల ఉత్తరప్రదేశ్‌లో బద్ధశత్రువులైన ఎస్పి, బిఎస్పి పార్టీలు కలిశాయని అన్నారు. కలిసిన మరుసటి రోజే అఖిలేష్ యాదవ్‌ను కుంభకోణంలో ఇరికించారని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. గవర్నర్ ప్రసంగంపై ముందుగా టిడిపి సభ్యులు జి శ్రీనివాసులు, జగదీశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. శాసనమండలి మాజీ సభ్యులు, ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు మృతికి మండలి సంతాపం ప్రకటించింది.

మీకు రోషం లేదా?

- బిజెపి ఎమ్మెల్యేలపై విరుచుకుపడ్డ సిఎం
- రాజకీయంలో మోడీ కంటే నేనే సీనియర్‌ని
- వెంకయ్యకు ఉపరాష్ట్రపతి పదవి ప్రమోషనా.. డిమోషనా
- శాసనసభలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడలేని మీకు సిగ్గు లేదు, మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు, ప్రజా ప్రతినిధిగా ఉండే అర్హత మీకు లేదు అంటూ బిజెపి శాసనసభ్యులపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమలుపై శాసనసభలో శుక్రవారం జరిగిన చర్చలో భాగంగా బిజెపి ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు అధికార పక్ష సభ్యులు లేవనెత్తిన అంశాలపై సమాధానం ఇస్తుండగా సభలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. తమిళనాడుకు ఎన్ని ఇచ్చారు, గుజరాత్‌కు ఎన్ని ఇచ్చారు.. మీకు రోషం ఉండాలంటూ ఉద్వేగంతో ఊగిపోతూ మాట్లాడారు. ఇనేవాళ్లుంటే చెవుల్లో పువ్వులు పెట్టేస్తారంటూ తీవ్ర విమర్శలు చేశారు. దీంతో ఎమ్మెల్యే మాణిక్యాలరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై బిజెపి ఎమ్మెల్యే మాణిక్యాలరావు అభ్యంతరం తెలపగా సిఎం మరింత ఆగ్రహంతో తను రాష్ట్ర పర్యటనకు వెళ్లినప్పుడు మహిళలు సైతం రాష్ట్ర ప్రజలకు రోషం లేదా అని ప్రశ్నిస్తున్నారని చెబుతూ ఈ సందర్భంగా రాజధాని నిర్మాణానికి, పోలవరానికి విరాళాలు ఇచ్చిన మహిళల వివరాలు తెలిపారు.

చెన్నై నుంచి హైదరాబాదుకు, అక్కడి నుంచి అమరావతికి వచ్చామన్నారు. హైదరాబాదుకు వచ్చినప్పుడు అప్పులు లేవని, రూ.5 కోట్లు ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆర్థిక లోటు ఉన్నా కేంద్రం నిధులు ఇవ్వడం లేదన్నారు. తాను ఢిల్లీలో వారం రోజులు నిరాహార దీక్ష చేసినప్పుడు మీరు పొట్టి శ్రీరాములు ఎప్పుడవుతారని అడిగారన్నారు. తాను ఎంతో ఆవేదనకు గురయ్యానన్నారు. బిజెపితో కలిసినా మత సామరస్యం కోసం పోరాడుతూన్న పార్టీ టిడిపి అన్నారు. 14 సీట్లు మీకిస్తే కేవలం 4 మాత్రమే గెలిచారన్నారు. మాణిక్యాలరావును నేనెప్పుడూ చూడలేదని, అయినా బిజెపి అభ్యర్థిగా ఉండటంతో గెలిపించాలని పార్టీకి పిలుపు ఇచ్చానన్నారు. దక్షిణ భారత దేశంలో అతి తక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా ఎపి ఉందన్నారు. నాకు అన్యాయం జరిగినప్పుడు నేనెందుకు పన్ను కట్టాలని ప్రశ్నించారు. మోడీ నా కంటే వెనుకాల వచ్చారు, అయినా ఆయన చుట్టూ తిరిగాను, రాజధాని శంఖుస్థాపనకు వచ్చి మట్టీ, నీరు మొహాన కొట్టారని మండిపడ్డారు. డొలేరోకు రూ.30 వేల కోట్లు, బుల్లెట్ ట్రైన్‌కు రూ.1.10 లక్షల కోట్లు, ద్వారకా కన్వెన్షన్ సెంటర్‌కు రూ.27 వేల కోట్లు ఇచ్చిన మీకు ఎపికి నిధులు ఇవ్వడానికి ఇబ్బందేంటని ప్రశ్నించారు. దక్షిణ భారత దేశంలో ఎంత మందికి మంత్రి పదవులు ఇచ్చారని ప్రశ్నించారు. వెంకయ్యకు ఉపరాష్ట్రపతి పదవి ఇచ్చారు. అది ప్రమోషనో, డిమోషనో అర్థం కాలేదన్నారు. దత్తాత్రేయను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1,03,904 కోట్లు రాష్ట్రానికి రావాల్సి ఉందన్నారు. నిధులు ఇవ్వకపోగా మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఈ అధికారం మీకు లేదన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో ఉంటే రాయలసీమ డిక్లరేషన్ పేరుతో కొత్త ఇబ్బందులను సృష్టించాలని చూశారన్నారు.

కోడికత్తి కేసులో కోడిగుడ్డుపై ఈకలు పీకారు

వైసిపి సహకరిస్తుందనే ధీమాతో బిజెపి వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి ఆరోపించారు. రాష్ట్ర హక్కులపై పోరాడకుండా ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి రావడమే మానేశారని, కానీ జీతాలు తీసుకుంటున్నారని ఎద్దేవాచేశారు. వైసిపి చేసేది అధర్మపోరాటమని విమర్శించారు. జగన్ పై దాడి కేసులో సిట్ చెప్పినదే ఎన్‌ఐఎ చెప్పిందని ' కోడికత్తి కేసులో కోడి గుడ్డుపై ఈకలు పీకారంటూ' ఎద్దేవా చేశారు. బిజెపి హయాంలో సిబిఐ, ఆర్‌బిఐ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలన్నీ భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. కేరళలో కూడా అయ్యప్ప భక్తులను తమ రాజకీయ లబ్ధికోసం వాడుకునేందుకు రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ' సేవ్ నేషన్ ' నినాదంతోపాటు రాష్ట్ర హక్కుల కోసం పోరాడతామన్నారు.



తెలుగు రాష్ట్రాల్లో చలి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ ఏడాది మునుపెన్నడూ లేనంత చలి భారతదేశంలోనూ, తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రభావం చూపింది. ప్రస్తుతం ఉత్తర భారతదేశంలోని కాశ్మీర్, ఢిల్లీలోనూ గడ్డకట్టేంతగా చలి ప్రభావం చూపిస్తోంది. వాస్తవంగా డిసెంబరు, జనవరి వరకే తెలుగు రాష్ట్రాల్లో చలి ప్రభావం ఉంటుంది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం వరకూ ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాంధ్రలో చలి కొనసాగే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత శాస్త్రజ్ఞులు రాళ్లపల్లి మురళీకృష్ణ వివరించారు. సాధారణంగా ఏటా ఉత్తర ధ్రువం ఆర్కిటిక్ నుంచి అధిక పీడనం ప్రభావంతో చలి గాలులు మధ్యధరా సముద్రం వైపునకు వీస్తాయన్నారు. అక్కడ మైనస్ 70 నుంచి మైనస్ 80 వరకు ఉష్ణోగ్రతలు పడిపోతాయన్నారు. ఆర్కిటిక్ పరిసరాల నుంచి మధ్యదరా ప్రాంతం వైపునకు వచ్చిన చలి గాలులు అక్కడున్న పశ్చిమ ఆటంకాలను ప్రభావితం చేస్తాయని తెలిపారు. తద్వారా దక్షిణ ఐరోపా, ఆఫ్ఘనిస్తాన్, రష్యా, చైనా దేశాల మీదుగా పశ్చిమ ఆటంకాలు ప్రయాణం చేస్తుంటాయన్నారు. ఈ ఏడాది ఆర్కిటిక్ ధ్రువాల నుంచి విపరీతమైన చలి గాలులు రావడంతో ప్రేరేపితమైన పశ్చిమ ఆటంకాలు కొంచెం దక్షిణం వైపునకు వంగి భారత ఉపఖండంపైనా తీవ్ర ప్రభావం చూపించాయన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వాల్మీకీ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మంత్రి కాల్వ శ్రీనివాసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపించి 14 నెలల దాటినా నేటికీ మోడీ సర్కారు నిర్ణయం తీసుకోకపోవడమేమిటని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమస్యలపై శుక్రవారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపీలోని వాల్మీకీ బోయలు దేశంలోని అత్యంత ప్రాచీన 33 గిరిజన తెగల్లో ఒకరని, వారిని తక్షణమే ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి శాస్త్రీయ అధ్యయనాన్ని చేయించారని, సుమారు 11నెలల పాటు ప్రొఫెసరు సత్యపాల్ అధ్యయనం చేసి సమగ్ర నివేదికను సమర్పించారని సభ దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పంపే తీర్మానాలపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం తక్షణమే స్పందించి వాల్మీకీ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని మంత్రి కాల్వ శ్రీనివాసులు కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి ద్రోహం

బడ్జెట్‌పై సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ రాష్ట్రానికి ద్రోహం చేసిందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చిందని, ప్రత్యేక హోదా ప్రస్తావన లేదని, విభజన హామీల అమలుకు ఒక్క పైసా కూడా కేటాయించలేదని తెలిపారు. కేవలం ఎన్నికల్లో రాజకీయ అవసరార్థం కన్నీటి తుడుపుగా కొన్ని పథకాలను ప్రకటించి చేతులు దులుపుకుందని, దీన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా నిరసిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం నాడు రాష్ట్ర ప్రజలు వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారని, ఈ ఉద్యమాన్ని హోదా సాధించుకునేంత వరకూ కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి విభజన హామీల అమలు, వెనకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు లేవని, రైల్వే జోన్ గురించి గానీ, కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు గురించి గానీ ప్రస్తావన లేదని, మొత్తంగా ఈ బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించినా దేశంలోని రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధర దక్కలేదని, దేశవ్యాప్తంగా రైతులు రుణమాఫీ డిమాండ్ చేస్తున్నారని, వారి ఘోష పట్టించుకోలేదని పేర్కొన్నారు. గత నాలుగున్నరేళ్లలో రైతుల ఆత్మహత్యలను నివారించడంలో విఫలమైన బిజెపి ప్రభుత్వం కంటితుడుపు చర్యగా ఐదెకరాల లోపు రైతులకు సంవత్సరానికి రూ.6వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించిందని, ఈ ఎన్నికల జిమ్మిక్కులు రైతులు విశ్వసించరని, ఇది వ్యవసాయ సంక్షోభాన్ని, రైతుల ఆత్మహత్యలను ఏ మాత్రమూ పరిష్కరించలేదని తెలిపారు. మోడీ ఇచ్చే రూ.6వేలు పెరుగుతున్న డీజిల్ రేట్లకు కూడా సరిపోదని, మోడీ ప్రభుత్వం కనీసం రూ.10వేల సాయం ప్రకటిస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. మోడీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అడ్డులేకుండా పోయిందని, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని, జిఎస్టీ పేరుతో అన్ని రకాల వస్తువులు, సేవల ధరలు పెరిగాయని, నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థనే దెబ్బతీసిన మోడీ ప్రభుత్వం అవాస్తవాలతో వాటిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్ ఇస్తామంటూనే వారి పైనే బీమా భారాన్ని మోపిందని, దేశ వ్యాప్తంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ప్రకటించారని, కొత్త ఉద్యోగాలు లేవు సరికదా ఉన్న ఉద్యోగాలకే మోడీ ప్రభుత్వం ఎసరు పెట్టిందని, నోట్ల రద్దు వల్ల దాదాపు 1.10 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని పేర్కొన్నారు. గత 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగ సమస్య పెరిగిందని ఎన్ఎస్ఎస్ఓ నివేదికే తెలిపిందని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు శూన్యమని తెలిపారు.

ప్రత్యేకం



- **విభజన హామీలు అమలు చేయాలి - ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి**

విభజన హామీలను అమలు విషయంలో కేంద్రం చొరవ చూపాలని, పోలవరం నిర్మాణానికి నిధులు తక్షణమే ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నేటి సభలో విభజన చట్టంలో ఉన్న అంశాలపై కాకుండా, రాజకీయ విమర్శలకే మాత్రమే సరిపెట్టటం బాగోలేదని అభిప్రాయపడ్డారు.

- **బిజెపివి కుట్రపూరిత రాజకీయాలు - ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు**

బిజెపి కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతూ ఎపి అభివృద్ధిని అడ్డుకుంటోందని టిడిపి ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ఆరోపించారు. శాసన మండలి సమావేశాల్లో భాగంగా, మీడియా పాయింట్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడంలో బిజెపి కుట్ర రాజకీయాలను అనుసరిస్తోందన్నారు. ఎపికి రూ.90వేలకోట్లు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోంద న్నారు.

- **మోడీది నిరంకుశ వైఖరి - ప్రభుత్వ విప్ కూన రవికుమార్**

నరేంద్ర మోడీకి ఏపీపై ఉన్న నిరంకుశ వైఖరిని నేటి బడ్జెట్‌తో మరోసారి రుజువు చేశారని విప్ రవికుమార్ విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎపి ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు రాష్ట్రంలోని అన్ని వర్గాలవారిని నిరాశపర్చిందని పేర్కొన్నారు. ఆర్థిక నేరాలు చేసిన వారు విదేశాలకు పారిపోయేందుకు కేంద్రం సహకరించిందని విమర్శించారు. నేటి బడ్జెట్ ఎలక్షన్ బడ్జెట్‌లా ఉందని అభివర్ణించారు.

- **పోలవరం బాధ్యత బిజెపిదే - ఎమ్మెల్సీ మాధవ్**

పోలవరానికి సంబంధించిన పూర్తి బాధ్యత బిజెపి తీసుకుంటుందని బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ స్పష్టం చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమకి సంబంధించిన మౌలిక సదుపాయాలు కల్పించనందునే కేంద్రం సహకరించలేదన్నారు. ఎపికి సెంట్రల్, ట్రైబల్ యూనివర్సిటీలు వచ్చే నెలలో వస్తాయనీ, వాటికి నిధులు కూడా విడుదల చేస్తున్నామని తెలిపారు. ఎయిమ్స్ ఆసుపత్రి కూడా త్వరలోనే పూర్తి కాబోతుందన్నారు.

- **ఎపికి లభించిన అవార్డులు కేంద్ర ఘనతే - ఎమ్మెల్సీ సోము వీర్రాజు**

ఎపికి లభించిన 670 అవార్డులు కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకే లభించాయని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకానికి రూ.40 వేల కోట్లు ఇస్తే, దాని గురించి సభలో మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. ఎపిలో కరువు నివారణకై ఇచ్చిన రూ.350 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా ఖర్చు పెడుతోందనే కేంద్రం వెనక్కి తీసుకుందని పేర్కొన్నారు. వెనక్కి తీసుకున్న వాటి గురించి చెప్తున్నారే తప్ప, ఇచ్చిన వాటి గురించి చెప్పడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

- అమరావతి బ్యూరో

సంక్షిప్తం

ఏపీకి మరోసారి మొండి చెయ్యి : కంభంపాటి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏపీకి మరోసారి మొండి చెయ్యి చూపిందని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి కంభంపాటి రామ్మోహన్‌రావు అన్నారు. ఎన్నికల కోసం మోడీ ఎన్ని ఎత్తుగడలు వేసినా ప్రజలు విశ్వసించరని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యతరగతి ప్రజలకు నాలుగేళ్లు వాతలు పెట్టి చివరిలో వెన్న పూసిన విధంగా బడ్జెట్ ఉందన్నారు. పోలవరానికి అదనపు నిధులు, ప్రత్యేకహోదా, రైల్వే జోన్‌ల ప్రస్తావనే లేదన్నారు. ఎన్నికల ముందు హడావుడిగా హామీలిస్తున్నారని, ఇలాంటి ఎత్తుగడలను ప్రజలు విశ్వసించరని ఆయన తెలిపారు. కేంద్ర బడ్జెట్ ఐదు కోట్ల ఆంధ్రులకు నిరాశ మిగిల్చిందన్నారు. 43 ఏళ్ల రికార్డు స్థాయిలో 6.1శాతం నిరుద్యోగం పెరిగిందని నేషనల్ శాంపిల్ సర్వే వెల్లడించిందన్నారు. కోటి మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చామని చెబుతున్న కేంద్రప్రభుత్వం ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారో చెప్పలేదన్నారు.

రాజీనామాలు ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముగ్గురు శాసనసభ్యుల రాజీనామాలను స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆమోదించారు. ఈ మేరకు శాసనసభలో శుక్రవారం సభ్యుల రాజీనామాలు ఆమోదించినట్లు ప్రకటించారు. బిజెపి ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ(రాజమండ్రి), టిడిపి ఎమ్మెల్యేలు రావెల కిషోర్‌బాబు (ప్రత్తిపాడు), మేడా మల్లికార్జునరెడ్డి (రాజంపేట)లు సమర్పించిన రాజీనామాలను అమోదించినట్లు స్పీకర్ తెలిపారు.

మాకూ రోషం ఉంది : మాణిక్యాలరావు

'మాకూ రోషం ఉంది కానీ రాజకీయ రోషం కాదు ' అంటూ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే మాణిక్యాలరావు శాసనసభలో అధికార పార్టీ విమర్శలపై సమాధానమిచ్చారు. విభజన హామీలపై శుక్రవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం 9 నెలల్లో తాత్కాలిక అసెంబ్లీ నిర్మించింది కానీ కేంద్రం సహకరిస్తామని చెప్పినా తాడేపల్లిలో ఎన్‌ఐటికి రెండున్నరేళ్లయినా కాంపౌండ్ వాల్ కట్టలేకపోయిందని ఎద్దేవా చేశారు. కేంద్రం అన్ని రాష్ట్రాల కంటే ఇక్కడే ఎక్కువ చేసిందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో రెండు కళ్ల సిద్ధాంతంతో ఉన్న టిడిపి రాష్ట్రానికి ఏమి కావాలో అడగలేకపోయిందన్నారు. టిడిపి ఎమ్మెల్యేలు లేకుండా ఇన్‌ఛార్జులు అధికారంలో ఉన్న నియోజకవర్గాలలో కేంద్రం ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక హోదాకు సమానంగా నిధులు తీసుకుని అందుకు తగినట్లుగా అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు.

సిపిఎస్ రద్దుకు 7న చలో అసెంబ్లీ

ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్) రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ ఫ్యాప్టో ఈ నెల 7న చలో అసెంబ్లీకి పిలుపునిచ్చింది. ప్రభుత్వానికి ప్రత్యక్ష చర్య నోటీసును ఫ్యాప్టో నాయకులు శుక్రవారం అందజేశారు. నాలుగేళ్లుగా సిపిఎస్ రద్దుకై ఫ్యాప్టో అనేక ప్రాతినిధ్యాలు, పోరాటాలు చేస్తే ప్రభుత్వం కాలయాపన కోసం కమిటీ వేసిందని విమర్శించారు. ఈ తీరును నిరసిస్తూ అసెంబ్లీ సమావేశాల్లో సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం పరిధిలో 1,86,000 ఉద్యోగులు, పోలీసులు, ఉపాధ్యాయులు సిపిఎస్ పరిధిలో ఉన్నారని వివరించారు. పదవి విరమణ తరువాత కనీస పెన్షన్ గ్యారెంటీ లేకపోవడంతో వృద్ధాప్యంలో కనీస భద్రత కోల్పోతున్నారని తెలిపారు. సిపిఎస్ రద్దు చేస్తామని ప్రతిపక్ష నేత జగన్ మోహన్‌రెడ్డి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్, వామపక్ష పార్టీలు ఇప్పటికే తమ మానిఫెస్టోలో తెలిపారని వివరించారు. అధికారంలో ఉన్న టిడిపి తన వైఖరిని స్పష్టం చేస్తూ అసెంబ్లీ సమావేశాల్లో సిపిఎస్ రద్దు చేస్తూ తీర్మానం చేయాలని, ఎన్ఎస్‌డిఎల్, రికవరీలను ఆపాలనీ, 653,654,655 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నోటీసు అందజేసిన వారిలో చైర్మన్ పి బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి హృదయరాజు, కో చైర్మన్ పి కృష్ణయ్య జెఎసి సెక్రటరీ జనరల్ సిహెచ్ జోసఫ్ సుధీర్ బాబు ఉన్నారు. చలో కార్యక్రమాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.





బుజ్జగింపులు ... తాయిలాలు!

చివరి బడ్జెట్‌లో ఓట్లపైనే దృష్టి

న్యూఢిల్లీ : ఎన్నికల వేళ నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌లో పూర్తిగా ఓట్లపైనే దృష్టి సారించింది. నాలుగన్నరేళ్ల కాలంలో ఆగ్రహానికి గురైన ప్రజానీకానికి తాయిలాలు పందారం చేయడం ద్వారా బుజ్జగింపుల పర్వానికి దిగింది.

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తలబొప్పికట్టడంతో బడ్జెట్ ప్రతిపాదనల్లో ముంచెత్తే పథకాలను ముందుకు తీసుకువచ్చింది. ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అనారోగ్యంతో అమెరికా వెళ్లడంతో కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ 2019-20 సంవత్సరపు తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



అసంఘటిత కార్మికులకు ఫించను

"అసంఘటిత రంగంలోని పలు పరిశ్రమలలో దాదాపు42 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి సమగ్ర సామాజిక భద్రతను కల్పిస్తాం" అని గోయల్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ఇతర పథకాల ద్వారా కల్పిస్తున్న ఆరోగ్య రక్షణకు అదనంగా ప్రభుత్వం ఈ పెన్షన్ పథకాన్ని ప్రకటించింది. దీని "ప్రధాన మంత్రి శ్రమ యోగి యోజన"అని పేరు పెట్టింది.

నెలకు రూ.15 వేల ఆదాయం పొందుతున్న అసంఘటిత రంగ కార్మికులకు కొత్త పథకాన్ని వర్తింపజేస్తుంది. ఈ పథకం కింద కార్మికులకు 60 ఏళ్లు నిండిన అనంతరం నెలకు రూ.3 వేలు పెన్షన్ పొందుతారు. అయితే వీరు 60 ఏళ్ల వయస్సు వచ్చే వరకు నెలకు రూ.100లు చెల్లించాలి. దీనివల్ల అసంఘటిత రంగంలో ఉన్న 10 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరనున్నదని గోయల్ తెలిపారు.

ద్రవ్య లోటు

ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు 10 బేసిస్ పాయింట్లు కంటే తక్కువకు ఉంటుందని గోయల్ అన్నారు. 3.4 శాతంగా ద్రవ్యలోటు ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే మార్కెట్లు దీనికి అనుగుణంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. వచ్చే 3.5 లేదా 3.6 శాతంగా ద్రవ్యలోటు ఉండేవకాశం ఉందనివిశ్లేషకులు పేర్కొన్నారు. జిఎస్‌టి అంశాన్ని ఆయన ప్రస్తావించకపోయినప్పటికీ, దాని వసూళ్లు కూడా సరిగా లేవు. అవి సరిగా వసూలయి ఉంటే ద్రవ్య లోటు అనుకున్న లక్ష్యాన్ని సాధించి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రిటర్న్స్ పెరిగాయి...

ఆదాయం పన్నుకు సంబంధించి రిటర్న్స్ దాఖలు 80 శాతం పెరిగాయని గోయల్ తెలిపారు. "వారి విరాళాలను పేదలకు సేవ చేసేందుకు వినియోగిస్తాం. ఆదాయపన్ను శాఖను కంప్యూటరీకరించాం. రిటర్న్స్, ఎస్సెస్‌మెంట్స్, ఫండ్స్ అన్ని ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. గత ఏడాది ఆన్‌లైన్‌లో 99.54 శాతం రిటర్న్స్ దాఖలయ్యాయి" అని గోయల్ తెలిపారు. గృహ కొనుగోలు దారులకు ప్రభుత్వం జిఎస్‌టిని తగ్గించనున్నట్లు తెలిపారు. అయితే దానిని ఇప్పుడు ప్రకటించలేదు. టాక్స్ కౌన్సిల్ ద్వారా ఇది జరగాల్సి ఉంది.



వేతన జీవులకు ఇలా...

వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు రూ.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందుతారని గోయల్ తెలిపారు. ఏడాదికి రూ.6.5 లక్షల ఆదాయం వున్నవారు ఎటువంటి ఆదాయం పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని, సెక్షన్ 80 సి కింద మినహాయింపు పొందవచ్చునని తెలిపారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.40 వేల నుండి రూ. 50 వేలకు పెంచినట్లు గోయల్ తెలిపారు. 3 కోట్ల మంది వేతన జీవులు, పెన్షనర్లు రూ.4 వేల కోట్ల వరకు అదనంగా పన్ను ప్రయోజనం పొందనున్నారని గోయల్ తెలిపారు. అంటే దాదాపు రూ.18,500 కోట్లు విలువైన పన్ను వసూళ్ళు మాఫీ చేసినట్లు తెలిపారు.

ప్రధానాంశాలు

1. రూ.5 లక్షల కన్నా తక్కువ ఆదాయం కలిగిన వారికి పూర్తిగా పన్ను మినహాయింపు
2. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేలకు పెంపు (అంతకుముందు రూ.40 వేలు)
3. అంతకుముందు రూ.10 వేల వరకు ఉన్న టిడిఎస్ వర్తింపు పరిధిని ఇప్పుడు రూ.40 వేలకు పెంచారు
4. గృహ అమ్మకానికి సంబంధించి. మూలధన ప్రయోజనాలను రెండు ఇళ్ళకు విస్తరించారు

పౌర విమానయానం

మౌలిక వసతుల అభివృద్ధి దేశానికి వెన్నెముక వంటిదని గోయల్ తెలిపారు. "పరిణామాత్మక విజయాలు సాధించడానికి వృద్ధిని దాటి వెళ్ళాం. ఉడాన్ యోజన పథకం వల్ల ఎవరైనా విమానంలో ప్రయాణించవచ్చు. విమానాశ్రయాల సంఖ్య త్వరలోనే 100కు చేరుకోనున్నది. గత ఐదేళ్ళ కాలంలో దేశీయ విమాన యానం రెట్టింపు అయింది" అని ఆయన అన్నారు.

ఈశాన్య రాష్ట్రాలు

"ఈశాన్య రాష్ట్రాల ప్రజలు మౌలిక సదుపాయాల ప్రయోజనాలు పొందనున్నారు. మేఘాలయ, త్రిపుర, మిజోరం రాష్ట్రాలు తొలిసారిగా దేశ రైల్వేల మ్యాప్‌లో స్థానం సంపాదించుకోనున్నాయి" అని గోయల్ తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు 2020 ఆర్థిక సంవత్సరంలో 20 శాతం పైగా బడ్జెట్‌ను పెంచనున్నట్లు తెలిపారు. అంటే దాదాపు రూ.58,166 కోట్లు కేటాయించనున్నట్లు ఆయన చెప్పారు.

రక్షణకు 3 లక్షల కోట్లు

రక్షణ శాఖకు తొలిసారిగా 2020 ఆర్థిక సంవత్సరం కేటాయింపులు రూ.3 లక్షల కోట్లు దాటనున్నట్లు గోయల్ తెలిపారు. గత ఏడాది ఈ బడ్జెట్ రూ.2.95 లక్షల కోట్లు మాత్రమే ఉన్నదన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.అయితే, పెరిగిన ద్రవ్యోల్బణం, తగ్గిన రూపాయి విలువతో పోల్చుకున్నప్పుడు ఇది చాలాతక్కువ మొత్తమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాడి పరిశ్రమ-ఆవులు

రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకానికి ఈ ఏడాది రూ.750 కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు గోయల్ తెలిపారు. ఆవులకు సహాయపడే రాష్ట్రీయ కామధేను యోజన పథకాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

మరికొన్ని కేటాయింపులు

ఎన్‌ఆర్‌ఇజిఎ : 2019-20 సంవత్సరానికి గాను గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు రూ.60 వేల కోట్లు

రహదారులు : ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన పథకం కింద రహదారుల అభివృద్ధికి 2020 ఆర్థిక సంవత్సరానికి రూ.19 వేల కోట్లు.



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్

"గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రధాన చోదక శక్తిగా వ్యవసాయం కొనసాగుతోంది. గడిచిన నాలుగున్నరేళ్ళలో చేపట్టిన రైతు అనుకూల విధానాలు వస్తు ఉత్పత్తులను పెంచాయి" అని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్న గోయల్ 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి" పేరుతో రైతులకు కొత్త ఆదాయ పథకాన్ని ప్రకటించారు. చిన్న, సన్నకారు రైతులను లక్ష్యంగా చేసుకుకని ఈ పథకాన్ని రూపొందించారు. ఈ పథకం కింద రెండు హెక్టార్ల కన్నా తక్కువ భూమి కలిగిన రైతులకు ఏడాదికి రూ.6 వేలను మూడు విడతలుగా వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తారు. "ఈ పథకం 100 శాతం ప్రభుత్వ నిధులతో అమలు అవుతుంది" అని గోయల్ తెలిపారు. ఈ పథకానికి రూ.70 వేల కోట్లు కేటాయిం పులు ప్రకటించారు. 2019 ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు రూ.25 వేల కోట్లుగా అంచనాలను సవరించారు.ఇప్పటికే తెలంగాణలో రైతు బంధు పేరుతోనూ, ఒడిషాలో కలియా పేరుతోనూ అమలవుతున్న పథకాల తరహాలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకు వచ్చింది. . " రైతులు ప్రకృతి విపత్తుల ప్రభావానికి లోనైనప్పుడు ఇచ్చే రుణ సహాయంపై 2 శాతం వడ్డీ, సకాలంలో చెల్లించిన వారికి 3 శాతం వడ్డీ మినహాయింపు రాయితీలు ఇవ్వనున్నాం" అని ఆయన తెలిపారు.

ఎన్నికల జిమ్మిక్కు

సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శ

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

కేంద్ర ఇన్‌ఛార్జ్ ఆర్థిక మంత్రి పీయూష్‌గోయెల్ శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ మోడీ సర్కారు ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగమేనని సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శించింది. సమాచారాన్ని తొక్కిపట్టి, వాస్తవాలను తారుమారుచేసి జిమ్మిక్కులతో ప్రజలను మోసగించటంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికే ఆరితేరిందని, అటువంటి జిమ్మిక్కుల్లో భాగమే శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. మోడీ సర్కారు ట్రాక్ రికార్డు గురించి గొప్పలు చెప్పుకుంటూ, అరచేతిలో స్వర్గం చూపే హామీలను ఇస్తూ తాత్కాలిక ఆర్థిక మంత్రి చేసిన బడ్జెట్ ప్రసంగం ఇప్పటికే అనేక భారాలతో కుంగిపోతున్న భారతీయుల పట్ల క్రూరమైన పరిహాసమే అవుతుందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. ప్రభుత్వం పార్లమెంట్‌లో శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రానున్న ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్ కాదు. ఇటు లోక్‌సభతో పాటు ప్రభుత్వ పదవీ కాలం కాలం కూడా రెండు నెలల్లో ముగుస్తుండటం ఇందుకు ప్రధాన కారణం. 2019-20 సంవత్సరానికి బడ్జెట్‌లో రెవిన్యూ సమీకరణ, కేటాయింపులు, వ్యయం వంటి అంశాలు ప్రజల తీర్పు అనంతరం ఏర్పడే 17వ లోక్‌సభలో రూపుదిద్దుకుంటాయన్న అంశం గమనార్హం. రానున్న ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా వుంటుందోనన్న బిజెపి భయాందోళనలకు దర్పణమే శుక్రవారం నాటి బడ్జెట్. గత ఏప్రిల్-నవంబర్ మధ్య కాలానికి సంబంధించిన లెక్కలను పరిశీలిస్తే కేంద్ర పన్ను రెవిన్యూలు గత ఆర్థిక సంవత్సరం కన్నా కేవలం 7.1 శాతం మేర మాత్రమే పెరిగాయి. అయితే 2017-18 వాస్తవ రెవిన్యూ వసూళ్ల కన్నా 2018-19 బడ్జెట్‌లో సవరించిన అంచనాల ప్రకారం 17 శాతం పెరుగుదలను ప్రతిపాదించారు. అది మాత్రమే కాదు. గత ఏడాది ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాలకు రు.23,067 కోట్లు తక్కువగా పన్ను రెవిన్యూ ఆదాయం నమోదయింది. ఈ ఏడాది కూడా అదే పునరావృతమవుతోంది. తాజా బడ్జెట్ అంచనాలలో ప్రభుత్వం ఆదాయపు పన్ను, జిఎస్‌టి ద్వారా సమకూరే రెవిన్యూ వసూళ్లను గోరంతలు కొండంతలు చేసి చూపుతోంది. నోట్ల రద్దు, పన్ను సంస్కరణల వంటి వాటి పరిణామాలను ప్రత్యక్షంగా అనుభవించినప్పటికీ ప్రభుత్వం మాత్రం అబద్ధాలతో బడ్జెట్‌లో తప్పుడు లెక్కలను చూపుతోంది. రెవిన్యూ వసూళ్లలో కొరత వున్నప్పటికీ మోడీ సర్కారు 2016లో ప్రవేశపెట్టిన సంపదపన్ను మినహాయింపు ప్రక్రియను ఇప్పటికీ కొనసాగిస్తూనే వుంది. రెండో ఇల్లు వున్న ధనికులకు పన్ను మినహాయించారు. పేదల నుండిపన్నుల రూపంలో పిండిన సొమ్మును మినహాయింపుల రూపంలో ధనికులకు కట్టబెడుతున్న మోడీ సర్కారు క్రూరమైన లాజిక్‌ను అనుసరిస్తోంది.

తాయిలాలు

గత డిసెంబర్ 1 నుండి అమలులోకి వచ్చినట్లు చెబుతున్న రైతులకు ఆదాయ మద్దతు పథకం కింద రు.20 వేల కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సవరించిన బడ్జెట్ వ్యయం అంచనాలు ఆ మేరకు బడ్జెట్ అంచనాలను మించకపోవటం గమనార్హం. ఇతర పద్దులకు కోతలు పెట్టి ముఖ్యంగా జిఎస్‌టి పరిహార నిధికి కోతపెడుతూ ప్రభుత్వం ఈ కేటాయింపులను ప్రకటించింది. ఇది కూడా మోసపూరితమైనదే... నలుగురు సభ్యులున్న రైతు కుటుంబా నికి రోజుకు తలసరి రు.4 అందచేస్తే అది ఆదాయ మద్దతు అవుతుందనటం హాస్యాస్పదం. నానాటికీ పెరుగుతున్న వ్యవసాయ సంక్షోభం రైతుల ఆదాయానికి ఇంతకన్నా ఎక్కువ గానే గండికొడుతోంది. ఇది ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధర కల్పిస్తామన్న హామీ అమలులో విఫలమైన ప్రభుత్వం తన ద్రోహాన్ని కప్పిపుచ్చుకునేందుకు చేసే ప్రయత్నమే అవుతుంది.

రాష్ట్రాలపై దాడులు

తక్కువ రాబడి వుండే పన్ను రెవిన్యూ భారాన్ని రాష్ట్రాలపైకి నెట్టివేయటం మరో విభ్రాంతికర పరిణామం. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను మినహాయించగా 2018-19లో కేంద్ర ప్రభుత్వ నికర ఆదాయం బడ్జెట్ అంచనాల కన్నా కొద్ది ఎక్కువగానే వుంది. అదే విధంగా రాష్ట్రాలకు బదలాయించాల్సిన జిఎస్‌టి పన్ను పరిహార నిధిని రు.38,265 కోట్లను మినహాయించాల్సి వుండగా, బడ్జెట్ అంచనాల ప్రకారం కేంద్రం బడ్జెట్‌లో జిఎస్‌టి రెవిన్యూ ఆదాయంలో కొరత రాష్ట్రాల ఆదాయానికి గండి కొడుతుంది. మరో మాటలో చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక లోటును రాష్ట్రాలపై మోపటమే అవుతుంది. 'సహకార సమాఖ్య భావన' అంటే ఇదేనేమో...

'ప్రధానమంత్రి శ్రమయోగి మంధన్' పేరిట ప్రకటించిన పెన్షన్ పథకం మరో మోసం. ఒక వ్యక్తి నెలసరి రు.100 చెల్లిస్తే 32 ఏళ్ల తరువాత నెలకు రు.3 వేల పెన్షన్ అందచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంటే మూడు దశాబ్దాల తరువాత కూడా లబ్దిదారుల ఆర్థిక పరిస్థితి ఇలాగే వుండాలని ప్రభుత్వం భావిస్తోందా? ఇంత 'గొప్ప హామీ'నిచ్చిన ప్రభుత్వం లబ్ది దారులు చెల్లించిన సొమ్మును బీమా కంపెనీలు లేదా పెన్షన్ నిధుల్లో పెట్టుబడి పెట్టి రు.500 కోట్ల మేర ఆర్జిస్తుంది. ఇది మాత్రం లబ్దిదారులకు అందని మానిపండే...

దేశంలో నానా టికీ పెరుగుతున్న నిరుద్యోగితపై ఎన్ఎస్-ఎస్ఓ అందించిన సమాచారాన్ని తాత్కాలిక ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో దాటవేశారు. ఉద్యోగార్థులు ఉద్యోగాలిచ్చే వారుగా మారాల్సిందే. అయితే అందుకు సహకరించాల్సిన ప్రభుత్వ విధానాలు ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతూ అవకాశాలను ఆవిరి చేస్తున్నాయి. ప్రధాని మోడీ చెప్పిన 'పకోడీ' లాజిక్కు ఈ బడ్జెట్‌ను అధికార ముద్రగా చెప్ప వచ్చు. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే 2019-20 కేంద్ర బడ్జెట్ మోడీ సర్కారు దివాలాకోరు తనాన్ని ప్రతిబింబిస్తోందని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. ఒక్క రూపాయి కూడా కేటా యించ కుండానే రైతుల బాధలు, పేదరికం, నిరుద్యోగిత వంటి ప్రజల వాస్తవిక సమస్యలను ప్రభుత్వం తన మాటలతో 'తొలగించింద'ని వ్యాఖ్యానించింది. 2019 ఎన్నికల తీర్పులో కఠోర వాస్తవం అందరికీ తెలుస్తుందని సిపిఎం పొలిట్ బ్యూరో స్పష్టం చేసింది.

రైల్వేలకు రూ.1.58 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : కేంద్ర తాత్కాలిక బడ్జెట్‌లో రైల్వేలకు రూ.1.58 లక్షల కోట్లు మూల వ్యయాన్ని కేటాయించారు. రైల్వేల నుండి కోల్పోతున్న ఆదాయాన్ని తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నంలో భాగంగా ఆ మొత్తాన్ని కేటాయిస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో మంత్రి తెలిపారు. బ్రాడ్‌గేజ్ రైలు మార్గాల్లో మానవ రహిత లెవల్ క్రాసింగ్‌లను పూర్తిగా తొలగించినట్లు చెప్పారు. "రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.1.58 లక్షల కోట్ల మూల వ్యయంతో రైల్వేలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దేశీయంగా అభివృద్ధి చేసిన 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రైలు దేశీయంగా అభివృద్ధి చెందిన సాంకేతికతకు చిహ్నామని ఆయన చెప్పారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా రూపొందించిన దీని వల్ల ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని పీయూష్ గోయల్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వేల ఆపరేటింగ్ రేటు 96.2 శాతంగా ఉందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 95 శాతం ఆపరేటింగ్ రేట్‌ను సాధించనున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైలు ఛార్జీల పెంపుదల లేదన్నారు.

బడ్జెట్‌లో మరికొన్ని

1. రానున్న రెండేళ్ళలో ఆదాయం పన్ను రిటర్న్స్‌కు సంబంధించిన వ్యవహారాలన్నీ 24 గంటల్లోగా పూర్తి అయ్యేటట్లు చర్యలు తీసుకుంటున్నారు ఆన్‌లైన్ ద్వారా ప్రక్రియ జరుగుతుందని ప్రకటించారు
2. త్వరలోనే దేశీయంగా అభివృద్ధి చేసిన సెమి హై స్పీడ్ ఎక్స్‌ప్రెస్ 'వందే భారత్'ను ప్రారంభించనున్నారు
3. రానున్న ఐదేళ్ళలో లక్షకు పైగా డిజిటల్ గ్రామాలు
4. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి రూ.58,166 కోట్లు కేటాయింపు
5. పైరసీని, బాలీవుడ్ సినిమాల చౌర్యాన్ని అరికట్టేందుకు భారతీయ సినిమాటోగ్రాఫ్ చట్టంలో పలు నిబంధనలు
6. భారతీయ సినీ నిర్మాతలకు సింగిల్ విండో క్లియరెన్స్
7. పశు సంరక్షణ కింద రైతులకు 2 శాతం వడ్డీ రాయితీతో రుణాలు
8. ప్రకృతి విపత్తుల ప్రభావిత రైతులకు రుణాలపై 2 శాతం వడ్డీ రాయితీ, సకాలంలో తిరిగి చెల్లించిన వారికి 3 శాతం వడ్డీ రాయితీ
9. హర్యానాలో 22వ ఎయిమ్స్ ఏర్పాటు
10. జాతీయ కృత్రిమ మేథ పోర్టల్ అభివృద్ధి
11. ఈఎస్ఐ వర్తింపు పరిధి రూ.21 వేలకు పెంపు
12. కనీస పెన్షన్ రూ.1000కి పెంపు



మోస పూరిత బడ్జెట్ : సిఐటియు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తనపదవీ కాలం ముగిసే ముందు శుక్రవారం ప్రవేశపెట్టిన చివరి (తాత్కాలిక) బడ్జెట్ ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని సిఐటియు ఒక ప్రకటనలో విమర్శించింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి అనివార్యమని తెలిసి కూడా నిరాశ, నిస్పృహలతో ప్రజల ఓట్లు ఆకర్షించేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ మోసపూరిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని వ్యాఖ్యానించింది. వివిధ వర్గాలకు 'తాయిలాల' పేరుతో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది రైతులు, కార్మికులు, పేదలను పీల్చి పిప్పి చేస్తున్న కార్పొరేట్ నయా సరళీకరణ అజెండాను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నమే తప్ప మరొకటి కాదని స్పష్టం చేసింది. రైతులకు డబ్బులిస్తున్నందున ద్రవ్యలోటు భర్తీ చేసే లక్ష్యాన్ని తాము చేరుకోలేకపోతున్నామని తాత్కాలిక ఆర్థిక మంత్రి చెబుతున్నారని, ప్రభుత్వ పెట్టుబడులతో ఉపాధి అవకాశాల కల్పన ద్వారా ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు ఈ బడ్జెట్ చేసిందేమీ లేదని తేల్చిచెప్పింది. ప్రభుత్వ రంగ సంస్థల డిజిన్వెస్ట్‌మెంట్, ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగిస్తామని ప్రభుత్వం అహంకార పూరితంగా చెప్పటం దేశ స్వయం సమృద్ధిని, ఆర్థిక వ్యవస్థను సమూలంగా నాశనం చేయటమే అవుతుందని స్పష్టం చేసింది. ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతున్న నిరుద్యోగితను ఏ మాత్రం పట్టించుకోని ప్రభుత్వం ఈ సమస్యపై ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించిన అధ్యయన వివరాలను తొక్కిపట్టి ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేస్తోందని విమర్శించింది. కార్మికులు, రైతుల ఆదాయాలు వేతనాలను మెరుగు పరిచే ప్రతిపాదనలేవీ లేని ఈ తాత్కాలిక బడ్జెట్ వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలన్న రైతుల డిమాండ్‌ను పెడచెవిన పెడుతోందని మండిపడింది. ఎటువంటి పథకమూ లేకుండానే అసంఘటిత రంగ కార్మికులకు రు.3 వేలు నెలసరి పెన్షన్‌ను అందిస్తామని చెప్పటం మరో మోసపూరిత చర్య అని విమర్శించింది. ఆదాయపు పన్ను పరిమితిని పెంచటం దీర్ఘకాలంగా వున్న డిమాండే తప్ప కొత్తగా ప్రజలకు చేసిందేమీ లేదని సిటూ తన ప్రకటనలో స్పష్టం చేసింది. వ్యవసాయ సంక్షోభాన్ని అర్థవంతమైన రీతిలో పరిష్కరించాలన్న ఆలోచన లేని ప్రభుత్వం ఐదెకరాల లోపు వున్న రైతులకు ఏడాదికి రు.6 వేలు అందచేస్తామనటం వారి పట్ల క్రూర పరిహాసమే అవుతుందని తెలిపింది.

ఉపాధి హామీ అరకొరే!

గతేడాది కన్నా తక్కువ నిధులు

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2019-20 ఆర్థిక సంవత్సరానికి రు.60వేల కోట్ల రూపాయలను మాత్రమే తాజా బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది. ఇది 2018-19 ఆర్థిక సంవత్సరానికి మంజూరు చేసిన నిధుల కన్నా 1.8శాతం తక్కువ! దేశ వ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో ఆర్థిక డిమాండ్లను తట్టుకునేందుకు గానూ ఈ కార్యక్రమానికి అదనంగా రు.6,084కోట్లు కేటాయించాల్సి వచ్చింది. దాంతో 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా ఇచ్చిన నిధులు రు.61,084కోట్లు అయ్యాయి. గతేడాది బడ్జెట్‌లో కేంద్రం కేటాయించింది రు.55వేల కోట్లే. గత కొన్నేళ్ళుగా ఈ కార్యక్రమానికి బడ్జెట్‌లో ఇచ్చిన నిధులు, అదనపు నిధుల కేటాయింపు గమనంలోకి తీసుకున్నట్లైతే, డిమాండ్ నిలకడగా పెరుగుతూ వస్తున్న విషయం స్పష్టమవతోంది. అయితే, ఆ స్థాయిలో నిధుల కేటాయింపులు లేవు. చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఈ కార్యక్రమం పూర్తి స్థాయిలో అమలు కావాలంటే ఏడాదికి రు.80వేల కోట్లు అవసరమని పేర్కొంటూ 2018 బడ్జెట్‌కు ముందు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఎన్‌ఆర్‌ఇజిఎ సంఘర్ష్ మోర్చా మెమోరాండం అందచేసింది. గామీణప్రాంత దారిద్ర్యాన్ని నిర్మూలించేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమానికి నిధులు ఏమాత్రమూ సరిపోవడం లేదని జనవరి ప్రారంభంలో పలువురు ఎంపీలు, సామాజిక కార్యకర్తలు, ప్రధాని మోడీకి బహిరంగం లేఖ రాశారు. అయినా, కేటాయింపులు పెరగకపోగా తగ్గడం గమనార్హం.

మహిళలను విస్మరించిన బడ్జెట్

ఐద్వా విమర్శ

న్యూఢిల్లీ : ఎన్నికల వేళ మోడీ సర్కార్ ప్రకటించిన బడ్జెట్ మహిళలకు, రైతులకు, కార్మికులకు వ్యతిరేకంగా వుందని ఐద్వా విమర్శించింది. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా, మార్కెటింగ్‌పైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిన ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేయడానికి పూనుకుంటోందని పేర్కొంది. బడ్జెట్ రూపకల్పనకు కొద్ది రోజులు ముందుగా ఐద్వా ఆర్థిక మంత్రికి ఒక మెమోరాండం అందచేసిందని, మహిళలు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్ళను అందులో ప్రస్తావిస్తూ, తక్షణమే వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరిందని ఐద్వా ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే, ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తుంటే మహిళలు, కార్మికులు ఎదుర్కొనే తక్షణ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. స్వతంత్ర భారతంలో మోడీదే ఉత్తమ ప్రభుత్వమని చెప్పుకోవడానికి గానూ జిడిపి, ఉపాధి గణాంకాల నమోదులో అవకతవకలకు పాల్పడడంలో ప్రభుత్వం తలమునకలై వుందని, ఆ నేపథ్యంలోనే ఈ బడ్జెట్‌ను కూడా చూడాల్సి వుందని అన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై నేరాలు ప్రమాదకర స్థాయిలో పెరిగాయని, మహిళల్లో నిరుద్యోగ సమస్య కూడా ప్రబలిపోయిందని ఐద్వా నేతలు విమర్శించారు. ప్రభుత్వ ఆలోచనలను, విధానాలను ఎండగట్టేందుకు కృషి చేయాలని, వచ్చే ఎన్నికల్లో మోడీ సర్కార్‌ను గద్దె దించాలని ఐద్వా అన్ని ప్రజాతంత్ర శక్తులకు పిలుపునిచ్చింది.

ద్రోహం.. నిర్లక్ష్యం..

బడ్జెట్‌పై ఏఐకేఎస్

న్యూఢిల్లీ : రైతులను బీజేపీ ప్రభుత్వం మరోసారి ద్రోహానికి గురి చేసిందనీ, వారి నిజమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేసిందని ఏఐకేఎస్ ఆరోపించింది. రెండు హెక్టార్లు, లేదా ఐదు ఎకరాల భూమి వున్న రైతుకు కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో ఏడాదికి రూ. 6,000/- ప్రకటించిన విషయం తెలిసిందే. నెలకు రూ. 500/- లేదా రోజుకు రూ.15/-లు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి పరిష్కారం కాదని ఏఐకేఎస్ విమర్శించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదలచేసింది. ఇది బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ మరో మోసం. స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన నిజమైన డిమాండు సి2+50శాతాన్ని అన్ని పంటలకూ అమలుచేయాలని ఏఐకేఎస్ డిమాండ్ చేసింది. ఉత్పత్తికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని తద్వారా రైతులకు మెరుగైనా ఆదాయం లభిస్తుంది. సాగు లాభదాయకంగా ఉంటుంది. రైతులకు ఆదాయ వనరులు సమకూరిస్తే.. రుణాలను వడ్డీతో సహా తిరిగి చెల్లించే సామర్థ్యం వారికి వస్తుంది. గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే పరిస్థితి ఉంటుంది. మౌలిక సమస్యలను పరిష్కరించడానికి బదులు మోడీ ప్రభుత్వం రైతులను బుజ్జగించే చర్యలు చేపట్టిందనీ, ఇది ఆమోదయోగ్యమైనది కాదని ఏఐకేఎస్ స్పష్టంచేసింది. రైతు రుణమాఫీ గురించీ కూడా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించలేదని ఆరోపించింది. రైతులను రుణ విముక్తులను చేస్తామని గత ఐదేండ్లుగా ప్రభుత్వం వాగ్దానం చేస్తూ వచ్చిందనీ, చాలా ముఖ్యమైన ఈ డిమాండ్ విషయంలో మోడీ ప్రభుత్వం ద్రోహపూరితంగా వ్యవహరిస్తోందని, నేరపూరితమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని ఏఐకేఎస్ విమర్శించింది. ఏడాదికి రు.6వేలు ఇవ్వడమంటే వివిధ పంటల మొత్తం ఉత్పత్తి వ్యయంలో ఇది కేవలం 3 నుండి ఐదు శాతం వుంటుందని వారు పేర్కొన్నారు. ఈ పథకంలో కూడా వ్యవసాయ కూలీలను, కౌలు రైతులను, భూమిలేని కుటుంబాలను నిర్లక్ష్యానికి గురిచేసిందని విమర్శించారు. బీడు, ఎడారి భూముల్లో రెండు హెక్టార్లు లేదా ఐదు ఎకరాలు అని పరిమితి విధించడం వల్ల చాలామంది రైతులు ఈ పథకం పరిధిలోకి రాకుండా పోయారని పేర్కొన్నారు. వెంటనే రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేయాలని డిమాండ్ చేసింది.

అంగన్‌వాడీలకు మరోసారి మోసం

- 25న ఢిల్లీలో ఆందోళనకకు ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ పిలుపు

న్యూఢిల్లీ : శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2019-20 బడ్జెట్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న 26 లక్షల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను కేంద్ర ప్రభుత్వం మరోసారి మోసగించింది. అంగన్‌వాడీల వేతనాలు పెంచుతున్నట్లు గత సంవత్సరం సెప్టెంబర్ 11న ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ నిర్ణయం 2019, అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. ఇందు కోసం అనేక రాష్ట్రాల్లోని అంగన్‌వాడీలు ఎదురుచూస్తున్నారు. కానీ వారి ఆశలపై బిజెపి ప్రభుత్వం నీళ్లు చల్లింది. వేతనాలు పెంచుతామని తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పిన ఇన్‌ఛార్జి ఆర్థిక మంత్రి పియూష్ గోయల్, దానికి అనుగుణంగా కావాల్సిన కేటాయింపులు మాత్రం చేయలేదు. 2018 సెప్టెంబర్ 1 నుంచి 2020 మార్చి 31 మధ్య కాలానికి సంబంధించి ప్రధాని ఇచ్చిన హామీ ప్రకారం బడ్జెట్‌లో అదనంగా రూ.10,649.41 కోట్లు కేటాయించాలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో గత సెప్టెంబర్ 11న విడుదల చేసిన నివేదిక తెలిపింది. కానీ 2019-20 బడ్జెట్‌లో ఐసిడిఎస్ పథకానికి కేంద్రం రూ.19,834.37 కోట్లు కేటాయించింది. ఇది గత సంవత్సరం సవరించిన అంచనాలతో పోల్చుకుంటే కేవలం రూ.1944.18 కోట్లు మాత్రమే అదనం. అవసరమైన అదనపు నిధుల్లో ఇవి సగం కూడా లేవు. ఈ లెక్కన ప్రధాని ప్రకటించిన విధంగా కేటాయింపులు జరగలేదనేది స్పష్టమౌతోంది. అంగన్‌వాడీలకు ఉద్యోగ విరమణ అనంతరం పించను సదుపాయం కల్పిస్తామని 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ చివరి బడ్జెట్‌లోనూ ఆ ప్రస్తావన లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం నాణ్యతను పెంచేందుకు రూ.12 వేల కోట్లు కేటాయించనున్నట్లు 2017 సెప్టెంబర్‌లో ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈ హామీని అమలు చేసేందుకు గత రెండు బడ్జెట్‌లలో కూడా కేటాయింపులు చేసే విషయాన్ని ప్రభుత్వం మరిచిపోయింది. వారు చెప్పిన విధంగా అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నపిల్లల ఆరోగ్య కేంద్రాలుగా మార్చేందుకు అవసరమైన నిధులు కానీ, కనీసం దాని ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేదు. అయితే, ఐసిడిఎస్ పథకానికి సంబంధించి పౌష్టికాహారం స్థానంలో లబ్ధిదారులకు నగదు బదిలీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయిం చింది. దీనికి అనుగుణంగా పైలెట్ ప్రాజెక్టును ప్రతిపాదించింది.



బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, నగదు బదిలీకి వ్యతిరేకంగా, కనీస వేతనాలు, పింఛన్లు సంబంధించి 45వ అంతర్జాతీయ న్యాయ కమిషన్(ఐఎల్‌సి) ప్రతిపాదనలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 25న ఢిల్లీలో ఆందోళనలకు ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్(ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్) పిలుపునిచ్చింది. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల అంగన్‌వాడీ యూనియన్లు పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఐసిడిఎస్‌ను కాపాడుకునేందుకు తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరింది.

సంపాదకీయం

నివేదిక దాస్తే నిజాలు దాగేనా ?

ఎండమావుల్లో నీటి చెమ్మ, నేతి బీరలో నేయి ఎంత అవాస్తవమో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇన్నాళ్లు ప్రచారంలో ఉంచిన గణాంకాల్లో నిజం కూడా అంతేనని మొన్న జిడిపి జిమ్మిక్కులు, ఇప్పుడు నిరుద్యోగ సమాచార దాపరికాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఈ నిజాలు వెలుగులోకి వచ్చేందుకు దోహదం చేసిన జాతీయ గణాంకాల కమిషన్‌లోని ప్రభుత్వేతర సభ్యులు రాజీనామాలు సార్వత్రిక ఎన్నికల సమయాన కాషాయ కూటమికి గట్టి చెంప పెట్టుగా చెప్పవచ్చు.

ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామంటూ అధికారంలోకి వచ్చిన బిజెపి వాస్తవంలో దేశ యువతరాన్ని నిరుద్యోగ సైన్యంలోకి బలవంతంగా నెట్టి యావత్ భారతావనిని ఉపాధి సంక్షోభంలో పడేసిందని జాతీయ శాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) నివేదిక స్పష్టం చేస్తోంది. జులై 2017 - జూన్ 2018లో దేశ నిరుద్యోగిత రేటు 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయిలో 6.1 శాతానికి పెరిగిందని ఎన్ఎస్ఎస్ఓ తేల్చి చెప్పింది. ఈ నివేదికను ఎన్ఎస్ఎస్ఓ సిద్ధం చేసి ప్రభుత్వానికి 2018 నవంబరులోనే అందజేసినా.. దానిని మోడీ సర్కార్ ఉక్కు పాదాలతో తొక్కిపెట్టింది. 1972-73 నుండి ఇప్పటిదాక ఇదే అత్యధిక రేటు కాగా, పట్టణాల్లో 7.8 శాతం గానూ, గ్రామాల్లో 5.3 శాతం గానూ నిరుద్యోగిత ఉండటం ఆందోళనకరం. ప్రధానంగా యువత గత ఏడాదిలో కంటే ఈ ఏడాది అత్యధిక సంఖ్యలో నిరుద్యోగ సైన్యంలోకి నెట్టివేయబడ్డారని తేల్చింది. 2016 నవంబరులో రాత్రికి రాత్రే అత్యంత నిరంకుశ ధోరణిలో ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు, అనంతరం అమల్లోకి తీసుకొచ్చిన జిఎస్‌టి వల్లే నిరుద్యోగం పెరిగిపోయిందన్న వాస్తవం ఎన్ఎస్ఎస్ఓ నివేదికతో తేలిపోయింది.


బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ సుసంపన్నమైందని, బుల్లెట్ రైలులా ప్రతి యేటా 7 శాతం వృద్ధితో దూసుకెళ్తోందని మోడీ భజనపరులు ఇన్నాళ్లు గొప్పలు చెప్పుకున్నారు. ప్రతి యేటా 70 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామనీ, దానికి ఈ వృద్ధి రేటే నిదర్శనమని కాషాయ నేతలు దబాయించారు కూడా. వాస్తవానికి ఈ ప్రచారమంతా పెద్ద జిమ్మిక్కు. వాస్తవానికి ఉదారవాద విధానాలతో ఉపాధి రహిత అభివృద్ధి అని సామ్యవాద ఆర్థిక వేత్తలు చెబుతూనే వస్తున్నారు. మన అనుభవమూ దానినే బలపరుస్తోంది.

ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి అసంఘటిత రంగంలో అప్పటికే ఉపాధి పొందుతున్నవారిని ఇపిఎఫ్, ఇఎస్ఐ పరిధిలోకి తీసుకొచ్చి ఆ గణాంకాలే ఉద్యోగాల కల్పనగా కాగితాల్లోకి చేర్చారు. పాకెట్ మనీ కోసం ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి రవాణా సంస్థల్లో రిజిస్టరైన వారందరికీ నౌకరీలు మోడీ సర్కార్ సృష్టించినవేనని చెబుతున్నారు. దీనికి తోడు ముద్ర రుణాల మూలాన లక్షలాది మందికి ఉపాధి కల్పించినట్లు ఢంకా భజాయించారు. వాస్తవ గణాంకాలను తొక్కిపెట్టి మోడీ సర్కార్ ఐదేళ్లుగా సాగిస్తున్న ఈ అంకెల తారుమారు కుయుక్తులు ఎంతగా హద్దుమీరాయంటే ప్రభుత్వ తీరును సహించలేక గణాంకాల రూపకల్పనలో అత్యంత కీలకమైన ఎన్ఎస్‌సిలోని ప్రభుత్వేతర సభ్యులు రాజీనామాలు చేసేంతటి దుస్థితికి చేరాయి.

ఒక్క 2018 సంవత్సరంలోనే ఒక కోటీ పది లక్షల ఉద్యోగాలు నష్టపోయినట్లు బయటపెట్టిన విషయాన్ని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) స్వతంత్ర అధ్యయన సంస్థ కూడా ఇటీవల వెల్లడించింది. ఇటు బిజెపి ప్రభుత్వం తొక్కిపెట్టిన ప్రభుత్వ గణాంకాలు, అటు స్వతంత్ర అధ్యయన సంస్థల సర్వేలు నిరుద్యోగ భారత భయానక పరిస్థితికి దర్పణం పట్టేవే.

2014 ఎన్నికల్లో బిజెపి చేసిన వాగ్దానం ప్రకారం ప్రతి యేటా రెండు కోట్ల చొప్పున ఈ ఐదేళ్లలో పది కోట్ల ఉద్యోగాలు కల్పించివుండాలి. కానీ జరిగిందేమిటి ఉన్న ఉద్యోగాల్లోనే కోట్లది ఉద్యోగాలు ఊడిపోయి 'నా ఉద్యోగం ఎక్కడ మోడీజీ' అని యువతరం నినదించే గడ్డుపరిస్థితిలోకి దేశాన్ని నెట్టారు. ప్రభుత్వ శాఖల్లో సైతం లక్షలాది ఖాళీలు ఉన్నా, వాటిని కూడా భర్తీ చేయకుండా అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలంటే కుదరదు..వెళ్లి పకోడీలు అమ్ముకోండి అంటూ పరిహాసమాడింది.

ఎన్ఎస్ఎస్ఓ నివేదిక బహిర్గతమైన నేపథ్యంలో ఉలిక్కిపడ్డ మోడీ సర్కార్ నష్ట నివారణకు నీతి ఆయోగ్‌ను రంగంలోకి దింపి భంగపడింది. 45 ఏళ్ల గరిష్ట స్థాయికి నిరుద్యోగిత రేటు చేరిందంటూ మీడియాలో వచ్చిన కథనాలు అధికారిక నివేదిక కాదంటూ నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ కప్పిపుచ్చే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. సరే ఎన్ఎస్ఎస్ఓ నివేదిక అధికారిక కాదు..మరి 2017-18 సంవత్సరానికి నిరుద్యోగ రేటు ఎంత వుందో ప్రభుత్వానికి తెలుసా అని మీడియా ప్రతినిధులు నిలదీయగా అదే ఈ విషయాన్ని మీకు మేమేలా చెబుతాం అంటూ దాటవేశారు. మోడీ సర్కార్ ప్రచార మాధ్యమాల్లో కోట్లు కుమ్మరించి చేయిస్తున్న ప్రకటనల్లో మాదిరి చెప్పాలంటే 'విషయం స్పష్టం..ఈ ఐదేళ్లలో దేశం అన్ని విధాల తిరోగమనంలోకి నెట్టివేయబడింది'. సర్వ వ్యవస్థలను భ్రష్టు పట్టించి ప్రజానీకాన్ని తిరుగమనంలోకి నెడుతూనే మళ్లీ ఉనికిని నిలబెట్టుకునేందుకు 'రామజపం' చేస్తున్న మోడీ సర్కార్‌కు సార్వత్రిక సమరంలో ప్రజలు గట్టి గుణపాఠం చెప్పడం అనివార్యం.



దిగిపొమ్మని జగత్తంత
నగారాలు కొడుతున్నది
'దిగిపోవోయ్ తెగిపోవోయ్
తెగిపోవోయ్ దిగిపోవోయ్'
ఇదే మాట ఇదే మాట
పదే పదే అనేస్తాను

- దాశరథి

కార్పొరేట్ల కోసం మత్స్యకారులను పణంగా పెట్టిన మోడీ

విశ్లేషణ



ఎ అజ శర్మ

ప్రభుత్వం నేడు తలపెట్టిన 2018 నోటిఫికేషన్ పర్యావరణాన్ని, మత్స్యకారుల జీవనాన్ని పణంగా పెట్టి పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చడానికే ఉపకరిస్తుంది. అభివృద్ధి చాటున విధ్వంసానికే ఇది దారితీస్తుంది. దేశంలోని 7,500 కిలోమీటర్ల సుదూరమైన సముద్ర తీరాన్ని, సముద్రంలోని భాగాన్ని బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడానికి ప్రభుత్వం దేశ భవిష్యత్తును కూడా తాకట్టు పెట్టింది.



సముద్ర తీర ప్రాంతంలో జరిగే చర్యలపై ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను సవరిస్తూ డిసెంబరు 28న కేంద్ర కేబినట్ సమావేశం సిఆర్‌జెడ్ నోటిఫికేషన్ 2018ని ఆమోదించింది. దీంట్లో మత్స్యకారుల ఉపాధి, పర్యావరణాన్ని పణంగా పెట్టింది. ఇప్పటివరకు సముద్ర తీర ప్రాంతంలో నిషేధించబడ్డ రియల్ ఎస్టేట్ వ్యాపారం, పరిశ్రమలు, టూరిజం వంటివన్నీ అనుమతిస్తూ అనేక సవరణలు పొందుపరిచింది.

మన దేశంలో సహజ వనరులతో సహా అన్ని వనరులు పారిశ్రామికవేత్తలకు లాభాలు తీసుకువచ్చే సరుకులే. ఖనిజాలు, గనుల తవ్వకం పేరుతో అడవులను ధ్వంసం చేస్తున్నారు. కాలుష్యకారక పరిశ్రమల స్థాపనతో గాలిని కలుషితం చేస్తున్నారు. నీరు కూడా పెద్ద వ్యాపార సరుకుగా మారిపోయింది. ఇక వీరి వ్యాపారానికి, లాభాలకు సముద్రం ఒకటే మిగిలింది. ఇప్పుడు దీనిని కూడా కబళించాలని చూస్తున్నారు. సిఆర్‌జెడ్ 1991 నిబంధనలు వీరి వ్యాపారానికి అడ్డుగా ఉన్నాయి. అందుకే వీటిని 1991 తర్వాత 25 సార్లు సవరణలు చేసి 2011లో మరలా కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. 1991 లోని అనేక అంశాలను సవరించి 2011 వచ్చేసరికి సిఆర్‌జెడ్ నిబంధనలను నీరుగార్చారు. అయినా 2011 నిబంధనల ప్రకారం కూడా సముద్రపు ఒడ్డున, లోపల రియల్ ఎస్టేట్ వ్యాపారం, నిర్మాణాలు నిషిద్ధం. నేడు ఉన్న ఈ కొద్దిపాటి రక్షణలను కూడా తీసివేస్తూ తాజా నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం తయారు చేసింది.

కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో గతంలో నాలుగు విభాగాలుగా విభజించబడ్డ తీర ప్రాంతాన్ని ఏడు విభాగాలుగా చేశారు. దీంతో పర్యావరణాన్ని రక్షిస్తూ, తీర ప్రాంత మత్స్యకారులకు ఉపాధి కల్పించే లక్ష్యంగాగల సిఆర్‌జెడ్‌ను పూర్తిగా హరించి వేశారు. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలకు మేలు చేసే ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అన్నింటిలోకి సిఆర్‌జెడ్-1 కేటగిరీ అత్యంత సున్నితమైంది. సముద్రం కోతలకు గురికాకుండా కాపాడి, పర్యావరణాన్ని రక్షించే దట్టమైన మడ అడవులు, మట్టి దిబ్బలు, ఉప్పు మళ్లు, రిజర్వ్ అటవీ ప్రాంతం, పగడాల దిబ్బలు, చిత్తడి భూములు వంటివి ఉండే ప్రాంతమిది. సముద్రపు పెద్ద అలలు తాకే ప్రాంతం నుండి 500 మీటర్ల వరకు ఈ జోన్ పరిధిలో ఎటువంటి నిర్మాణాలు జరపకూడదు. ఇప్పటి వరకు కాపాడుతూ వచ్చిన ఈ జోన్ ప్రాంతాన్ని సైతం నేడు బహిరంగంగా పారిశ్రామికవేత్తలకు అమలు కాని కొన్ని కంటి తుడుపు మినహాయింపులతో అనుమతులు ఇవ్వడానికి సవరణలు చేశారు. ఉదాహరణకు, మడ అడవులు నరికితే, దానికి మూడు రెట్లు మరలా వేరే ప్రదేశంలో మడ అడవులు పెంచాలని షరతు విధించారు. ఇది ఎంత హాస్యాస్పదమంటే ఒకసారి నరికిన తర్వాత ఈ షరతు ప్రకారం మరలా వేరే చోట అడవులు పెంచమని బడా పారిశ్రామికవేత్తలను అడిగే ధైర్యం మన ప్రభుత్వ యంత్రాంగానికి ఉందా? ఒక వేళ అలా అడిగితే ఇక ప్రభుత్వ నినాదమైన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అర్థమేంటి? అందువల్ల ఇది ఏ రకంగానూ అమలు కాని షరతే. కేవలం కంటి తుడుపు చర్యే. ఇది ఎవరిని సంతృప్తి పరచడానికి?

సిఆర్‌జెడ్ జోన్-2 ప్రాంత కేటగిరీలో సముద్ర అలలు తాకే ప్రాంతం నుండి 100 మీటర్ల వరకు ఇప్పటి వరకు ఎటువంటి నిర్మాణాలు జరపకూడదు. నేడు దానిని 50 మీటర్లకు కుదించారు. గ్రామీణ ప్రాంత జోన్ 3 కేటగిరీలో 200 మీటర్ల వరకు ఎన్‌డిజెడ్ (నో డెవలప్‌మెంట్ జోన్)లో 2011 నోటిఫికేషన్ ప్రకారం ఎటువంటి నిర్మాణాలు జరపకూడదు. నేడు ఈ జోన్‌ను రెండు విభాగాలుగా చేసి 50 మీటర్ల తరువాత నిర్మాణాలు జరపవచ్చని పేర్కొన్నారు. మడ అడవులను నరికే అధికారం ఎవరికీ లేదని 1991, 2011 నోటిఫికేషన్లు తెలిపాయి. కానీ నేడు దానిని కూడా సవరించి వేశారు. అవసరమైతే నరకవచ్చని కొన్ని మినహాయింపులతో అనుమతించేలా సవరణ చేశారు.

సిఆర్‌జెడ్-4 కేటగిరీలో సముద్ర అలలు తాకే ప్రాంతం నుండి సముద్రంలోనికి 12 నాటికన్ మైళ్ళ (22.224 కిలో మీటర్లు) వరకు సముద్రం లోపల ఎటువంటి నిర్మాణాలు జరపకూడదు. ఎందువల్లంటే అలా చేస్తే సముద్ర వృక్ష, జంతు జాలాలకు తీవ్ర హాని కలుగుతుంది. కానీ నేడు దీనికి కూడా సవరణ చేసి సముద్రంలో విగ్రహాలు, మ్యూజియంలు, జ్ఞాపక చిహ్నాల కట్టడాలు నిర్మించవచ్చని పేర్కొన్నారు. నేడు అరేబియా సముద్రంలో మహారాష్ట్ర ప్రభుత్వం 210 మీటర్ల ఎత్తైన శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టించాలని నిర్ణయించింది. అనేక మంది వ్యాపారవేత్తలు సముద్రంలోన టూరిజం కేంద్రాలను, రిసార్టులను ఇకపై ఏర్పాటు చేసుకోవడానికి ఉద్దేశించిందే ఈ సవరణ.

వీటన్నిటికి మించి అనుమతులు మంజూరు చేసే అధికారాలను కూడా పలుచన చేసి, గతంలో కేంద్ర మంత్రిత్వశాఖ వద్ద ఉండే అనుమతులు ఇచ్చే అధికారాలను క్రింది స్థాయి రాష్ట్ర అధికారులకు బదలాయించారు. కేంద్ర ప్రభుత్వ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిసినెస్' లో భాగంగా వ్యాపారవేత్తలకు సులువుగా, వేగంగా అనుమతులు మంజూరు చేయడానికే ఈ సవరణలు ఉద్దేశించబడ్డాయి.

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2035 కల్లా దేశంలో కొత్తగా 400 పోర్టులను ప్రైవేటు రంగంలో నిర్మించడానికి 'సాగర మాల' అనే కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ పోర్టులను అనుసంధానం చేస్తూ తీర ప్రాంతం వెంబడి రెండు వేల కిలోమీటర్ల పైన రహదారులు నిర్మించాలని కూడా 'భారత్ మాల పరియోజన (బిఎంపి)'ను ప్రతిపాదించింది. ఇవి అమలు జరగాలంటే, ఇప్పుడున్న నిబంధనలు అడ్డుగా ఉంటాయి. అందువల్లనే వాటిని మార్చి వేసింది. ఈ పోర్టుల వల్ల పారిశ్రామికవేత్తలకు లాభం, మత్స్యకారులకు ఉపాధి పోవడం ఖాయం. ప్రపంచ వ్యాపితంగా మత్స్యకారుల ఉపాధి కాపాడడానికి సిఆర్‌జెడ్ నిబంధనలే కీలకం. కానీ నేడు అదే సిఆర్‌జెడ్ పేరుతో మత్స్యకారుల ఉపాధినే గల్లంతు చేస్తున్నారు. ఉదాహరణకు ప్రైవేటు రంగానికి చెందిన గంగవరం పోర్టు కారణంగా రెండు వేల మందికి పైగా మత్స్యకారులు ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోయారు. వారికి కట్టిస్తామన్న జెట్టి కూడా పది సంవత్సరాలు గడిచినా నేటికీ అతీగతీ లేదు. ఇప్పుడు ఇలాంటి పోర్టులు కొన్ని వందలు వస్తే సముద్రం మీదే ఆధార పడ్డ లక్షలాది మంది మత్స్యకారుల జీవనోపాధి ఏమవుతుందో ఊహించుకోవచ్చు.

మొత్తంగా చూస్తే ప్రభుత్వం నేడు తలపెట్టిన 2018 నోటిఫికేషన్ పర్యావరణాన్ని, మత్స్యకారుల జీవనాన్ని పణంగా పెట్టి పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చడానికే ఉపకరిస్తుంది. అభివృద్ధి చాటున విధ్వంసానికే ఇది దారితీస్తుంది. దేశంలోని 7,500 కిలోమీటర్ల సుదూరమైన సముద్ర తీరాన్ని, సముద్రంలోని భాగాన్ని బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడానికి ప్రభుత్వం దేశ భవిష్యత్తును కూడా తాకట్టు పెట్టింది. 2011 నోటిఫికేషన్‌లోనే అనేక లొసుగులు ఉన్నాయి. ఫలితంగా థర్మల్ పవర్ ప్లాంట్లు, ఫార్మా కంపెనీలు, రసాయన పరిశ్రమలు తమ వ్యర్థాలతో సముద్రాన్ని కలుషితం చేసి, మత్స్య సంపదను నాశనం చేసున్నాయి. సముద్ర తీరంలో ఇసుకను తవ్వి ఖనిజాలను వెలికి తీసే పరిశోధనలు కూడా నేడు జరుగుతున్నాయి. ఇసుకకు కోత పడితే తీవ్రమైన దుష్ప్రభావాలు ఏర్పడతాయి. నేడు సముద్ర తీరం అనేక ఆక్రమణలకు గురవుతోంది. ఉదాహరణకు విశాఖ సముద్ర తీరమంతా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ రిసార్టులు, స్టార్ హోటళ్లు దర్శనమిస్తున్నాయి. వీటిని కూల్చేయాలని 2007లో హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా ఫలితం లేదు. నేడు ఈ సవరణల వల్ల మరిన్ని నిర్మాణాలు అక్రమంగా కాక సక్రమంగానే నిర్మించవచ్చు.

పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటే అనేక ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. గాలివానలు, వరదలు, ఉష్ణోగ్రతలలో మార్పులు వంటి అంశాల ఆధారంగా ప్రపంచ దేశాలలో చేసిన 'గ్లోబల్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్ (వాతావరణ ప్రమాదం)' సర్వేలో ఆసక్తికరంగా మన దేశం నాల్గవ స్థానంలో ఉంది. ఇప్పటికే దేశంలో అనేక వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. 2004లో ఎనిమిది వేల మందికి పైగా ప్రజల ప్రాణాలు బలిగొన్న సునామీ నుండి, 2014 హుదూద్, మొన్నటి కేరళ అకాల వర్షాలు, వరదలు, తిత్లీ తుపాను వంటివన్నీ మన కళ్ల ముందే కనబడుతున్నా, పారిశ్రామికవేత్తల సేవలో మునిగి తేలుతున్న మన పాలకులకు కనువిప్పు కలగలేదంటే, వీరికున్నది దేశభక్తా లేక ప్రభు భక్తా అన్నది సులువుగానే అర్థమవుతుంది.

ముందుగా పర్యావరణవేత్తలతో కాని, ఇప్పటికే పని చేస్తున్న పర్యావరణ సంస్థలతో కాని, మత్స్యకార సంఘాలతో కాని కనీస సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ తయారు చేసి జారీ చేసింది. ముంబాయిలోని మత్స్య సంపద లభించే ప్రాంతాలలో 'కోలి' అని పిలవబడే మత్స్యకారులు నాలుగు శతాబ్దాలకు పైగా జీవనం సాగిస్తున్నారు. 2011లో ఆ ప్రాంతాలకు ప్రత్యేక రక్షణ కల్పించారు. అయితే ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్లో ఆ ప్రాంతాలను కనీస ప్రస్తావన కూడా చేయలేదు.

ఐక్యరాజ్య సమితి అభివృద్ధి ప్రణాళిక (యుఎన్‌డిపి) 'ఈ రోజును చూడు- కానీ రేపటిని కూడా గుర్తుంచుకో' అని ప్రపంచ దేశాలను హెచ్చరించింది. కానీ మన పాలకులు మాత్రం ఈ రోజు కార్పొరేట్ సేవలో పరిక్రమిస్తూ రేపటి దేశ భవిష్యత్తును బలి పెడుతున్నారు. దేశ ప్రజలు, పర్యావరణ వేత్తలు, అభివృద్ధికాముకులు ముందుకు వచ్చి ఇటువంటి పాలకులకు సరైన గుణపాఠం నేర్పాలి. పర్యావరణ పరిరక్షణకై ప్రత్యామ్నాయ ప్రణాళికతో ముందుకు సాగాలి.

(రచయిత ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి)

యుపిలో హిందూ ఓట్ల కోసం ఏం చేయనున్నారు?



విశ్లేషణ



అరుణ

ఈ ఆర్టికల్ రాస్తున్న సమయంలో అఖిలేష్, మాయావతిల ఎన్నికల పొత్తు ప్రెస్ కాన్ఫరెన్స్, లక్నో తాజ్ హోటల్‌లో జరుగుతోంది. మాయావతి మాట్లాడుతూ 'ఆనాటి లక్నో సంఘటనలను పక్కన పెట్టి దేశ ప్రజల కోసం సమాజ్‌వాది పార్టీతో ఎన్నికల పొత్తుకు సిద్ధపడ్డాను' అని వెల్లడించారు. ఆ తర్వాత మాట్లాడిన అఖిలేష్ యాదవ్ 'బిజెపి అహంకారాన్ని అణచడానికి రెండడుగులు వెనక్కి వేసి బహుజన్ సమాజ్‌వాది పార్టీతో పొత్తుకు సిద్ధపడ్డాం. ఈ పొత్తు బిజెపిని భయపెడుతుంది. అది రకరకాల కుతంత్రాలు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో మత కల్లోలాలు రెచ్చగొట్టే అవకాశం ఉంది' అని అన్నారు. బహుజన్ సమాజ్‌వాది పార్టీ, సమాజ్‌వాది పార్టీలు కలసి 2019 లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నాయి.

అత్యధిక లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్ రాజకీయాలు దేశం మొత్తం మీద ప్రభావం చూపిస్తాయి. 2014లో ఉత్తరప్రదేశ్‌లో బిజెపి అత్యధికంగా 71 లోక్‌సభ సీట్లు గెలుచుకుంది. అంతేకాక 325 అసెంబ్లీ సీట్లతో యుపి ప్రజలు బిజెపికి అధికారం కట్టబెట్టారు. ఇంతగా నమ్మి అధికారం ఇస్తే.. బిజెపి, ఆ రాష్ట్ర ప్రజలకి ఏమిచ్చింది? అన్న ప్రశ్నకు మన ముందున్న సమాధానాలు .. ముజఫర్‌నగర్ మత ఘర్షణలు, ఫ్రిజ్‌లో గో మాంసం ఉందని అఖ్లాక్ హత్య, బూటకపు ఎన్‌కౌంటర్లు. ఇటీవల కాలంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులపై హిందుత్వ మూకల దాడులు. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తున్న కొలదీ ఉత్తరప్రదేశ్ రాజకీయాలు ఇంకా వేడెక్కుతున్నాయి. బిజెపిని ఎదుర్కోటానికి అన్ని రాజకీయ పార్టీలు నడుంబిగిస్తున్నాయి. ఈ సందర్భంలోనే బిజెపి గత నెలలో ఉత్తరప్రదేశ్ 2019 లోక్‌సభ ఎన్నికల ఇంచార్జిగా గోర్ధన్ ఝుడాఫియాను నియమించింది.

ఈ సమయంలోనే హోంశాఖ సహాయమంత్రి బాధ్యతల్లో వున్న గోర్ధన్ 'మదరసాపై దాడి చేసిన హిందువులపై కాల్పులెందుకు జరిపారు? హిందువులు ఎంతమంది చనిపోయారో అంతమంది ముస్లింలెందుకు ప్రాణాలు కోల్పోలేదు?' అని రాహుల్ శర్మని ప్రశ్నించారు. దానికి శర్మ స్పందిస్తూ 'తుపాకీ గుండుకు మతం తెలియదు. మత ఘర్షణలో ఎవరు మారణహోమానికి పాల్పడితే వారిని అడ్డుకున్నా' అని బదులిచ్చారు.

గుజరాత్‌లో నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఈయన ఆ రాష్ట్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేశారు. 'పోలీసుల ఫైరింగ్‌లో ఎంతమంది హిందువులు చనిపోయారో అంతమంది ముస్లింలు చనిపోవాలి. అప్పుడు రేషియో సరిపోతుంది' అంటూ 2002 గుజరాత్ మత ఘర్షణల్లో గోర్ధన్ తీవ్ర మత విద్వేషాన్ని చిమ్మారు. అల్లర్లను నియంత్రించేందుకు అప్పటి గుజరాత్‌లోని భావనగర్ ఎస్‌పి రాహుల్ శర్మ ప్రదర్శించిన పని తీరు ఈయనకు నచ్చలేదు. 2002 మార్చి ఒకటిన ఆ ప్రాంతంలో ఒక మదరసాపై పదివేల మంది హిందువులు దాడి చేసేందుకు యత్నించారు. వారిని వారిస్తూ రాహుల్ శర్మ హెచ్చరించారు. అయినా మాట వినకపోవడంతో కాల్పులు జరిపారు. దీంతో ఆ ఘటనలో కొంత మంది చనిపోయారు. ఈ సందర్భంగా రాహుల్ శర్మ పని తీరును అప్పటి ఉప ప్రధాని మంత్రి అద్వానీ కొనియాడారు. అయితే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ రాహుల్ శర్మ హీరో గిరి చేసారని విమర్శించారు. ఈ సమయంలోనే హోంశాఖ సహాయమంత్రి బాధ్యతల్లో వున్న గోర్ధన్ 'మదరసాపై దాడి చేసిన హిందువులపై కాల్పులెందుకు జరిపారు? హిందువులు ఎంతమంది చనిపోయారో అంతమంది ముస్లింలెందుకు ప్రాణాలు కోల్పోలేదు?' అని రాహుల్ శర్మని ప్రశ్నించారు. దానికి శర్మ స్పందిస్తూ 'తుపాకీ గుండుకు మతం తెలియదు. మత ఘర్షణలో ఎవరు మారణహోమానికి పాల్పడితే వారిని అడ్డుకున్నా' అని బదులిచ్చారు.

యుపి లోకసభ ఎన్నికల ఇంచార్జిగా బిజెపి గోర్ధన్ ఝుడాఫియాని నియమించడంపై ఒక వెబ్ ఛానల్ ఇంటర్వ్యూలో రాహుల్ శర్మ ఇలా విశ్లేషించారు. 'మునిగిపోతున్న బిజెపి, గెలుపు కోసం మత ఘర్షణల ఆసరా తీసుకోవాలని ప్రణాళిక వేసుకుంది. అందుకే యుపి ఎన్నికల ఇంచార్జిగా గోర్ధన్‌ని నియమించింది. అంటే యుపిలో మత రాజకీయం చేసేందుకు బిజెపి పూర్తి ఏర్పాట్లు చేసుకున్నట్లే'. అయితే యుపిలో బిఎస్పి, సమాజ్‌వాది పార్టీ విలీనానికి సంబంధించిన వార్తలు పుంఖానుపుంఖాలుగా వస్తాయి. కానీ బిజెపి ఎలాంటి ఎత్తుగడలు వేస్తున్నది తెలిపే పోలీస్ ఆఫీసర్ రాహుల్ శర్మ మాట్లాడిన మాటలు మాత్రం వార్తలుగా రావు. గుజరాత్ మత కల్లోలంలో ఒక హిందువు చనిపోతే ఒక ముస్లిం కూడా చావాల్సిందే అని రోడ్లెక్కి విర్రవీగిన గోర్ధన్ నిజంగా ఒక గొప్ప హిందూ పరిరక్షకుడు. ఎలాగంటారా! 2002 డిసెంబర్‌లో మోడీ తన కేబినెట్ నుంచి గోర్ధన్‌ని తొలగించినప్పుడు ఆయన తిరుగుబాటు నేతగా అవతరించారు. పార్టీని వీడారు. నానావతి కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చేటప్పుడు 'గుజరాత్ మత కల్లోలంలో అందరి గుట్టు విప్పుతా' అని బెదిరించారు. అలాగే సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ముందు 'మోడీ పేరు చెబుతా, సాక్ష్యం ఇస్తాను' అంటూ ముందుకొచ్చారు. దీంతో పలువురు బిజెపి నాయకులు రంగంలోకి దిగి ఆయనను బుజ్జగించారు. సుప్రీంకోర్టు ముందు మోడీ పేరు చెప్పొద్దని, పార్టీలోకి తిరిగి వచ్చేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీల మేరకు గోర్ధన్ గుజరాత్ మతకల్లోలంపై పెదవి విప్పలేదు. ఫలితంగా 2014లో బిజెపిలోకి తిరిగి వచ్చారు. ఇదంతా చూస్తే ఏమనిపిస్తుంది? తన రాజకీయ కెరీర్‌ను చక్కగా ప్లాన్ చేసుకునే రాజకీయ నాయకుడు గోర్ధన్ ఝుడాఫియా. ఉత్తరప్రదేశ్‌లో బిజెపిని గెలిపించేందుకు విశ్వహిందూ పరిషత్ నేత ప్రవీణ్ తొగాడియాకి బాగా దగ్గరైన గోర్ధన్ ఒక హిందూ పరిరక్షకుడి అవతారం ఎత్తారు. ఇప్పటికే హిందూత్వవాది యోగి ముఖ్యమంత్రిగా వున్న యుపిలో ఈయన ఇంకెన్ని రకాలుగా మత రాజకీయాలు చేయనున్నారో? బిజెపికి పట్టం కట్టిన యుపి ప్రజలకి ఇవ్వనున్న బహుమతులు ఏమేమో పాపం..

(రచయిత సెల్ : 9810093581)

గుమ్మడి ప్రభాకర్

వాడుతున్న కమలం

సమీక్ష



బీజేపీ నాయకత్వంలో నడుస్తున్న ఎన్డీయే పరిస్థితి రోజు రోజుకు మునుగుతున్న నావలా తయారయ్యింది. ఆ నావకు రోజుకో చిల్లు పడుతోంది. వాటిలోంచి భాగస్వామ్య పార్టీలు ఒక్కొక్కటిగా బయటకు వెళ్ళిపోతున్నాయి. భవిష్యత్‌లో ఇంకెన్ని చిల్లులు పడతాయో, ఎన్ని పార్టీలు, ఎందరు మిత్రులు కమలానికి దూరమౌతారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఆ జాబితా చెప్పకోవాలేగానీ చేంతాడంత అవుతుంది.

బీజేపీ నాయకత్వంలో నడుస్తున్న ఎన్డీయే పరిస్థితి రోజు రోజుకు మునుగుతున్న నావలా తయారయ్యింది. ఆ నావకు రోజుకో చిల్లు పడుతోంది. వాటిలోంచి భాగస్వామ్య పార్టీలు ఒక్కొక్కటిగా బయటకు వెళ్ళిపోతున్నాయి. భవిష్యత్‌లో ఇంకెన్ని చిల్లులు పడతాయో, ఎన్ని పార్టీలు, ఎందరు మిత్రులు కమలానికి దూరమౌతారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఆ జాబితా చెప్పుకోవాలేగానీ చేంతాడంత అవుతుంది. హర్యానా మాజీ ముఖ్యమంత్రి భజన్ లాల్ కుమారుడు, 'హర్యానా జనహిత్ కాంగ్రెస్' అధ్యక్షుడు కులదీప్ బిష్ణోయ్ బీజేపీ తో పొత్తే తమను దెబ్బతీసిందంటూ 2014 ఎన్నికలు ముగిసిన అతి కొద్ది కాలంలోనే ఎన్డీయే నుంచి బయటకు వెళ్లిపోయారు. గత ఎన్నికలు ముగిసిన ఆరు నెలలకే తమిళ పార్టీ యం.డి.యం.కె ఎన్డీయే నుండి బయటకు వచ్చేసింది. బీజేపీ తమిళ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పని చేస్తుందంటూ వైపురి గోపాలస్వామి (వైకో) దుయ్యబడుతున్నారు. బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్న డి.యం.కె స్టాలిన్ తో చేతులు కలిపి నడవాలనుకుంటున్నారు. దీనితో కాంగ్రెస్ తో కలిసి పని చేయడానికి వైకోకు ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పకనే చెబుతున్నారు. సినీ నటుడు, ఎండీఎంకే అధినేత విజయ్‌కాంత్ 2011 అసెంబ్లీ ఎన్నికలలో ఏ.ఐ.ఏ.డి.యం.కెతో పొత్తు పెట్టుకుని 29 స్థానాలలో గెలుపొంది ప్రధాన ప్రతిపక్షంగా నిలిచినప్పటికీ... 2014 సాధారణ ఎన్నికలలో ఎన్డీయేతో పొత్తు పెట్టుకొని ఘోరంగా దెబ్బతిన్నారు. ఆ తర్వాత 2016 లో ఎన్డీయే ను వదిలి 'పీపుల్స్ వెల్ఫేర్ ఫ్రంట్' తో జతకట్టి ఎన్నికలలో పోటీ చేశారు. మరొక తమిళ పార్టీయైన పీయంకె గత లోక్ సభ ఎన్నికలలో బీజేపీ తో కలిసి పోటీ చేసిన యస్. రామదాస్ ఎన్డీయే తో అంటీముట్టనట్టుగానే వున్నారు. ఆయన గత కొన్ని నెలల నుండి తమ పార్టీ ఎన్డీయే లో భాగం కాదని పదే పదే చెబుతున్నారు. 2014 కి ముందు ఆరు తమిళ పార్టీలు ఎన్డీయే కూటమిలో భాగస్వామ్యులుగా వుండగా ఇప్పుడు అందులో ఒక్క బలమైన పార్టీ కూడా లేదు. 2016 నుండి కేరళ రాష్ట్రం నుంచి జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో వున్న జె.ఆర్.యస్ చైర్‌పర్సన్ సి.కె.జాను ఇటీవల ఎన్డీయే నుండి బయటికి వచ్చారు.

మహారాష్ట్ర చెరుకు రైతుల సమస్యలే ప్రధాన ఎజెండాగా ఏర్పాటైన 'స్వాభిమాని షెట్కారీ సంఘటన' 2017 లో ఎన్డీయే నుంచి బయటకు వచ్చేసింది. ఈ పార్టీ ఒంటరిగా గెలిచే పరిస్థితి లేనప్పటికీ పశ్చిమ మహారాష్ట్ర, మరాట్వాడా, విదర్భ ప్రాంతాల లోని అనేక నియోజక వర్గాలలో గెలుపోటములను నిర్ణయించగల సత్తా వున్న పార్టీ. ఇకపోతే ప్రత్యేక హోదా ఇస్తామని, సింగపూర్ ని తలదన్నే రాజధాని నిర్మాణానికి సహకరిస్తామని, విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ను అన్ని విధాలా ఆదుకుంటామని బిజెపి చెప్పినా ఏమీ చేయలేదు. ఆ పార్టీతో అంటకాగితే ఎన్నికల్లో తన పుట్టి మునుగుతుందన్న భయంతో తెలుగుదేశం పార్టీ ఎన్డీయే కి వీడ్కోలు పలికింది.

2014 ఎన్నికల తర్వాత రెండు విరుద్ధ భావజాల పార్టీలయిన బీజేపీ-పిడిపి కలిసి కాశ్మీర్ లో ప్రభుత్వ ఏర్పాటు చేయడం వాటి అవకాశవాద వైఖరికి అద్దం పట్టింది. ఈ అపవిత్ర బంధం ఎప్పుడు తెగిపోతుందా అని ఎదురు చూసిన వారూ వున్నారు. అనుకున్నట్లుగానే బీజేపీ పీడీపీల బంధం కూడా అర్థాంతరంగా ముగిసింది. కూటమి నుండి బయటకొచ్చిన తరవాత మెహబూబా ముఫ్తీ కేంద్ర ప్రభుత్వానికి, నరేంద్ర మోడీకి, బీజేపీకి ఒక బలమైన విమర్శకురాలిగా తయారయ్యారు. ఓ.బీ.సీ రిజరేషన్ల విషయంలో బిజెపితో విబేధించిన రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్‌యల్‌యస్ పి) అధ్యక్షుడు, కేంద్ర మంత్రి ఉపేంద్ర కుశ్వాహా జాతీయ ప్రజాస్వామ్య కూటమి నుండి బయటకు వచ్చేశారు. తెలుగు దేశం, పీడీపీలు ఎన్డీయే నుండి బయటకు వచ్చిన తర్వాత వీడిన మూడవ పార్టీ ఇది. కూటమి భాగస్వామ్య పార్టీలకు ఎన్డీయే సమాన అవకాశాలు ఇవ్వడం లేదని, సీట్ల కేటాయింపులో బీజేపీ పక్షపాత ధోరణి అవలంబిస్తుందం టూ ఎన్డీయే పై విమర్శల బాణాలను ఎక్కుపెట్టారు.

ఈశాన్య భారతం లోని అనేక పార్టీలు 2016 పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ 'అసోం గణపరిషత్' ఎన్డీయే నుండి బయటకు వచ్చేసింది. ఎన్డీయే భాగస్వామ్య పార్టీ అయిన 'ఇండీజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర' జాతీయ పౌర రిజిస్టర్ (యన్.ఆర్. సి), గిరిజన ప్రత్యేక రాష్ట్రం డిమాండ్లతో బీజేపీ పై పోరు మొదలు పెట్టింది. నేషనల్ పీపుల్స్ పార్టీ (యన్‌పీపీ), నేషనల్ ఫెడరేషన్ ఫర్ న్యూ స్టేట్స్ (అనేక చిన్న పార్టీల సమాఖ్య), బీజేపీ నాయకత్వంలో నడుస్తున్న కాంగ్రెస్ వ్యతిరేక కూటమి నార్త్-ఈస్ట్ డెమోక్రాటిక్ అలయన్స్ (నేడా) కూడా ఈ బిల్లు విషయంలో బీజేపీ పై వ్యతిరేకతతో వున్నాయి.

2014 ఎన్నికల తర్వాత ఒక్క జనతాదళ్ యునైటెడ్ (జేడీయు) నితీష్ కుమార్ తప్ప ఏ ఇతర పార్టీ ఎన్డీయే లో చేరిన దాఖలాలు లేవు. మోడీ ప్రభుత్వం అయోధ్య రామ మందిర నిర్మాణం విషయంలో ముందుకు వెళ్లే తరుణంలో నితీష్ కుమార్ పొత్తు విషయం పునఃపరిశీలించవచ్చు. కూటమిలో మిగిలిన ప్రధాన భాగస్వామ్య పార్టీలైన శివసేన, ఆర్.పి.ఐ-ఏ (మహారాష్ట్ర), శిరోమణి అకాలీదళ్ (పంజాబ్), లోక్ జనశక్తి, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (బీహార్), అప్నాదళ్ (ఉత్తరప్రదేశ్), ఏ.ఐ.యన్.ఆర్.సి (పుదుచ్చేరి) కూడా ఎన్డీయేతో అంటీ ముట్టనట్టుగానే వుంటున్నాయి. శివసేన కూడా కూటమిలో కొనసాగాలా వద్దా అన్న విషయంలో తర్జన భర్జనలు పడుతోంది. లోక్ జనశక్తి పార్టీ అధినేత రామ్ విలాస్ పాశ్వాన్ కు అయోధ్య సెగ తగిలినట్టుగా వుంది. రామ మందిర వివాదం, దళితుల నిరసనలతో ఆయనకు ఇప్పుడు కూటమిలో అంత సౌకర్యంగా ఉన్నట్లు లేదు. ఆ మధ్య పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ గాంధీజీ గొప్పతనాన్ని ప్రస్తావించడం వెనుక ఎన్డీయే పడవ నుండి ఎప్పుడెప్పుడు బయటకు దూకాలా అన్న ప్రయత్నమే కనిపిస్తోంది. వీటన్నిటికి బీజేపీ ప్రభుత్వ విధానపరమైన వైఫల్యాలు ఒక కారణమైతే, నరేంద్ర మోడీ నియంతృత్వ పోకడలు, ఆ పార్టీ విభజన రాజకీయాలు కీలక కారణాలు. అందులో భాగంగానే 2014 తర్వాత 15 లోక్ సభ స్థానాలలో జరిగిన ఉప ఎన్నికలలో బిజెపి కేవలం రెండిటిని మాత్రమే సొంతం చేసుకోగలిగింది. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో కూడా బీజేపీ గ్రాఫ్ పతనమైంది. ఇక సాధారణ ఎన్నికలలో ఎలా వుంటుందో!

ప్రరవే పదేళ్ల ప్రస్థానం



సాహిత్య, సామాజిక రంగాల్లో తమదైన దృక్పథాన్ని ప్రదర్శిస్తూ.. తమదైన వాణిని వినిపించే ప్రయత్నాన్ని మహిళా రచయిత్రులు ఎప్పటినుంచో చేస్తున్నారు. అలాంటి గొంతుల సమ్మేళనమే ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే). వివిధ ప్రాంతాల్లో విభిన్నంగా స్పందించే మహిళల గొంతుకలను ఒకటిగా చేయడానికే.. ఉత్తరాంధ్రలో కీలకమైన విశాఖలో పదేళ్లకిందట 'మనలో మనం'గా ఏర్పడిన ఒక చిన్న సాహిత్య సంస్థ.. అనంతర కాలంలో రెండు రాష్ట్రాల్లోని మహిళా రచయితలకు ప్రాతినిధ్యం వహిస్తూ దేశంలోనే నిర్మాణాత్మక రచయిత్రుల సమూహంగా నిలిచి 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక'గా విస్తరించింది. మహిళల్ని, అట్టడుగువర్గాల వారిని కలాలతో జాగృతం చేయడం మాత్రమే కాదు, క్షేత్రస్థాయికి వెళ్లి, వాళ్ల కన్నీళ్లు తుడిచే ప్రయత్నాలనూ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 2, 3 తేదీల్లో విశాఖపట్నంలోని అంధ్ర విశ్వవిద్యాలయంలో తన పదేళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ సదస్సులను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా 'జీవన' ప్రత్యేక కథనం.

తూర్పు తీరంలో ఎన్నో ఉద్యమాలకు పుట్టినిల్లయిన విశాఖపట్నంలో పదేళ్ల కిందట 'మనలో మనం'లా చిన్నమొక్కగా ప్రభవించిన 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' ఈనాడు ఎందరో రచయిత్రులతో కలసి జాతీయ స్థాయిలో ముందుకు పయనిస్తోంది. ఇందులో కుల, మత, వర్గ విభేధాలకు ఎలాంటి తావూ లేదు. అగ్రకులాలతో పాటు వెనుకబడిన కులాల, దళిత, మైనారిటీవాద రచయిత్రులకు స్థానం కల్పించింది. ఆదివాసీ, గిరిజన స్త్రీలకు సాదర ఆహ్వానాన్ని పలికింది.

ప్రరవే మిగిలిన సాహితీ సంస్థల్లా కాకుండా తన ప్రత్యేకత నిలుపుకొంటూ ముందుకు సాగుతోంది. ప్రతి సంవత్సరం మహాసభలు నిర్వహించడమే కాకుండా, కొన్ని క్షేత్ర పర్యటనలకూ ప్రాధాన్యత నిచ్చింది.

వాకపల్లి నుంచి ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వరకూ

రచయితలంటే కేవలం రచనలకే పరిమితం కాకూడదని.. బాధితులకు, పీడితులకు అండగా ఉండాలని భావించింది. విశాఖ జిల్లా వాకపల్లిలో ఆదివాసీ మహిళలపై స్పెషల్ పోలీస్ యంత్రాంగం అఘాయిత్యాలు జరిగినప్పుడు.. ఆ గ్రామానికి వెళ్లి, అన్యాయానికి గురైన మహిళలను ఓదార్చి, వారి బాధల గాథలు విని.. వారికి అండగా నిలిచింది. మల్లన్న సాగర్ భారీ నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణ సందర్భంలో అక్కడి ముంపు గ్రామాలు పర్యటించి, బాధితులతో మాట్లాడి సమస్యలను అవగాహన చేసుకుంది. నల్లబంగారం తవ్వకం వల్ల పాలకులకు, అధికారులకు ఆదాయం వస్తుంది. కానీ, ఉపరితల బొగ్గుగనుల తవ్వకాల (ఓపెన్ కాస్ట్ మైనింగ్) వల్ల చుట్టుపక్కల ఇళ్లన్నీ కాలుష్యం కోరల్లో చిక్కి, విలవిల్లాడుతున్నాయి. ఈ సందర్భంలో ప్రరవే మంచిర్యాలలో ఉపరితల బొగ్గుగనుల నిర్మాణం వల్ల అనేక విధాలుగా పూర్వ రూపాన్ని కోల్పోయిన పరిసర గ్రామాలను సందర్శించింది. ఆ సమయంలో అంగుళం మందంలో దుమ్ముపొరలతో నిండిన అక్కడి ఇళ్లని గమనించింది. ధూళిపొరలతో నిండిన ఆ గ్రామంలోని ఇళ్లని, ఆ ఇళ్లలోని గోడలని, నేలను ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ నివాసిత ప్రజల బాధలను పంచుకుంది. మనిషికి కనీసావసరమైన గాలే కరవైనప్పుడు అంతకంటే నరకమెక్కడుంటుంది? పీల్చుకోవాల్సిన గాలే కలుషితమై ఆయాసం, దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నప్పుడు ఎంత పరిహారం ఇచ్చినా ఆ నష్టాన్నెవరూ పూరించలేరని తేల్చి చెప్పింది.

జీవిత విషాద కోణాలను శోధిస్తూ..

సామాన్య జనజీవితం సంక్షుభితమైనపుడు కొన్ని కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ప్రరవే చేసిన క్షేత్ర పర్యటనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ఒకప్పుడు అగ్గిపెట్టెలో పట్టే చీరల్ని నేసి, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన చేనేత కళాకారులు ఇప్పుడు తాము నేసిన బట్టల్ని కొనేవారు లేక ఆకలిమంటల్లో అల్లాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చేనేత కళాకారుల గ్రామాల్లో ఒకటైన సిరిసిల్లలో పర్యటించి, అక్కడి నేత కళాకారుల జీవన విషాదకోణాలను అధ్యయనం చేసింది. పోలవరం ఆనకట్ట నిర్మాణ సందర్భంగా పరిసర గ్రామాలన్నీ ముంపునకు గురైనపుడు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆయా గ్రామాలకు వెళ్లింది. ముంపు గ్రామాల ప్రజల కష్టాలనీ, కన్నీళ్లనీ స్వయంగా గమనించింది.









సదస్సులతో చైతన్యం

రచయిత్రుల మధ్య పరస్పర సంభాషణకు, భావవినిమయానికి అవకాశం కల్పించడం, సమకాలీన రాజకీయ ఆర్థిక పరిణామాలకు, సాహిత్యానికీ ఉన్న పరస్పర సంబంధాన్ని చర్చించడం, రచయిత్రుల సాహిత్య వస్తుశిల్పాల తీరుతెన్నులను విశ్లేషించడమే లక్ష్యంగా 2016లో పెనుగొండలో జాతీయ సదస్సు నిర్వహించింది. అదే ఏడాది హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్శిటీ ఎంట్రన్స్ గేట్ వద్ద 'సహన అసహన భావనలు – చారిత్రక సామాజిక సాంస్కృతిక పరిణామాలు – ప్రభావాలు' గురించి సదస్సు జరిపింది. బోల్షివిక్ విప్లవ విజయానికి వంద సంవత్సరాలైన సందర్భంగా 'బోల్షివిక్ విప్లవ ప్రభావం, సమాజం, సాహిత్యం, మహిళలు' అనే అంశంపై 2017లో వరంగల్‌లోని కాకతీయ యూనివర్శిటీలో కేంద్రసాహిత్య అకాడెమీతో కలిసి సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులకు ఆయా రంగాల్లో ప్రసిద్ధులైనవారిని వక్తలుగా ఆహ్వానించి, వారి అభిప్రాయాలను, భావాలను గౌరవించి తన ప్రజాస్వామిక దృక్పథాన్ని వెల్లడించింది.

చిరపరిచితమైన మట్టిస్పర్శను పలకరించే గాలి పలకరింపును, నీటి చెలిమికి దూరమైన ఊరినీ, ఉనికినీ కోల్పోయిన బాధితులను అనేక సందర్భాల్లో ప్రరవే ఓదార్చింది. సాహిత్యం జన జీవన స్రవంతిలో మమేకమైనప్పుడే దానికి ఒక సార్ధకత లభిస్తుందని ఉదాత్త లక్ష్యంతో ముందుకు సాగుతున్న ప్రరవేని ఈ పదేళ్ల పండగ సందర్భంగా అభినందిద్దాం.

- జీవన డెస్క్

భిన్నఅస్తిత్వ వాదాల మధ్య సమన్వయం



కుల, మత, అస్తిత్వ ఉద్యమాల సందర్భం నుంచి సాహిత్య రంగంలో స్త్రీవాద ఉద్యమ ప్రాసంగికత ప్రశ్నార్థకం అవుతున్న వేళ.. ఆ ప్రాతిపదికను వదలకుండానే భిన్న అస్తిత్వాల మధ్య సమన్వయం సాధించటానికి, స్నేహ పూర్వక సంభాషణకు, సంబంధాలకు స్పేస్ కల్పించటానికి పదేళ్ల క్రితం ఏర్పడింది ప్రరవే. ఈ పదేళ్లలో కొత్త విలువల ఒరవడిలో చేసిన ప్రయాణాన్ని వెనుదిరిగి చూసుకొంటే.. మరో పదేళ్ల ప్రయాణానికి కావలసిన ఉత్సాహం, బలం కలుగుతోంది.

- కాత్యాయిని విద్మహే, కార్యదర్శి, తెలంగాణ

కాలంతో కలిసి నడుస్తూ ...



పదేళ్ల ఈ ప్రయాణం రచయితగా, సామాజిక కార్యకర్తగా సాహిత్య సామాజిక సందర్భాలకు అనుగుణంగా కాలంతోపాటు నడిచే అవకాశాన్ని కలిగించింది. సమిష్టి కృషిలో ఉన్న సమన్వయాన్ని అనుభవంలోకి తెచ్చింది. భిన్న అస్తిత్వాల రచయిత్రుల సమ్మేళనం రచనాసక్తిని పెంచింది. రాజకీయావగాహన, సామాజిక అధ్యయనం, మానవీయ దృక్పథాన్ని విస్తరించింది.

- అనిశెట్టి రజిత, జాతీయ అధ్యక్షురాలు

నిబద్ధతతో పయనం



'మనలో మనం' ఆలోచనకు తోవ తీసిన దగ్గర్నుంచి ఈ పదేళ్ల సమాలోచన సదస్సు వరకు సంస్థతో నా అనుబంధం బహుశా కన్నతల్లిని కూడా మించిన భావోద్వేగాలతోనూ నిబద్ధతతోనూ కూడినటువంటిది. నలిగిన పాత తోవలను సమీక్షించుకుంటూ కొత్త రెక్కలను కూర్చుకుంటూ సాగిన ప్రయాణంలో ఒక రచయితగా, ప్రజా ఉద్యమాల అభిమానిగా కొన్ని విషయాలు నేర్చుకున్నాను.

- డాక్టర్ కె.ఎన్.మల్లీశ్వరి, జాతీయ కార్యదర్శి

విశాల సాహిత్య ప్రవాహం



ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక భిన్న అభిప్రాయాలను, భిన్న దృక్పథాలను, భిన్న అస్థిత్వాలను ఒకేచోట సమ్మిళితం చేస్తూ విశాల ప్రాతిపదికన సాగిపోతున్న సాహిత్య ప్రవాహం.. విభిన్న సాహిత్య ప్రక్రియలను, విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ, విభిన్న వ్యక్తులను, సమూహాలను తనలోకి ఇముడ్చుకుంటున్నది. తన సాహితీ యాత్రను ద్విగ్విజయంగా పూర్తిచేసుకుంటూ ముందుతరాల రచయితలకు ఆహ్వానం పలుకుతోంది.

- భండారు విజయ, జాతీయ సమన్వయకర్త

నిర్మాణాత్మక కార్యాచరణతో



మొదట్నుంచీ నిర్మాణాత్మక కార్యాచరణతో ప్రరవే సాగుతోంది. రచనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి, ఆయా ప్రాంతాల బాధితుల సమస్యల్ని విచారించి, వారికి తోడ్పాటునిచ్చింది. బిసి రచయిత్రుల రచనల గురించి, దళిత, మైనారిటీ వాద రచనల గురించి, సాహిత్యం గురించి వస్తున్న మార్పులను గమనిస్తూ, సంఘటనలకు స్పందిస్తూ ముందడుగు వేస్తోంది. ఈ ప్రయాణంలో నా అడుగులు కూడా ఉన్నందుకు సంతోషిస్తున్నాను.

- మందరపు హైమవతి, సమన్వయకర్త, ఆంధ్రప్రదేశ్.

సవాళ్లని ఎదుర్కొంటూ..



స్త్రీల అస్తిత్వ విలువలను గౌరవిస్తూ కొనసాగుతున్న ప్రరవే పదేళ్ళలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంది. ఫలితంగా అర్ధవంతమైన, చైతన్యవంతమైన కార్యక్రమాలను చేపట్టింది. పోలవరం ముంపు గ్రామాల పర్యటన, ఓపెన్ కాస్ట్ గనుల పర్యటనల్లో నిర్వాసితులుగా మిగిలిన ఆ ప్రాంత ప్రజల జీవన వేదనలు, ఆరోగ్య పరిస్థితులు, సమాజపు అంచులకి నెట్టేయబడ్డ వైనం రికార్డు చేశాం. రచయితలు స్పందించి, వ్యాసాలు, నివేదికలు, కవితలు రాశారు.

- పుట్ల హేమలత, కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్

సైకాలజీ

అలా ఎందుకు పిలుస్తుంది?

మా పాప వయస్సు ఆరు సంవత్సరాలు. చిన్నప్పటి నుంచి ఎవరినీ వరసలు పెట్టి పిలవదు. ఊ, ఆ.. అంటూ మాట్లాడుతుంది. తనకు చాలాసార్లు అది తప్పమ్మా! అని చెబితే విన్నట్లే ఉంటుంది. కానీ మరలా తనపని తాను చేస్తుంది. చివరకు తన పిన్ని, బాబాయ్, మేనమామలనూ పిలవదు. నన్ను మాత్రమే 'అమ్మా!' అని పిలుస్తుంది. మనం దగ్గరకు వెళ్లి మాట్లాడితేనే మాట్లాడుతుంది. ఒక్కసారి మాట్లాడటం మొదలెడితే చాలా క్లోజ్‌గా ఉంటుంది. కానీ ఎందుకలా చేస్తోందో అర్థంకావడం లేదు.

- ఓ సోదరి



డాక్టర్ పద్మజ, సైకాలజిస్టు

కేవలం వరుసల విషయంలోనే సమస్య ఉందా? లేదా సంభాషణా, వ్యక్తీకరణ విషయంలోనూ సమస్య ఉందా? మీరు కేవలం ఒక విషయంలోనే కాకుండా అనేక విషయాలను పరిగణనలోకి తీసుకుని చూడాలి. పాపను పిల్లల మానసిక నిపుణుల దగ్గరకు తీసుకెళ్లి, తనకు ఎలాంటి సమస్య ఉందనేది తెలుసుకోండి. వారు చెప్పిన సలహాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోండి. పాపకు వరుసలు పెట్టి పిలవలేక పోవడం సమస్యా? లేక మీరే అలవాటు చేయలేకపోయారా? అనే విషయాలనూ పరిశీలించాలి. ఇంకా పాప స్కూల్లో ఎలా వ్యవహరిస్తుంది అనేది మీ లేఖలో లేదు. హైదరాబాద్‌లో ఉండే ఎన్ఐఎమ్‌హెచ్‌లో ఒకసారి పరీక్షగానీ చేయిస్తే అసలు సమస్య ఉందా? లేదా? అనేది వెంటనే తెలిసిపోతుంది. ఒక్కోసారి ఇదేమీ పెద్ద సమస్య కాదని తేలికగా తీసేసే విషయమూ కాదు. మీరు చెప్పిన వివరాలతోనైతే సమస్యను అంచనా వేయడం కష్టం. కాబట్టి మానసిక నిపుణుల సహాయం తీసుకుని, సరైన అంచనాకు రండి. ★



జీవన సౌరభం

ఏదైనా పనిని చేసేముందు బాగా ఆలోచించాలి. నిర్ణయం తీసుకున్నాక ఆ పనిని పూర్తి చేసే బాధ్యత నుంచి వెనుకడుగు వేయకూడదు.

కళ్లు కలువరేకుల్లా ...



ముఖ సౌందర్యం రెట్టింపు చేయడంలో కళ్లే కీలకం. అది సాధ్యం కావాలంటే కొద్దిపాటి అలంకరణ తప్పనిసరి. • కళ్లు చిన్నగా ఉన్నా, పెద్దగా ఉన్నా అందాన్ని తెచ్చిపెట్టాలంటే కాటుక పెట్టుకోవాల్సిందే. అందుకోసం నాణ్యమైన ఐలైనర్‌ని ఎంచుకోవాలి. దీన్ని వాడేముందు కళ్ల చుట్టూ టిష్యూతో ఓసారి తుడవాలి. ఆపై ఐలైనర్‌తో అవుట్‌లైన్ గీసుకోవాలి. అలాగని మరీ దూరంగా కాకుండా వీలైనంత వరకూ కనురెప్పలకు దగ్గరగా గీయడం వల్ల సహజంగా కనిపించొచ్చు. మన వయసు, రంగుని బట్టి నలుపు, బ్రౌన్, గ్రే రంగుల్లో ఉండే ఐలైనర్‌లను ఎంచుకోవాలి. • కళ్లకు మస్కారా వేసుకునేటప్పుడు కనురెప్పల కొలను నుంచి కొనల వరకూ గీయాలి. అది ఆరక ముందే ఐలాష్ కర్లర్‌ని ఉపయోగించి, ఒంపు తిప్పాలి. పూర్తిగా ఆరిన తర్వాత అలా చేస్తే కనురెప్పలకున్న వెంట్రుకలు రాలిపోతాయి. • అలంకరణ అంతా అయ్యాకే ఐషాడో వాడాలి. ఇలా చేయడం వల్ల కళ్లు తాజాగా కనిపిస్తాయి. కళ్లు కలువ రేకుల్లా కనిపించాలంటే లేత రంగుల్లో ఉండే ఐషాడోని ఎంచుకోవాలి. కొన్నిసార్లు ముదురు రంగులూ బాగుంటాయి. కళ్లను మరింత హైలైట్ చేస్తాయి. ★

మీకోసం



ఆలివ్ నూనెను మాడుకు మర్దనా చేసుకుంటే జుట్టు రాలడం తగ్గుతుంది.

పరుగుకు తగ్గ ఆహారం



బరువు తగ్గించుకోవడానికి అనుకోండి, దేహధారుడ్యం కోసం కానివ్వండి పరుగుకి సరితూగే వ్యాయామం మరొకటి లేదు. రోజూ కొద్ది నిమిషాల పరుగుతో ఎన్నో రకాల రోగాల్ని దూరం చేసుకోవచ్చు. అయితే ఇలాంటివారు ఆహారంలో విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి ఆహారం తీసుకుంటే పరుగులు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయో? తెలుసుకోవాలి.

- బాదంలో యాంటీఆక్సిడెంట్ అయిన విటమిన్–ఇ ఉంటుంది. ఇది కీళ్ల నొప్పుల్ని దూరం చేస్తుంది. బాదంలో ఉండే ప్రొటీన్, ఫైబర్లు పరుగు సమయంలో ఆకలి తెలియకుండా సాయపడతాయి. రోజూ పిడికెడు చొప్పున వారంలో అయిదు రోజులపాటు బాదం తినాలి.
- పరుగుతీసేవారు రోజూ ఒక కమలాపండు లేదా 200 మి.లీ. ఆరెంజ్ రసం తాగడం మరిచిపోకూడదు. కమలాలో ఉండే విటమిన్–సి కండరాల అరుగుదలను నివారిస్తుంది. దీన్లోని ఇనుము నిల్వల వల్ల అలసట, నీరసం దూరమవుతాయి.
- చిలగడ దుంపలు మంచి చేస్తాయి. పరుగెత్తేటపుడు చెమటతో పాటు పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలూ శరీరం నుంచి బయటకుపోతాయి. చిలగడ దుంపల్లో ఈ ఖనిజ లవణాల నిల్వలు అధికస్థాయిలో ఉంటాయి. వారంలో మూడురోజులు ఈ దుంపల్ని తీసుకోవాలి.
- మిగతా వ్యాయామాలు చేసేవారితో పోల్చితే రన్నర్లకి రోజూ 60–90 గ్రా. రెట్టింపు ప్రొటీన్లు అవసరమవుతాయి. వారంలో రెండ్రోజులు చేపల్ని ఆహారంలో తీసుకోవడం ద్వారా వీరు తమకు అవసరమయ్యే ప్రొటీన్లను పొందొచ్చు. చేపలోని ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు గుండె ఆరోగ్యాన్ని పెంచుతాయి కూడా. శాఖాహారులు మీల్ మేకర్ వంటి సోయాప్రొటీన్ ఉన్న పదార్థాలు తీసుకుంటే సరిపోతుంది .
- పప్పులు , చిక్కుడు గింజలతో కూడిన ఆహారం తినడం మంచిది.

★

సెన్సెక్స్ ⬆ 213
36,469

నిఫ్టీ ⬆ 63
10,893

రూపాయి ⬇ 19 పై
అమెరికా డాలరుకు రూ.
71.28

ఎస్‌ఎంఇలకు మొండి చెయ్యి..



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు, ఉపాధికి అత్యంత కీలకమైన చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎస్‌ఎంఇ)లకు మోడీ సర్కార్ తన బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపింది. శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెద్దగా ఈ రంగాల ఊసే ఎత్తలేదు. 2016 నవంబర్‌లో చేపట్టిన రూ.500, రూ.1000 నోట్ల రద్దు, 2017 జులై నుంచి అమలు చేస్తున్న జిఎస్‌టి వల్ల ఎస్‌ఎంఇలు తీవ్ర కష్టాలను ఎదుర్కొ ంటున్నాయి. ఎస్‌ఎంఇలకు 59 నిమిషాల్లోనే కోటి రూపాయల రుణం, వడ్డీలో రెండు శాతం రాయితీ అని మధ్యంతర బడ్జెట్‌లో పేర్కొన్నప్పటికీ.. ఇది గతేడాది దీపావళి సమయంలో ప్రకటించిన పథకమే. 72,000 ఎంఎస్‌ఎంఇలకు ఈ రుణాలు అందేలా చూస్తామని ఆ సమయంలో మోడీ హామీ ఇచ్చారు. కాని మధ్యంతర బడ్జెట్‌లో ఎన్ని సంస్థలకు ఈ రుణాలిచ్చారో గోయల్ వెల్లడించలేదు. 2017-18 ఆర్థిక సర్వే ప్రకారం మొత్తం పారిశ్రామిక రుణాల్లో 82.6 శాతం లేదా రూ.26,04,100 కోట్లు కార్పొరేట్లకు ఇచ్చారు. కాగా ఎంఎస్‌ఎంఇ రంగానికి 17.4 శాతం లేదా రూ.4,500 కోట్ల మేర రుణాలు మాత్రమే ఇచ్చారు. ఈ మధ్య కాలంలో ఎన్‌బిఎఫ్‌సిల్లో చోటు చేసుకుంటున్న సంక్షోభాలు చిన్న పరిశ్రమలపై మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి.

అంచనాలు మించిన ఎస్‌బిఐ

- క్యూ3లో రూ.3,955 కోట్ల లాభాలు
- గత ఏడేళ్లలోనే అత్యధికం

ముంబయి : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అత్యంత ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మొండి బాకీలు తగ్గడంతో గత ఏడు సంవత్సరాల్లో ఏ త్రైమాసికంలోనూ లేని విధంగా 2018-19 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమా సికం (క్యూ3)లో రూ.3,954.81 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.2,416.34 కోట్ల నష్టాలు చవి చూసింది. క్రితం డిసెంబర్ త్రైమాసికంలో ఎస్‌బిఐ రూ.3,200 కోట్ల లాభాలు నమోదు చెయ్యొచ్చని తొలుత మార్కెట్ విశ్లేషకులు అంచనా వేశారు. దీనికి భిన్నంగా అంచనాలు మించి మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో బ్యాంకు మొండి బాకీల కోసం కేటాయింపులు 68 శాతం తగ్గి రూ.6,006.22 కోట్లకు తగ్గాయి. ఇదే సమయంలో బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 8.71 శాతానికి తగ్గాయి. 2017 డిసెంబర్ ముగింపు నాటికి జిఎన్‌పిఎ 10.35 శాతంగా నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 4.84 శాతం నుంచి 3.95 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం క్యూ3లో రూ.4,532 కోట్ల కొత్త మొండి బాకీలు నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 4.84 శాతం నుంచి 3.95 శాతానికి పరిమితమ య్యా యి. క్రితం డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంకు నికర వడ్డీపై ఆదాయం (ఎన్‌ఐఐ) 19.28 శాతం పెరిగి రూ.22,290.99 కోట్లకు చేరింది. 2017- 18 ఇదే క్యూ3లో రూ.18,687.52 కోట్ల ఎన్‌ఐఐ నమోదయ్యింది. ఇతర ఆదాయం 0.6 శాతం తగ్గి రూ.8,035 కోట్లకు పరిమిత మయ్యి ంది.క్రితం డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో ముఖ్యంగా మౌలిక వసతుల కంపెనీల అప్పులు ఒత్తిడిలో ఉన్నాయని ఎస్‌బిఐ వెల్లడించింది.

కార్పొరేట్ల అభిప్రాయాలు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను కార్పొరేట్, పారిశ్రామిక వర్గాలు స్వాగతించాయి. ఈ బడ్జెట్ ఆర్థిక వ్యవస్థకు మద్దతు చేస్తుందని పేర్కొన్నారు. రైతులకు, మధ్య తరగతికి లబ్ధి చేకూర్చేలా ఉందని అన్నారు. అయితే చిన్న పరిశ్రమలను పట్టించుకోలేదన్న ఆవేదనను వ్యక్తం చేశారు.

ఎంత మందికి రుణాలిచ్చారు : ఎఫ్‌ఐఎస్‌ఎంఇ

59 నిమిషాల్లో కోటి రూపాయల రుణం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇది వర కూ, తాజాగా బడ్జెట్‌లోనూ పేర్కొందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎఫ్‌ఐఎస్‌ఎంఇ) సెక్రటరీ జనరల్ అనీల్ భర ద్వాజ్ పేర్కొన్నారు. అయితే ఈ పథకంలో ఇప్పటి వరకు ఎంత మందికి, ఎంత మొత్తం అప్పులిచ్చారో సమాచారం లేదన్నారు. ఈ రంగానికి ఆర్థిక ప్రోత్సాహం అవసరమన్నారు.

వృద్ధికి దోహదం : సిఐఐ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వృద్ధి రేటుకు మద్దతు చేయనుందని సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ అభిప్రాయపడ్డారు. బలమైన వినిమయం అవసరం. రైతులు, మధ్యతరగతి కోసం చాలా ప్రకటించారన్నారు.

15 కోట్ల మందికి లబ్ధి : ఫిక్కీ

మధ్యంతర బడ్జెట్ వల్ల 15 కోట్ల మంది లబ్ధి పొందనున్నారని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సోమాని పేర్కొన్నారు. ఇందులో 12 కోట్ల మంది రైతులు, 3 కోట్ల మంది వేతనాలు జీవులు ఉన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న 95 శాతం మంది కార్మికులకు లబ్ధి పొందనున్నారన్నారు.

కొనుగోలు శక్తి పెరగనుంది : ఎస్‌బిఐ

ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 లక్షలకు చేర్చడం సంతోషకరమని, దీని వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరగనుందని ఎస్‌బిఐ ఛైర్‌పర్సన్ రజ్నీష్ కుమార్ పేర్కొన్నారు. చిన్న, సన్న కారు రైతులకు ఆర్థిక మద్దతును అందించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. డిపాజిట్లపై టిడిఎస్ పరిమితిని పెంచడం వల్ల కొత్త డిపాజిట్లు పెరగనున్నాయన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మద్దతు : కెపిఎంజి..


ప్రస్తుత బడ్జెట్ వల్ల గ్రామీణ ప్రాంత రంగాలు నిలదొక్కుకోనున్నాయని కెపిఎంజి ఇండియా ఛైర్మన్ అరుణ్ ఎం కుమార్ పేర్కొన్నారు.అదే విధంగా మధ్య తరగతిపై భారం తగ్గనుంది. ఆర్థిక వ్యవస్థ విస్తరించడానికి దోహదం చేయనుంది.

అవకాశాన్ని కోల్పోం : అపోలో హాస్పిటల్స్

కేంద్ర ప్రభుత్వం అందించాలనుకున్న అందరికీ ఉచిత వైద్యం అంకిత భావం తో కూడిందని అపోలో హాస్పిటల్స్ గ్రూపు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తాము జారవిడుచుకోబోమని తెలిపారు.

పక్కాగా అమ్మేస్తాం..

- పిఎస్‌యుల్లో డిజిన్వెస్ట్‌మెంట్
- రూ.80వేల కోట్ల వాటాలు లక్ష్యం
- బడ్జెట్‌లో పియూష్ గోయల్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ కంపెనీల్లోని వాటాల విక్రయ లక్ష్యాన్ని తప్పకుండా చేరుకుంటామని ఆర్థిక శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. శుక్రవారం ఆయన పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిజిన్వెస్ట్‌మెంట్‌పై మాట్లాడుతూ 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.80,000 కోట్ల వాటాలను విక్రయిస్తామన్నారు. పిఎస్‌యులను పారదర్శకంగా తయారు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 57 కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీలు (సిపిఎస్‌ఇ) స్టాక్ మార్కెట్‌లో లిస్టెడ్ అయి ఉన్నాయని తెలిపారు. వీటి మార్కెట్ కాపిటలైజేషన్ రూ.13 లక్షల కోట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ మార్చితో ముగియనున్న ఏడాదిలో రూ.80,000 కోట్ల వాటాలను ఉపసంహరించుకోనున్నామని వెల్లడించారు. 2018-19లో ఇప్పటి వరకూ ఇందులో రూ.35,100 కోట్ల వాటాలను విక్రయించామన్నారు. ఈ సమయంలో ఆర్‌ఐటిఇఎస్, ఐఆర్‌కాన్ ఇంటర్నేషనల్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్‌ను ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు తీసుకురావడం ద్వారా రూ.17,000 కోట్లు సమీకరించామన్నారు. భారత్22 ఇటిఎఫ్‌లో ఫర్‌ధర్ ఫండ్ ఆఫర్ (ఎఫ్‌ఎఫ్‌ఒ) ద్వారా రూ.8,300 కోట్ల ఈక్విటీలను విక్రయించామన్నారు. అదే విధంగా భెల్, కొచ్చిన్ షిప్‌యార్డ్, నాల్కో, ఎన్‌ఎల్‌సి ఇండియా, కియోసిఎల్ తదితర కంపెనీల్లో బైబ్యాక్ షేర్ ఆఫర్లను చేపట్టామని వెల్లడించారు. 2017-18లో తమ ప్రభుత్వం పిఎస్‌యుల్లో రూ.1 లక్ష కోట్ల విలువ చేసే వాటాలను విక్రయించిందన్నారు.

ఎయిరిండియాకు రూ.1300 కోట్లు

ఎయిరిండియా రుణాల కోసం రూ.1300 కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఎయిరిండియా అసెట్ హోల్డింగ్ లిమిటెడ్‌కు చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ కింద ఈ మొత్తాన్ని అందించనున్నట్లు తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీన్ని రెట్టింపు చేసి రూ.2,600 కోట్ల కేటాయింపులకు చేర్చనున్నట్లు వెల్లడించింది. వచ్చే 2030 నాటికి దేశ రవాణ రంగంలో విద్యుత్ వాహనాలు కీలకంగా మారనున్నాయని పియూష్ పేర్కొన్నారు. దేశంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి 10 రెట్లు పెరిగిందన్నారు.

మొబైల్ డాటా.. సోలార్ ఉత్పత్తి

గత ఐదేళ్లలో మొబైల్ డేటా వినియోగం 50 రెట్లు పెరిగిందని పియూష్ గోయల్ తెలిపారు. డిజిటల్ రంగంలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రపంచంలోనే డేటా, ఫోన్ ఛార్జీలు భారత్‌లో తక్కువగా ఉన్నాయన్నారు. 2019-20లో టెలికం రంగం రెవెన్యూ రూ.41,519.76 కోట్లకు చేరనుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.9,416.42 కోట్లు తగ్గి రూ.39,245 కోట్లుగా నమోదు కావొచ్చు. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.48,661.42 కోట్ల రెవెన్యూ నమోదయ్యింది.

డిహెచ్‌ఎఫ్‌ఎల్ సూచీ మరో 24% పతనం

ముంబయి : దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డిహెచ్‌ఎఫ్‌ఎల్) శుక్రవారం ఇంట్రా ట్రేడింగ్‌లో 24 శాతం పతనమై.. 52 వారాల కనిష్ట స్థాయికి దిగజారింది. ఈ కంపెనీ రూ.31,000 కోట్ల నిధుల మళ్లింపు స్కామ్‌నకు పాల్పడిందన్న ఆరోపణలపై గత నాలుగు సెషన్లలో ఈ షేర్ సగం వరకు విలువ కోల్పోయింది. తాజాగా డిహెచ్‌ఎఫ్‌ఎల్ మోసంపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని నిర్ణయించడంతో వారాంతం సెషన్‌లో తుదకు 17.96 శాతం క్షీణించి రూ.111.45 వద్ద ముగిసింది. నాలుగు సెషన్లలో దాదాపుగా 48 శాతం నష్టపోయింది.

మార్కెట్లకు బడ్జెట్ ఉత్సాహం

సెన్సెక్స్ 212 పాయింట్ల ర్యాలీ

ముంబయి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ శుక్రవారం మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. మధ్య తరగతికి పన్ను మినహాయింపు పరిమితిని పెంచడం మదుపర్లలో కొంత విశ్వాసాన్ని పెంచింది. తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ 212 పాయింట్లు పెరిగి 36,469 వద్ద ముగిసింది. ఇంట్రా ట్రేడింగ్‌లో ఓ దశలో 36,778 పాయింట్ల గరిష్టని తాకింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 62.70 పాయింట్లు రాణించి 10,893.65 కు చేరింది. సెన్సెక్స్-30లో హీరో మోటో కార్ప్ 7.47 శాతం, మారుతి సుజుకి 4.70 శాతం, హెచ్‌సిఎల్ టెక్ 3.37 శాతం, ఆసియన్ పెయింట్స్ 2.65 శాతం, బజాజ్ ఆటో 2.40 శాతం చొప్పున అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు వేదాంత అత్యధికంగా 18.10 శాతం నష్టపోయింది. కాగా యస్ బ్యాంకు 4.70 శాతం, ఎస్‌బిఐ 3.70 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 3 శాతం, కోల్ ఇండియా 1 శాతం చొప్పున అదికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

వ్యవసాయ కమతాలపై పన్ను సిఫార్సు చేసినవారు?



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

1. ఈ కింది వాటిలో ఏది కొంతవరకైనా మానవ మూలధనంలో పెట్టుబడిగా పరిగణించబడుతుంది ?
ఎ. లాంఛనబద్ధమైన విద్య
బి. పనిచేస్తూ శిక్షణ పొందడం
సి. మెరుగైన ఆరోగ్య సౌకర్యం
డి. పైవన్నీ

2. లోటు ద్రవ్య విధానం అంటే ?
ఎ. విదేశ సహాయంపై ఆధారపడడం
బి. విదేశాల నుంచి తెచ్చిన రుణాలతో ఖర్చు చేయడం
సి. అభివృద్ధికి తగినంత ఖర్చు చేయకపోవడం
డి. రాబడి కంటే ఎక్కువ ఖర్చు చేయడం

3. భారతదేశంలో మూలధన మార్కెట్‌ని నియంత్రణ చేసే ఒక స్వతంత్ర చట్టబద్ధమైన సంస్థ ?
ఎ. ఎస్ఈబిఐ బి. ఎన్ఎస్ఇఐ
సి. ఆర్‌బిఐ డి. బిఐఎఫ్ఆర్

4. ఎంఆర్‌టిపి చట్టం ఉద్దేశం ?
ఎ. తయారీ పరిశ్రమల్లో ఉద్యోగిత పెంచడం
బి. విదేశ పోటీ నుంచి ఉత్పత్తిదారులను రక్షించడం
సి. ఆర్థిక స్తోమత కేంద్రీకరణను అదుపు చేయడం
డి. సరైన దిశలో పెట్టుబడిని నిర్దేశించడం

5. ఒక దేశం కరెన్సీ మూల్యవిహీనకరణ కావించినపుడు కలిగే ప్రభావం ?
ఎ. ఎగుమతులు పెరుగుతాయి. దిగుమతులు తగ్గుతాయి
బి. దిగుమతులు పెరుగుతాయి. ఎగుమతులు తగ్గుతాయి
సి. దిగుమతులు ప్రియం అవుతాయి. ఎగుమతులు చవక అవుతాయి
డి. ఎగుమతులు ప్రియం అవుతాయి. దిగుమతులు చవక అవుతాయి

6. ప్రస్తుతం ఇది ఐఎంఎఫ్ యొక్క ప్రత్యక్ష ఆశయాల్లో ఒకటి కాదు ?
ఎ. సభ్యదేశాల కరెన్సీ విలువలను సమాన స్థాయిలో ఉంచి విదేశ ద్రవ్య వినిమయాన్ని స్థిరంగా ఉంచడం.
బి. అంతర్జాతీయ ద్రవ్యత్వాన్ని ప్రోత్సహించడం
సి. విదేశ వ్యాపారం విస్తరించి దాని సంతులిత వృద్ధికి పాటుపడడం
డి. సభ్య దేశాలకు నిధి యొక్క వనరులను అందించి వారి విశ్వాసాన్ని చూరగొనడం

7. వ్యవసాయ రంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగితకు గల కారణం ?
ఎ. భూమిపై జనాభా ఒత్తిడి
బి. ఋతుపవనాలపై వ్యవసాయం ఆధారపడడం
సి. జమీందారీ వ్యవస్థను రూపుమాపడం
డి. వ్యవసాయ రంగంలో కార్మిక సంఘాలు లేకపోవడం

8. భారతదేశంలో ప్రజల వద్ద ఉన్న కరెన్సీ, బ్యాంకుల్లో ఉన్న డిమాండు డిపాజిట్లు కలిసి ఆర్.బి.ఐ ప్రకారం ఇలా పిలువబడుతుంది ?
ఎ. ఎం$_1$ బి. ఎం$_2$ సి. ఎం$_3$ డి. ఎం$_4$

9. భారతదేశంలో ప్రయివేటీకరణ అంటే ?
ఎ. పిఎస్‌యులలో ప్రభుత్వ వాటాలను తగ్గించడం
బి. కొత్త ప్రదేశాలలో ప్రయివేటు పెట్టుబడిని అనుమతించడం
సి. జాతీయం చేసిన పరిశ్రమలను ప్రయివేటీకరణ చేయడం
డి. పైవన్నీ

10. సంస్కరణలో భాగంగా భారతదేశం ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరిచింది అంటే అర్థం ఏమిటి ?
ఎ. ప్రయివేటు రంగాన్ని అభివృద్ధి చేయడానికి
బి. అభివృద్ధిలో అన్ని రంగాలూ పాలుపంచుకోడానికి
సి. ప్రపంచ దేశాల నుంచి అధిక మొత్తంలో ఇచ్చి పుచ్చుకునే విధానం
డి. లైసెన్సింగ్ విధానం

11. సంస్కరణల తర్వాత నూతన ఆర్థిక విధానంలో మనం ఎక్కువగా దృష్టికేంద్రీకరించింది ?
ఎ. దిగుమతి ప్రత్యామ్నాయాలపై
బి. ఎగుమతులను ప్రోత్సహించడం
సి. ప్రపంచ బ్యాంకు సపోర్టు
డి. అంతర్గత వ్యాపారం

12. కింది వానిలో ఏది సరైనది కాదు ?
ఎ. ఎన్‌డిపి అనేది జిడిపి నుంచి తరుగుదల తీసివేయగా వచ్చేది
బి. జిడిపికి విదేశీ కారక ఆదాయాన్ని కలిపిన జిఎన్‌పికి సమానం అవుతుంది
సి. ఎన్‌డిపి నుంచి తరుగుదల తీసివేయగా జిడిపి వస్తుంది
డి. జిఎన్‌పి నుంచి తరుగుదల, వ్యాపార పరోక్ష పన్నులను తీసివేయగా అది జాతీయాదాయానికి సమానమగును

13. కిందివానిలో దేనిని జిడిపిని లెక్కించడానికి కలుపుతారు ?
ఎ. ప్రభుత్వం ప్రజలకు బాండును అమ్మిన ధర
బి. గృహిణి అందించిన సేవలు
సి. ఉపయోగించిన (వాడిన) కార్ల డీలరు యొక్క సేవలు
డి. పదవీ విరమణ చేసిన వృద్ధులకు చెల్లించే (పెన్షన్) భృతి

14. ప్రణాళికా సంఘం నిర్వచనం ప్రకారం, భారతదేశ దారిద్ర్య రేఖను కింది విధంగా నిర్ధారించినారు ?
ఎ. 1980-81 ధరల ప్రకారం పట్టణ ప్రాంతంలో సాలీనా తలసరిఆదాయం రూ.1,800గానూ, గ్రామ ప్రాంతాలలో సాలీనా తలసరి ఆదాయం రూ.1,200గానూ లెక్కించడం
బి. తీసుకునే కాలరీల ప్రకారం పట్టణంలో 2,100 కాలరీలుగానూ, గ్రామీణ ప్రాంతాల్లో 2,400 కాలరీలుగాను లెక్కించడం
సి. ఐదుగురుగల పట్టణ కుటుంబంలో ఇద్దరు ఉద్యోగస్థులుగా ఉండాలి. గ్రామీణ ప్రాంతంలో ఒకరు ఉద్యోగిగా ఉండాలి.
డి. 1990-91 ధరలలో పట్టణ ప్రాంత సాలీన తలసరి ఆదాయం రూ.3,200గానూ, గ్రామీణ సాలీన తలసరి ఆదాయం రూ.2,800 గానూ నిర్ణయించడమైంది

15. ఒకవేళ ద్రవ్యోల్బణం పెరిగి వేతనాలను పెంచినట్లయితే ?
ఎ. ఉత్పాదకతలో పెరుగుదల
బి. సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల
సి. ఉత్పాదకతలో పెరుగుదల కంటే తక్కువ
డి. ఉత్పాదకతలో పెరుగుదల కంటే ఎక్కువ

16. కింది వానిలో ఏది సరైనది కాదు ?
ఎ. రెండు రంగాల విధానములో గృహ మరియు వాణిజ్య రంగాల మధ్య సంబంధాన్ని చదవడం జరుగుతుంది
బి. రెండు రంగాల విధానంలో స్వదేశీ మరియు విదేశీ రంగాల మధ్య సంబంధాన్ని చదవడం జరుగుతుంది
సి. మూడు రంగాల విధానంలో గృహరంగం, వాణిజ్య రంగం మరియు ప్రభుత్వ రంగం గురించి చదవడం జరుగుతుంది
డి. నాలుగు రంగాల విధానంలో గృహరంగం, వాణిజ్య రంగం, ప్రభుత్వ రంగం, విదేశీ రంగం గురించి చదవడం జరుగుతుంది.



17. ఏ పరిస్థితిలో ప్రచ్ఛన్న నిరుద్యోగిత ఏర్పడుతుంది ?
ఎ. కొంతమంది కార్మికుల ఉపాంత ఉత్పత్తి సగటు ఉత్పత్తి కంటే తక్కువగా ఉన్నప్పుడు.
బి. కొంతమంది కార్మికుల ఉపాంత ఉత్పత్తి శూన్యం లేదా ఋణాత్మకం అయినప్పుడు.
సి. ఉపాంత ఉత్పత్తి స్థిరంగా ఉన్నప్పుడు.
డి. ఉపాంత ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పుడు.

18. జిఎన్‌పి అనేది జిడిపి కంటే అధికంగా ఉన్నప్పుడు ?
ఎ. విదేశీ కారక నికర ఆదాయం శూన్యం
బి. విదేశీ కారక నికర ఆదాయం ఋణాత్మకం
సి. విదేశీ కారక నికర ఆదాయం ధనాత్మకం
డి. నియమిత ఉప ఆర్థిక వ్యవస్థ కావున దేశాల మధ్య ఉత్పత్తి కారకాలకు గమన శీలత లేదు.

19. కింది వానిలో ఏది జిడిపికి సంబంధించినది కాదు ?
ఎ. జిడిపి ప్రవాహాన్ని తెలిపేది
బి. జిడిపి త్రైమాసికంగా (సాధారణంగా) రిపోర్టు చేయాలి. కానీ ఇక్కడ సంవత్సరానికి రిపోర్టు చూపిస్తున్నారు
సి. జిడిపిని అంతిమ వస్తువుల మార్కెటు విలువలో చూపిస్తున్నారు
డి. ఒక సంవత్సర కాలంలో అన్ని కంపెనీలచే ఉత్పత్తి చేసిన వస్తు సేవలను కలుపగా వచ్చిన విలువే జిడిపి

20. భారతదేశంలో అత్యధికంగా జాతీయాదాయాన్ని సమకూర్చేది ?
ఎ. వ్యవసాయ రంగం బి. పారిశ్రామిక రంగం
సి. సేవల రంగం డి. వర్తక రంగం

21. భారతదేశంలో వస్తువుల ధరల్లో మార్పులను కొలిచే సూచీ సంఖ్యలు ?
ఎ. టోకు ధరల సూచీ బి. వినియోగ ధరల సూచీ
సి. చిల్లర ధరల సూచీ డి. సాధారణ ధరల సూచీ

22. భారతదేశంలో జాతీయాదాయ అంచనాకు సిఎస్‌ఓ ప్రస్తుతం ఉపయోగించే ఆధార సంవత్సరం ఏది ?
ఎ. 2004-05 బి. 2011-12
సి. 2001-04 డి. 1999-2000

23. భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు 'నిత్య హరిత విప్లవం' భావనను ఉపయోగించినవారు ?
ఎ. నార్మన్ బార్లోగ్ బి. ఎం.ఎస్.స్వామినాథన్
సి. రాజ్‌క్రిష్ణ డి. ఆర్.కె.వి.రావు

24. భారతదేశంలో నిర్ణీత గడువు ముందుగానే ముగింపు చేసిన పంచవర్ష ప్రణాళిక ఏది ?
ఎ. మూడో పంచవర్ష ప్రణాళిక
బి. నాల్గో పంచవర్ష ప్రణాళిక
సి. ఐదో పంచవర్ష ప్రణాళిక
డి. ఆరో పంచవర్ష ప్రణాళిక

25. భారతదేశానికి నిలకడ గల నాల్గో పంచవర్ష ప్రణాళికను రూపొందించిన వారు ?
ఎ. ఎ.ఎస్.మన్నె మరియు ఎ.రుద్ర
బి. ఎ.కె.సెన్ మరియు కె.ఎన్.రాజ్
సి. పి.సి.మహలనోబిన్
డి. సుకుఖోవాహో చక్రవర్తి

26. కిందివానిలో పర్యవేక్షణ చేయలేని 11వ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలు ఏవి ?
ఎ. మొత్తం ప్రజాజనన రేటు 2.1కి తగ్గించడం
బి. ప్రతి 1000 జననాలకు మరణాల రేటు 45కు తగ్గించడం
సి. లింగ నిష్పత్తి 2011-12 నాటికి 935కు పెంచి, ఆతర్వాత 950కి పెంచడం
డి. అడవుల అదనపు వృద్ధి ఐదు శాతం చేయడం

27. పదకొండో పంచవర్ష ప్రణాళిక కాలంలో అంచనావేయబడిన పొదుపు రేటు స్థూల దేశీయ ఉత్పత్తిలో ?
ఎ. 34.8 శాతం బి. 33.8 శాతం
సి. 32.8 శాతం డి. 31.8 శాతం

28. సంపూర్ణ కాపిటల్ అకౌంటు కన్వర్టబిలిటీ సాధించడానికి 2006లో ఏర్పాటు చేసిన కమిటీ అధ్యక్షుడు ఎవరు ?
ఎ. ఎస్.ఎస్.తారోపోర్ బి. సి. రంగరాజన్
సి. ఎం. నరసింహం డి. ఒ.పి.సోధాని

29. కిందివానిలో భారతదేశ భూసంస్కరణల పథకంలో భాగం కానిది ఏది ?
ఎ. కమతాలపై పరిమితి బి. కమతాల సమీకరణ
సి. వ్యవసాయ కమతాలు డి. జమిందారీ వ్యవస్థ నిర్మూలన

30. జిల్లా పరిశ్రమల కేంద్రం భావనను ప్రవేశపెట్టిన వారు ?
ఎ. ఇందిరాగాంధీ ప్రభుత్వం
బి. 1977 జనతా ప్రభుత్వం
సి. 1956 నెహ్రూ ప్రభుత్వం
డి. 1991 నరసింహరావు ప్రభుత్వం

31. వ్యవసాయ కమతాలపై పన్ను సిఫార్సు చేసినవారు ?
ఎ. రాజ్ కమిటీ బి. భూతలింగం కమిటీ
సి. వాంఛూ కమిటీ డి. ఖుస్రో కమిటీ

32. కిందివానిలో 1991 పారిశ్రామిక విధానంలోని ఒక ముఖ్యాంశం ?
ఎ. ప్రవాస భారతీయులు భారతదేశంలో మూలధన పెట్టుబడి పెట్టరాదు
బి. అన్ని రకాల పరిశ్రమలు లైసెన్సు రహితంగా చేయడం
సి. ఒక సంవత్సరం సాంకేతిక పరిజ్ఞాన దిగుమతిపై ఆంక్షలు
డి. కీలక పరిశ్రమల్లో 51.0 శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడి అవకాశం

33. ఎఫ్ఆర్‌బిఎం యొక్క ముఖ్య ఉద్దేశం దీనిని తగ్గించుట ?
ఎ. బ్యాంకింగ్ లోటు బి. రెవెన్యూ లోటు
సి. బడ్జెట్ లోటు డి. విదేశీ లోటు

34. భారతదేశపు తొలి మానవాభివృద్ధి రిపోర్టు విడుదల చేసింది ?
ఎ. ఏప్రిల్ 2001 బి. ఏప్రిల్ 2002
సి. ఏప్రిల్ 2003 డి. ఏప్రిల్ 2004

35. భావికాలంలో భారతదేశ జనాభా సంబంధిత లాభాంశం ఎక్కువగా ఉండాలంటే ?
ఎ. 8-15 సంవత్సరాల మధ్య వయస్సు గలవారి జనాభా పెరగాలి.
బి. 7 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారి పిల్ల జనాభా పెరగాలి.
సి. 65 సంవత్సరాల పైబడి వయస్సు గలవారి జనాభా పెరగాలి.
డి. 15-64 సంవత్సరాల మధ్య వయస్సు గలవారి జనాభా పెరగాలి.

36. లీడ్ బ్యాంకు పథకాన్ని ప్రవేశపెట్టిన సంవత్సరం ?
ఎ. 1968 బి. 1969
సి. 1970 డి. 1971

37. కోశలోటులో వడ్డీ చెల్లింపులు మినహాయిస్తే వచ్చేది ?
ఎ. ప్రాథమిక లోటు బి. రెవిన్యూ లోటు
సి. బడ్జెట్ లోటు డి. ద్రవ్యంతో భర్తీ చేయబడిన లోటు

38. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా పొద్దు తిరుగుడు పువ్వు ఉత్పత్తిని సాధించిన జిల్లా ?
ఎ. తూర్పుగోదావరి బి. కర్నూలు
సి. శ్రీకాకుళం డి. నెల్లూరు

39. ఆంధ్రప్రదేశ్‌లోని కింది వానిలో పారిశ్రామిక వృద్ధి కేంద్రం ఎక్కడ నెలకొల్పారు?
ఎ. బొబ్బిలి బి. ఒంగోలు
సి. గాజుల రామాపురం డి. హిందూపురం

40. వాన్‌పిక్ ప్రాజెక్టుకు సంబంధించిన జంట జిల్లాలు ఏవి ?
ఎ. గుంటూరు మరియు ప్రకాశం
బి. కృష్ణా మరియు పశ్చిమగోదావరి
సి. విశాఖ మరియు విజయనగరం
డి. కర్నూలు మరియు కడప

సమాధానాలు : 1.డి, 2.డి, 3.ఎ, 4.సి, 5.ఎ, 6.సి, 7.ఎ, 8.ఎ, 9.డి, 10.సి, 11.బి, 12.సి, 13.సి, 14.బి, 15.డి, 16.బి, 17.బి, 18.సి, 19.డి, 20.సి, 21.ఎ, 22.బి, 23.బి, 24.సి, 25.ఎ, 26.ఎ, 27.ఎ, 28.ఎ, 29.సి, 30.బి, 31.ఎ, 32.డి, 33.బి, 34.బి, 35.డి, 36.బి, 37.ఎ, 38.బి, 39.సి, 40.బి. ★

లేఖ



పాకిస్తాన్ జైలు నుంచి మత్స్యకారులు రాసిన ఉత్తరాలను చూపుతున్న బాధిత కుటుంబాల మహిళలు

మా విడుదలకు వారిని నిలదీయండి

ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే సులభమే..
భారత జలాల్లోనే మమ్మల్ని అరెస్టు చేశారు
పాక్ జైలు నుంచి కుటుంబాలకు మత్స్యకారుల లేఖ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా)

'ప్రియమైన తల్లిదండ్రులకు మీ కుమారుడు లక్ష్మణరావు నమస్కరించి రాయునది. మేము పాకిస్తాన్ జైలులో క్షేమంగానే ఉన్నాము. మీరేం బాధపడకండి. మీరు వెంటనే మంత్రి కళా వెంకటరావును కలవండి. ఆయన ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలవండి. వారి ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలవండి. స్పందించకుంటే నిలదీయండి. వారు గట్టిగా ప్రయత్నిస్తే మేము వేగంగా విడుదలవుతాం'. ఇదీ గతేడాది నవంబరులో పాకిస్తాన్ తీరప్రాంత గస్తీ దళాలకు దొరికిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంకు చెందిన మత్స్యకారుడు లక్ష్మణరావు. జైలు నుంచి కుటుంబసభ్యులకు రాసిన లేఖ సారాంశం. ఆయనతో పాటు జైల్లో ఉన్న జిల్లాకు చెందిన 15 మంది మత్స్యకారులూ తమ కుటుంబసభ్యులకు రాసిన ఉత్తరాలు శుక్రవారం వారికి అందాయి. తాము క్షేమంగానే ఉన్నామని, ఎవరూ బాధపడొద్దని ఆ లేఖలో పేర్కొన్నారు. తాము కరాచీలోని సింధ్ జైలులో ఉన్నామని, పట్టుబడిన 22 మందినీ ఒకే గదిలో పెట్టారని తెలిపారు. తాము అరేబియా సముద్రంలో భారతదేశ జలాల్లోనే ఉన్నా, పాకిస్తాన్ దళాలు అరెస్టు చేశాయని వాపోయారు. వెంటనే తమ ఆధార్, రేషన్‌కార్డులను వీరావలిలోని బోట్ల యజమానులకు పంపాలన్నారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి గ్రామంలోకి వచ్చే ప్రతి రాజకీయ నాయకుడినీ తమ విడుదల కోసం నిలదీయాలని సూచించారు. కుటుంబసభ్యులు వారికి తిరిగి ఉత్తరం పంపడానికి సింధ్ జైలు చిరునామానూ అందులో పేర్కొన్నారు. ఇప్పటివరకు వారెక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో అన్న ఆందోళనలో ఉన్న కుటుంబసభ్యులకు ఈ ఉత్తరాలు కాస్త ఊరటనిచ్చాయి. పాకిస్తాన్ జైలులో మగ్గుతున్న మత్స్యకారుల విడుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సముద్రతీర మత్స్యకారుల సంక్షేమ సంఘం నాయకులు మూగి రామారావు డిమాండ్ చేశారు.

మైనింగ్ మాఫియాను అడ్డుకున్న గిరిజనులు

ప్రజాశక్తి - అనంతగిరి (విశాఖపట్నం)

విశాఖ ఏజెన్సీలోని అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ పరిధి లువ్వా, బోడగుడ గ్రామాల వద్ద గ్రానైట్ మైనింగ్ తవ్వకాలను గిరిజన సంఘం ఆధ్వర్యాన పంచాయతీ ప్రజలు శుక్రవారం అడ్డుకున్నారు. మైనింగ్ మాఫియాను తరిమికొట్టారు. తొలుత మైనింగ్ ప్రాంతాన్ని అనంతగిరి ఎంపిటిసి సభ్యులు డి.గంగరాజు, భీంపోలు ఎంపిటిసి సభ్యులు పి.సరస్వతి, స్థానిక గిరిజనులు మైనింగ్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఉండేందుకు చేస్తున్న ఏర్పాట్లను, వారం రోజులుగా చేపట్టిన గ్రానైట్ తవ్వకాలను పరిశీలించారు. అక్రమంగా గ్రానైట్ తవ్వకాలపై మైనింగ్ సిబ్బందిని గిరిజనులు నిలదీశారు. అక్కడ నుంచి వెంటనే వెళ్లిపోవాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో అక్కడి నుంచి మైనింగ్ సిబ్బంది పరుగులు తీశారు. 3 గంటల తరువాత మైనింగ్ వ్యాపారులు అక్కడకు వచ్చారు. 'మైనింగ్ మాఫియా గోబ్యాక్, పనులు వెంటనే నిలిపివేయాలి' అంటూ గిరిజనులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. మైనింగ్ వ్యాపారులను చుట్టుముట్టి నిర్బంధించారు. ప్రజాభిప్రాయం లేకకుండా ఏ విధంగా మైనింగ్ తవ్వకాలు చేపడతారని ప్రశ్నించారు. ప్రొక్లెయినర్‌తో పాటు కట్టర్ మిషన్లు తీసుకొని అప్పటికప్పుడే బయటికి తీసుకెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికిప్పుడు వెళ్లిపోవాలని డిమాండ్ చేయగా, రేపటికి ఖాళీ చేస్తామని చెప్పారు. దీంతో మైనింగ్ యాజమన్యం తాత్కాలికంగా పనులు నిలుపుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

అనంతరం ఎంపిటిసిలు మాట్లాడుతూ సరియాపల్లి రెవెన్యూ పరిధి లువ్వా గ్రామం, బోడకొండ వద్ద 118 ఎకరాల గ్రానైట్ మైనింగ్ తవ్వకాల వల్ల లువ్వా దిగువలస, భీంపోలు, నందకోట, సిమిడిపల్లి, సరియాపల్లి, రాళ్లగరువు, సీతపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాలు ముంపునకు గురి కానున్నాయని తెలిపారు. జీడిమామిడి, పనస వంటి తోటలు దెబ్బతింటాయన్నారు. తాటిపూడి రిజర్వాయర్‌కు నీరుందించే గోస్తనీ నది కలుషితమవుతుందని చెప్పారు. విశాఖ, విజయనగరం, ఎస్.కోట వంటి మైదాన ప్రాంతాలకు ఈ నీరే తాగునీటిగా సరఫరా అవుతోందని, ఒక పక్క స్థానిక ప్రజలకు మైదాన ప్రజలకు నష్టాన్ని కలిగించే గ్రానైట్ వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. పంచాయతీ అభిప్రాయ సేకరణ లేకుండా ఏ విధంగా మైనింగ్ చేపడతారని వారు ప్రశ్నించారు. చోటా మోటా రాజకీయ నాయకులు మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. మైనింగ్ యాజమాన్యం కావాలా ప్రజల కావాలా అని తేల్చుకోవాలని ప్రజాప్రతినిధులకు స్పష్టం చేశారు.



మైనింగ్ వ్యాపారులను నిలదీస్తున్న గిరజనులు

పౌష్టికాహార లోపంతో చిన్నారులు

- **డబ్ల్యుహెచ్ఒ రీజినల్ అడ్వయిజర్ అలెగ్జాండర్**



సదస్సును ప్రారంభిస్తున్న అలెగ్జాండర్

ప్రజాశక్తి - కాకినాడ సిటీ

భారతదేశంలో ఎక్కువశాతం మంది పౌష్టికాహార లోపంతో ఉన్నారని డబ్ల్యుహెచ్ఒ రీజినల్ అడ్వయిజర్ అలెగ్జాండర్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో నిర్వహిస్తున్న ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ జాతీయ సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సౌత్ ఈస్ట్ ఏసియాలో ఏజెన్సీ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో వైద్యం అందడంలేదన్నారు. మారుమూల ప్రాంతాల్లో వైద్యం చేయడమే వైద్యుని గొప్ప లక్షణమని అన్నారు. పొల్యూషన్‌తో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు. పౌష్టికాహార లోపం నివారణ కోసం ప్రజల్లో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ చేస్తున్న అవగాహన కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. స్వామి పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ ఫ్యాక్టరీల వల్ల గాలి, నీరు కలుషితమవుతున్నాయని అన్నారు. ఫోన్లతో కాకుండా కుటుంబ సభ్యులతో గడపాలని కోరారు. స్టేట్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఎంఇఒ) డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ కమ్యూనికేషన్ మెడిసిన్‌తో ఎంతో ఉపయోగముందని చెప్పారు. విద్యావాహిణి ద్వారా వైద్యులు, నర్సులు గ్రామాల్లో పర్యటించి ఆరోగ్యం పట్ల అవగాహనతోపాటు చికిత్స చేస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన 108, ఆయుష్మ వంటి వాటి ద్వారా అందరికీ వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఉదయం పీజీ వైద్య విద్యార్థులు ఏడు ప్లీనరీలు, ఒక ఓరేషన్, నాలుగు అవార్డు పేపర్ల కార్యక్రమాలను నిర్వహించారు. 120 మంది పీజీ విద్యార్థులు న్యూట్రిషన్ గురించి, తల్లీ బిడ్డ ఆహారం, రక్తహీనత నివారణ, విభిన్న రీసెర్చుల గురించి వివరించారు. చంటి పిల్లల ఎదుగుదల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వచ్ఛభారత్‌తో ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయాలపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వైద్యులు సదస్సులో చర్చించారు. ఈ కార్యక్రమంలో రంగరాయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మహాలక్ష్మి, జిజిహెచ్ సూపరింటెండెంట్ రాఘవేంద్రరావు, డాక్టర్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ టీచర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రభుత్వానికి అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని టీచర్స్ లెక్చరర్స్ ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్య నాథ్‌దాస్‌ను శుక్రవారం అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల మంది బోధన, బోధనేతర ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వీరికి ప్రభుత్వం నుంచి గానీ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల నుంచి ఎటువంటి గుర్తింపు లేదని, కార్డు ఇవ్వాలని కోరారు. కనీసం వేతనాలు అమలు చేయడం లేదని, ప్రతి నెల చెల్లించాల్సి ఇఎస్ఐ, పిఎఫ్ 50శాతం విద్యాసంస్థల్లో యాజమాన్యాలు చెల్లించడం లేదని తెలిపారు. పర్యవేక్షించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి యంత్రాంగ లేదన్నారు.. రోజుకు 7 గంటల నిల్చొని పాఠాలు బోధించడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని, 45 ఏళ్లు దాటిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం నుంచి హెల్త్ కార్డు ఇవ్వాలని, జీవితాంతం ఉపాధ్యాయునిగా పనిచేసి మరణించిన వారికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని కోరారు. మహిళా ఉపాధ్యాయులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని తెలిపారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వమే వసలిగృహాలు నిర్మించాలని, లేదంటే సంక్షేమ బోర్డు ద్వారా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని ఆదిత్యానాథ్ దాస్ హామీనిచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎస్ నూర్‌మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

డి-పట్టాదారులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి (విశాఖపట్నం)

డి.పట్టాదారులకు పూర్తిగా పరిహారం చెల్లించేవరకు ఎటువంటి పనులూ చేపట్టనివ్వబోమని, అంతవరకు పనులను అడ్డుకుంటామని రైతులు స్పష్టం చేశారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలంలోని పాటిమీద గ్రామంలో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమి హద్దులు నిర్ణయించేందుకు రావడంతో వైసిపి నాయకులు సూరకాసుల గోవిందు, పలువురు రైతులు అడ్డుతగిలారు. వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం డి.పట్టాదారుల నుంచి భూములు సేకరించిందని, పట్టాదారు పాసుపుస్తకాలు, క్లయిమ్‌లు తీసుకుని ఏడాది అవుతున్నా నేటికి పరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు.

'థర్మల్' భూముల్లో త్వరలో దుక్కులు

సమాయత్తం కావాలని రైతులకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి- కొమరాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా కొమరాడ మండలం కోటిపాం వద్ద థర్మల్ విద్యుత్తు పవర్ ప్లాంట్ నిర్మిస్తామని చెప్పి 2009లో రైతుల నుంచి తీసుకున్న భూముల్లో త్వరలో దుక్కులు దున్నుదామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఇందుకు రైతులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కోటిపాం పవర్ ప్లాంట్‌కు భూమిలిచ్చిన లింగందొరవలస రైతులతో ఆ గ్రామంలో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి భూములను లాక్కొని పదేళ్ల కావస్తున్నా నేటికీ ప్లాంటు ఏర్పాటు కాకపోవడం, భూములను తీసుకున్న సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. భూములు సేకరించిన ఐదేళ్లలోపు ప్లాంట్ ఏర్పాటు కాకపోతే తిరిగి ఈ భూములను రైతులకు అప్పగించాలని 2013 భూ సేకరణ చట్టం చెబుతోందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని సింగూరులో పరిశ్రమ ఏర్పాటు కోసం తీసుకున్న భూములు ఐదేళ్లు దాటడంతో తిరిగి రైతులకు అప్పగించారని గుర్తు చేశారు. కోటిపాం భూములను కూడా రైతులకు తిరిగి ఇవ్వకపోతే పెద్దఎత్తున ఉద్యమించి వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. అందులో భాగంగా ఈ నెల 5న కోటిపాం నుంచి పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. రైతులంతా హాజరు కావాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులతోపాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభం

సిపిఎస్ రద్దుకు ఉపాధ్యాయుల పాదయాత్ర



పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న యుటిఎఫ్ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ కె.విజయగౌరి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా కేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో అమరావతిలో జరిగే పాదయాత్రకు సంఘీభావంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ద్వారపూడి జంక్షన్, వై-జంక్షన్, పూల్‌బాగ్ జంక్షన్ నుంచి మూడు బృందాలుగా ఉపాధ్యాయులంతా కోట వరకూ పాదయాత్ర నిర్వహించారు. ద్వారపూడి వద్ద పాదయాత్రను యుటిఎఫ్ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ కె.విజయగౌరి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మూడు ప్రాంతాల నుంచి సుమారు మూడు కిలోమీటర్లు పాదయాత్రగా కోట జంక్షన్‌కు చేరుకున్నారు. అనంతరం అక్కడ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో కె.విజయగౌరి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి..రాము, కె.శేషగిరి మాట్లాడారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల మెడకు ఉరితాడుగా ఉన్న సిపిఎస్‌ను రద్దు చేయకపోతే రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిపిఎస్‌ను రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని తెలిపారు. ఈ నెల ఏడో తేదీన జరిగే చలో అసెంబ్లీకి ఉపాధ్యాయులంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బిహెచ్ఆర్ ప్రభూజి, ఆర్‌వి రమణమూర్తి మాట్లాడుతూ సిపిఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ మాట్లాడుతూ పాల్గొని సంఘీభావం తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీమోహనరావు, గౌరవాధ్యక్షులు సత్యశ్రీనివాస్, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

హోదా కోసం పోరాటం



గుంటూరులో నిరసన తెలుపుతున్న సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రత్యేకహోదా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే ఆర్‌టిసి బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి. ముందుస్తుగానే ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు మూసివేశారు. దుకాణాలు మూసివేశారు. పెట్రోలు బంకులు, హోటళ్లు, సినిమా థియేటర్లు మూసివేశారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, టిడిపి ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. కడప, విజయవాడలో అరెస్టులు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీలో గిరిజనులు ఆందోళనలో పాలుపంచుకున్నారు.

- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు
- పలుచోట్ల నేతల అరెస్టు
- విజయవాడలో నవజీవన్ నిలిపివేత

ప్రజాశక్తి-యంత్రాంగం

విజయవాడ వన్‌టౌన్‌లో దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించిన సిపిఎం నేతలను పోలీసులు అడ్డుకున్నారు. అయినా అక్కడ దిష్టిబొమ్మను దహనం చేశారు. లెనిన్ సెంటర్ నుండి వందలాది ద్విచక్ర వాహనాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, మహిళా సంఘాల నేతలు బంద్ నిర్వహించారు. ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం పైకి వచ్చిన నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. ఎపి ఎన్‌జీవోఎస్ పశ్చిమ కృష్ణా కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఎపిఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు సిహెచ్.విద్యాసాగర్ పాల్గొన్నారు. బెంజిసర్కిల్ వద్ద ప్రత్యేక హోదా కోరుతూ ఆందోళనకు దిగిన లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. రామవరప్పాడు రింగ్ వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొన్న హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేసి పెనమలూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గన్నవరంలో జరిగిన నిరసనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. విజయవాడ రామవరప్పాడు, లెనిన్‌సెంటరు, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో టిడిపి ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు.

అనంతపురంలో టవర్‌క్లాక్ సర్కిల్ నుంచి సిపిఎం నాయకులు మోడీ దిష్టిబొమ్మకు పాడె కట్టి పూల మాలలు వేసి వాయిద్య మేళ తాళాల నడుమ ఊరేగించారు. సప్తగిరి సర్కిల్ మీదుగా శవయాత్ర కొనసాగించారు. అనంతరం మరువ వంకలో మోడీ దిష్టిబొమ్మకు నిమజ్జనం చేశారు.

కడప జిల్లాలో నమ్మించి మోసగించిన ప్రభుత్వాలపై ప్రజాగ్రహం పెల్లుబికింది. జిల్లాలో పలు చోట్ల సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు, మానవహారాలు, బైకుర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టగా సిపిఐ బంద్ నిర్వహించింది. పలువురు నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేశారు. టిడిపి నాయకులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు.

చిత్తూరు జిల్లా తిరుపతిలో వామపక్షాల నేతలు నేతృత్వంలోఉదయమే అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్, విగ్రహాల ఎదుట నిరసన తెలిపారు.

కర్నూలు జిల్లాలో ఆర్‌టిసి బస్సులన్నీ డిపోలకు పరిమితం అయ్యాయి. సిపిఎం, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, జనసేన పార్టీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు జరిగాయి.

నెల్లూరు, ఆత్మకూరు, కావలి, గూడూరు, కోవూరు, ఉదయగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల్లో నిరసనలు, ర్యాలీలు ని. ఈ సందర్భంలో పోలీసులు, సిపిఎం నాయకుల మధ్య స్వల్ప తోపులాటలర్వహించారు. నెల్లూరు ఆర్‌టిసి వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు జరిగాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా భవన్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకూ నిరసన ర్యాలీ, ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రకాశం జిల్లాలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, జనసేన, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఒంగోలులోని కర్నూలు రోడ్డు బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకూ స్కూటర్ ర్యాలీ జరిగింది. కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. చర్చి సెంటర్‌లో ఉద్యోగులు మానవహారం నిర్మించారు. కందుకూరు, అద్దంకి, మార్కాపురం, చీరాల, కనిగిరి కేంద్రాల్లోనూ ప్రదర్శనలు నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో ఒంగోలులో మోకాళ్లపై నిలుచొని నిరసన తెలిపారు.

గుంటూరులో సిపిఎం ఆధ్వర్యంలో శంకర్‌విలాస్ సెంటర్ నుండి లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన జరిగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను తీవ్రంగా మోసం చేసిన మోడీకి ఎపిలో పర్యటించే హక్కు లేదన్నారు. మోడీ ఎపికి రావొద్దని, గోబ్యాక్ మోడీ అంటూ కార్యకర్తలు నినదించారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు. తెనాలిలో నిర్వహించిన ప్రవదర్శనలో సిపిఎం, సిపిఐ నిర్వహించిన ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడారు. జిల్లాలో పిడుగురాళ్ల, తాడేపల్లి సహా అనేక ప్రాంతాల్లో రాస్తారోకోలు, ర్యాలీలు జరిగాయి.

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిపిఎం తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు మాట్లాడారు. చల్లపల్లి, పామర్రు, గుడివాడ, ఉంగుటూరు, నందిగామ, జగ్గయ్యపేట, నూజివీడు, తిరువూరులో మోదీ దిష్టిబొమ్మలను దగ్ధంచేశారు. మచిలీపట్నంలోని కాంగ్రెస్, సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు. తూర్పుకృష్ణా ఎన్‌జిఒస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

తూర్పుగోదావరి జిల్లా చింతూరులో భద్రాచలం మాజీ ఎంఎల్ఎ, సున్నం రాజయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారామ్ అధ్వర్యాన సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాజమహేంద్రవరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాకినాడలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన మోటారుసైకిల్ ర్యాలీ చేశారు. అమలాపురం, పెద్దాపురం, రామచంద్రాపురం, రంపచోడవరం డివిజన్లలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా సిపిఐ, టిడిపి, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యాన బంద్ చేపట్టారు.

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సిపిఎం ఆధ్వర్యాన బైక్ ర్యాలీ చేసి, మోడీ, చంద్రబాబు దిష్టిబొమ్మలను దహనం చేశారు. మొగల్తూరు గాంధీబొమ్మ సెంటర్‌లో సిపిఎం నాయకులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. భీమడోలులో పూళ్ల వద్ద జాతీయ రహదారిపై, ఇరగవరం తహశీల్దార్ కార్యాలయంవద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. యలమంచిలిలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. తణుకు నరేంద్ర కూడలి వద్ద సిపిఐ, సిపిఎం, బిఎస్‌పి, కాంగ్రెస్, లోక్‌సత్తా ఆధ్వర్యాన కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, గణపవరం, పాలకోడేరు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి.

విశాఖ జిల్లా అనకాపల్లిలో సిపిఐ, ఉత్తరాంధ్ర చర్చావేదిక, ప్రత్యేక హక్కుల సాధన సమితి, ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో నిరసన తెలిపారు. 40 మంది నాయకులను అరెస్టు చేశారు. కశింకోట, నక్కపల్లి, పరవాడలోనూ నిరసనలు తెలిపారు. అనకాపల్లిలో సిపిఎం, జనసేన ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. దేవరాపల్లి, అరకులోయ, నర్సీపట్నం, డుంబ్రిగూడ, పెదబయలు, పరవాడ, రాంబిల్లి, అచ్యుతాపురం, చోడవరం, చీడికాడల్లో నిరసనలు వ్యక్తం చేశారు. విశాఖ మద్దిలపాలెం డిపో వద్ద సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తితో సహ పలువుర్ని పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం ఆధ్వర్యాన విశాఖలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. మోడీ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్‌చేశారు. పాత గాజువాక, పెందుర్తి సుజాతనగర్, గోపాలపట్నం, మల్కాపురం ప్రాంతాల్లో ర్యాలీలు, మధురవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. .

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో సిపిఎం నాయకులు ఐదుగురిని అరెస్టు చేశారు. ప్రత్యేక హోదా సాధన సమితి పిలుపుతో బంద్‌లో భాగస్వామ్యమైన సిపిఐ, కాంగ్రెస్ నాయకులు ఆర్‌టిసి అవుట్ గేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.

విజయనగరం జిల్లా పార్వతీపురంలో సుందరయ్య భవనం నుంచి ఆర్‌టిసి కూడలి వరకూ ర్యాలీ, అనంతరం రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడారు. విజయనగరంలో బంద్‌కు మద్దతుగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద నిరసన తెలిపారు. కొత్తవలసలో సిపిఎం ఆధ్వర్యాన బైక్ ర్యాలీ జరిగింది. బొబ్బిలి, సాలూరు, గజపతినగరం, కొత్తవలస, బలిజిపేట, సీతానగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, నెల్లిమర్ల తదితర చోట్ల వేర్వేరుగా ర్యాలీలు జరిగాయి.

హోదా వచ్చే వరకూ పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

సినీపరిశ్రమ కూడా పాల్గొనాలి: చలసాని

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చే వరకూ పోరాటం కొనసాగిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు అన్నారు. హోదా, విభజన హామీల విషయంలో కేంద్ర వైఖరికి నిరసన కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ లెనిన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోదా కోసం అవసరమైతే రాబోయే ప్రభుత్వంతో కూడా పోరాడతామన్నారు. ఆందోళనలు కేంద్రానికి ఒక హెచ్చరిక కావాలన్నారు. హోదా ముగిసిన అధ్యాయమనే బిజెపి వైఖరిని ప్రశ్నిస్తున్నామన్నారు. రాష్ట్రానికి అన్నీ ఇచ్చామని చెబుతున్నారని, వాస్తవానికి విభజన చట్టంలోని ఏ హామీని నెరవేర్చలేదని తెలిపారు. ఆఖరి బడ్జెట్‌లోనే ప్రత్యేక హోదాను కేంద్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. హామీ ఇచ్చినవన్నీ సాధించేదాకా తీవ్ర పోరాటం చేస్తామన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా చేపట్టిన ఆందోళనల్లో సినీ పరిశ్రమ కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. హోదా ఉద్యమానికి అందరూ కలిసిరావడం హర్షణీయమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ ప్రభుత్వాన్ని విడిచిపెట్టే ప్రసక్తి లేదన్నారు. అన్యాయం చేయడంలో టిడిపి వాటా కూడా ఉందన్నారు. తొలుత లెనిన్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, నాయకులు స్వరూపరాణి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పొలారి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు.. ఆర్టీసి జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాలు చేపట్టారు.


విజయవాడలో...

జర్నలిస్టుల నిరసన

విజయవాడ లెనిన్ సెంటరులో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ విశాఖకు రైల్వేజోన్ ఇవ్వాలని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టుకు, అలాగే విద్యాసంస్థలకు నిదులివ్వాలని ఆయన కేంద్రప్రభుత్వాన్ని

డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఓ శాంతి, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నాయకురాలు స్వరూప పాల్గొన్నారు. ఫెడరేషన్ ఆందోళనకు ఎపి జర్నలిస్ట్ ఫోరమ్ సంఘీభావం తెలిపింది. కృష్ణాజిల్లా నందిగామలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఒంగోలులో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి భక్తవత్సలం తదితరుల ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. కర్నూలులో కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో నిరసన ర్యాలీ జరిగింది. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో ఎపిడబ్లుజెఎఫ్, ఎపిబిజెఎ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తిరుపతి గాంధీ విగ్రహం వద్ద జరిగిన ర్యాలీలో రాష్ట్ర కార్యదర్శి వి గోపి పాల్గొన్నారు. శ్రీకాళహస్తి, కలికిరిల్లో కూడా ఆందోళనలు జరిగాయి.


విశాఖలో మోకాళ్లపై టిడిపి నాయకుల నిరసన


తిరుపతిలో సిపిఐ ఆధ్వర్యంలో...


విజయవాడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

తండ్రిపై కొడుకు దాడి

ప్రజాశక్తి- గుడిబండ

జల్సాల కోసం డబ్బులు ఇవ్వలేదనే అక్కసుతో మారణాయుధంతో కన్నతండ్రిపై దాడి చేశాడు ఓ కుమారుడు. ఈ ఘటన అనంతపురం జిల్లా గుడిబండ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గుడిబండ మండలం గుడ్డదహళ్లి గ్రామానికి చెందిన కరియన్న వ్యవసాయ కూలిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు శివకుమార్ గత రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. చిన్న కుమారుడు రంగస్వామి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. బెంగళూరులో కూలి పనులు చేసుకుంటూ..అప్పుడప్పుడు స్వగ్రామంకు వచ్చేవాడు. ఈ క్రమంలోనే గుడ్డదహళ్లికి వచ్చిన రంగస్వామి తన తండ్రితో డబ్బులు ఇవ్వాలని గొడవపడ్డాడు. ఈ క్రమంలో కొడవలితో తండ్రిపై దాడి చేశాడు. దీంతో ఒక్కసారిగా కరియన్న కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు అతన్ని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4, 5న బిజెపి బస్సు యాత్ర

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు, పథకాలు, కేంద్ర సంస్థలు తదితర వాటిని ప్రజలకు వివరించేందుకు ఈ నెల 4, 5 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో బస్సు యాత్ర చేపడుతున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ యాత్రను నాల్గో తేదీన బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పలాసలో ప్రారంభిస్తారని చెప్పారు. యాత్ర ప్రారంభానికి ముందు పలాసలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10, 16 తేదీల్లో గుంటూరు, విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోడీ, 18, 21న ఒంగోలు, రాజమండ్రిలో నిర్వహించే బహిరంగ సభల్లో అమిత్ షా పాల్గొంటారని తెలిపారు.

ఆలోచనలతో ఆదాయ వనరులు

- డిసిఎఫ్ వెంచర్స్ సిఇఒ లక్ష్మి పొట్లూరి

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

సమాజ సమస్యలను పరిష్కరించగలిగే ఆలోచనలే ఆదాయ వనరులుగా నిలుస్తాయని డిసిఎఫ్ వెంచర్స్ సిఇఒ లక్ష్మి పొట్లూరి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆంధ్రా యూనివర్సిటీ(ఎయు) వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఐఇటిఇ) విశాఖ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యాన మహిళా సాధికారత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన జీవనంలో నిత్యం ఎదురయ్యే సంఘటనలు విలువైన పాఠాలను, అనుభవాలను అందిస్తాయన్నారు. తన తల్లి చేసే పచ్చళ్ల వ్యాపారం దగ్గర్నుంచి గమనించి అనేక విషయాలను తెలుసుకుని, లాభాలు సాధించడం, నాణ్యతను నిలుపుకోవడం అక్కడే నేర్చుకున్నానని తెలిపారు. తాను 8వ తరగతిలో ఉన్న సమయంలో లెండింగ్ లైబ్రరీని నిర్వహించానని గుర్తు చేశారు. అదే తన తొలి ప్రయత్నమని తెలిపారు. 2011లో జబాంగ్‌ను స్థాపించిన సమయంలో రోజుకు కేవలం 20 అర్డర్లు వచ్చేవని, ఆరు నెలల్లో రోజుకు 6 వేల ఆర్డర్లు సాధించే దిశగా ప్రయాణించామని వివరించారు. ప్రస్తుతమున్న సాంకేతికత ఆనాడు అందుబాటులో లేనప్పటికీ చక్కని పనితీరుతో విజయం సాధ్యపడిందన్నారు. వినియోగదారుని ఆలోచనలు తెలుసుకోవడం, గౌరవించడం, విలువివ్వడం ఎంతో అవసరమన్నారు.


ప్రసంగిస్తున్న లక్ష్మి పొట్లూరి

ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పొట్లూరి లక్ష్మిని స్ఫూర్తిగా తీసుకుని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఉన్నత విద్యామండలి పూర్వ ఉపాధ్యక్షురాలు ఆచార్య వి.వల్లీకుమారి మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన యువ పారిశ్రామికవేత్తలు వర్సిటీని సందర్శించడం విద్యార్థులకు నూతన ఉత్తేజాన్ని అందిస్తుందన్నారు. ఐఇటిఇ విశాఖ కేంద్రం చైర్మన్ ఆచార్య డి.వి రామకోటి రెడ్డి, కార్యదర్శి ఆచార్య పి.రాజేష్‌కుమార్, పెద్దసంఖ్యలో విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

జీడి తోటల వేలానికి తీవ్ర పోటీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం జిల్లాలోని అటవీ శాఖకు చెందిన 29 జీడితోటల నుంచి ఈ ఏడాది ఫలసాయాన్ని పొందే హక్కుకుగానూ అధికారులు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. ఇందుకు రైతులు భారీగా పోటీపడ్డారు. ఉద్దానం ప్రాంతంలో తిత్లీ తుపాను ప్రభావంతో రైతుల జీడితోటలు పెద్దఎత్తున ధ్వంసమయ్యాయి. దీంతో, అటవీ శాఖ తోటలపై రైతుల్లో ఆసక్తి పెరగడంతో తీవ్ర పోటీ నెలకొంది. శ్రీకాకుళం ఫారెస్టు డివిజనల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ వేలం పాటలో 964 మంది పాల్గొన్నారు. ఈ వేలం పాటల ద్వారా వచ్చే ఆదాయంలో గ్రామ పంచాయతీలకు 60 శాతం వాటా చెల్లిస్తారు. మిగిలిన 40 శాతం ఆదాయాన్ని తోటల అభివృద్ధికి ఖర్చు చేస్తారు. రాత్రి వరకూ వేలం పాట కొనసాగుతోంది.

క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్‌గా మద్దిరాల మ్యాని

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి మద్దిరాల మ్యాని మరింత వన్నె తెస్తారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్‌గా మద్దిరాల మ్యాని శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గుంటూరులోని ఎసి కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి ఆనందబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రిస్టియన్ల అభ్యున్నతికి టిడిపి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా రూ.100 కోట్లు కేటాయించి ఖర్చు చేస్తామన్నారు. గుంటూరులో రూ.15 కోట్లతో క్రిస్టియన్ భవనాన్ని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

నౌహీరాకు బెయిల్ తిరస్కరణ

ప్రజాశక్తి-చిత్తూరు నగరం

అధిక వడ్డీలు ఆశ చూపి గొలుసుకట్టు పద్ధతిలో డిపాజిటర్ల వద్ద నుండి డబ్బులు వసూలు చేసి పారిపోయి పోలీసులకు పట్టుబడిన షేక్ నౌహీరాను శుక్రవారం స్థానిక జిల్లా కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. ఈ నేపథ్యంలో నౌహీరా పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను జడ్జి తిరస్కరించారు. ఈ నెల 15వ తేదీ వరకు ఆమెపై రిమాండును పొడిగించారు.

చిట్టీల మోసగాడు అరెస్టు

ప్రజాశక్తి - కరాస, విశాఖ

నమ్మకంగా ఉంటూ లక్షలాది రూపాయలు చిట్టీలు వేయించి ఆ తర్వాత డబ్బులకు ఎగనామం పెట్టిన మోసగాడిని విశాఖ ఎయిర్ పోర్టు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎయిర్ పోర్టు పరిధి బుచ్చిరాజుపాలెంలోని రెడ్డివీధిలో లక్ష్మీనరసింహ అపార్టుమెంటులో వై.ఉమాదేవి నివసిస్తున్నారు. తన సోదరి బేబీ రాణి ద్వారా రైల్వే న్యూకాలనీ ఆంధ్ర ప్యాలెస్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న చిట్టీల నిర్వాహకులు ఉండా జగదీష్, ఆయన భార్య నాగలక్ష్మి, కుమార్తె మువ్వల నీరజా, అల్లుడు మువ్వల శ్రీకాంత్‌తో పరిచయం ఏర్పడింది. వీరి అభ్యర్థన మేరకు 2013 నుంచి 3 లక్షల రూపాయల చిట్టీలను మూడింటిని ఉమాదేవి వారి వద్ద వేసింది. తర్వాత 20 లక్షల రూపాయల చిట్టీలను రెండింటిని వేసింది. దీనికి సంబంధించిన నెలవారీ డబ్బులు కట్టడం పూర్తయిన తర్వాత చిట్టీ డబ్బులు ఇవ్వకుండా ఉండ జగదీష్, అతని కుటుంబసభ్యులు తిప్పుతున్నారు. దీంతో ఆమె ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జగదీష్, అతని భార్య నాగలక్ష్మి, కుమారుడు తిలక్‌రాజు, కుమార్తె నీరజ, అల్లుడు శ్రీకాంత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు ఉండ జగదీష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మిగతా వారు పరారీలో ఉన్నారు.


తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ధాన్యం కొనుగోలు చేయడంలేదు

కేంద్ర బృందం దృష్టికి తెచ్చిన రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెథాయ్ తుపాను వల్ల వాటిల్లిన పట్ట నష్టం పరిశీలనపై కేంద్ర బృందం గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించింది. ఈ సందర్భంగా రైతులు తమ గోడును బృందం వద్ద వెళ్లబోసుకున్నారు. తుపాను వల్ల తీవ్ర నష్టం వచ్చిందని, రంగుమారిన ధాన్యం కొనడం లేదని రైతులు కుందేటి లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాసరావు, తాటిశెట్టి వెంకటలక్ష్మీ తదితర రైతులు బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. చుండూరు మండలం ఆలపాడులో పర్యటించిన కేంద్ర బృందం పర్యటించి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని పరిశీలించారు. గతేడాది డిసెంబర్‌లో పెథాయ్ తుపాను సంభవించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర హోం శాఖ జాయింట్ సెక్రటరీ సంజీవ్ కుమార్ జిందాల్ నేతృత్వంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు బి.కె.శ్రీవాస్తవ, కె.కె.సింగ్, మాణిక్‌చంద్ర పండిట్, ఆర్.బి.రాహుల్‌తో గల ఐదుగురు సభ్యుల బృందం గుంటూరు జిల్లాలోని తెనాలి, అమృతలూరు, చుండూరు, పొన్నూరు మండలాల్లో పర్యటించి పంట నష్టం తీరును పరిశీలించారు. తొలుత బృందం సభ్యులు తెనాలిలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రసెంటేషన్‌తోపాటు ఫొటో ప్రదర్శనను పరిశీలించారు. అమృతలూరు మండలం కోడితాడిపర్రులో పర్యటించి రైతులతో మాట్లాడారు. నష్టం వివరాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎయమ్‌డి.ఇంతియాజ్ అహ్మద్ కేంద్ర బృందానికి వివరించారు.

నాటకరంగ అభివృద్ధికి చర్యలు

ఎపి నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-సత్యనారాయణపురం

తెలుగు నాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎపి నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. యువనాటక రచయితలను ప్రోత్సహించి మంచి రచనలకు, రచయితలకు పారాతోషికం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అకాడమి ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా విజయవాడ మారుతీనగర్‌లోని అకాడమి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటకరంగ ప్రముఖుల జీవిత విశేషాలను సంగ్రహించి డిజిటలైజేషన్ చేయడం, పుస్తకరూపేణా అందించడానికి కృషి చేశామని చెప్పారు. నాటకరంగంపై ఆసక్తి గల యువతీయువకులకు శిక్షణ ఇవ్వడానికి మొదటి విడతగా శిక్షణ కేంద్రాలను నెలకొల్పినట్లు తెలిపారు. రాష్ట్రంలో 161 సమాజాలకు 220 ప్రదర్శనల వరకు అనుమతులిచ్చి ప్రదర్శించటం జరిగిందన్నారు. సమావేశంలో నాటక అకాడమి వైస్ ఛైర్మన్ కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శి బి.రామారావు, సినీనటులు సంజీవి పాల్గొన్నారు.

కొలంబియాకు తరలుతున్న అమెరికా సైనిక విమానాలు

ఉద్రిక్తతలకు ఆజ్యం



బొగోటా : వెనిజులాలో మదురో ప్రభుత్వాన్ని కూల దోసేందుకు కొలంబియాతో కలసి కుట్రలు పన్నుతున్న అమెరికా గురువారం పలు సైనిక విమానాలను బొగోటాకు పంపింది. వెనిజులాలో సైనిక జోక్యానికి సంబంధించి అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని ట్రంప్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. అమెరికా వైమానిక దళానికి చెందిన అరుదైన గ్లోబ్ మాస్టర్, సి17ఎ, బోయింగ్ 737 మిలిటరీ విమానాలు చక్కర్లు కొట్టి, బొగోటాలోని ఎయిర్ కమాండ్ మిలిటరీ ట్రాన్స్‌పోర్ట్ విమానాశ్రయంలో దిగాయి. అమెరికా మిలిటరీ విమానాలు ఈ విధమైన విన్యాసాలు నిర్వహించడం గత రెండు రోజుల్లో ఇది రెండవసారి అని కొలంబియా రేడియో తెలిపింది. డెల్వార్ వైమానిక కేంద్రం నుంచి బయల్దేరిన ఈ విమానాలు నాలుగు గంటల్లో బొగోటాకు చేరుకున్నట్లు కొలంబియా విదేశాంగ మంత్రి హెర్మన్ చెప్పారు. కొలంబియాలో ఇప్పటికే 5వేల మంది అమెరికన్ సైనికులు ఉన్నట్లు అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్‌ను ఉటంకిస్తూ కొలంబియా రేడియో తెలిపింది. వెనిజులాలో మదురోను అధ్యక్ష పదవి నుంచి తొలగించేందుకు ప్రతిపక్ష నేత గైడో ను తెరమీదకు తెచ్చిన ట్రంప్ ప్రభుత్వం, అది ఫలించక పోవడంతో సైనిక జోక్యానికి తెగబడాలని చూస్తోంది. ప్రతిపక్ష నేత గైడో తనకు తాను అధ్యక్షుడిగా ప్రకటించుకోవడంతో తలెత్తిన రాజకీయ సంక్షోభానికి పరిష్కారం కనుగొనేందుకు అంతర్జాతీయ మధ్యవర్తిత్వంలో చర్చలకు సిద్ధమేనని మదురో ప్రకటించిన తరువాత కూడా ట్రంప్ ప్రభుత్వం కుట్రలు కొనసాగిస్తూనే వుంది.

గైడో గుర్తింపునకు ఇటలీ నో!

రోమ్ : వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిగా తనను తాను ప్రకటించుకున్న జువాన్ గైడోను గుర్తించేందుకు ఇటలీ ప్రభుత్వం నిరాకరించింది. గైడోను గుర్తిస్తూ యూరోపియన్ పార్లమెంట్ తీసుకున్న నిర్ణయాన్ని ఇటలీ వ్యతిరేకించింది. ఇటలీ విదేశాంగశాఖ సహాయ మంత్రి మనిలో డి స్టెఫానో శుక్రవారం ఇక్కడ ఒక ప్రకటన చేస్తూ, ఒక సార్వభౌమత్వ దేశ అంతర్గత వ్యవహారాలను మరో దేశం లేదా కూటమి శాసించడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఐరాస ప్రకటించిన నాన్ ఇంటర్వెన్షన్ మార్గదర్శకాల పరమార్థం కూడా ఇదేనని ఆయన గుర్తు చేశారు. వెనిజులాలో యుద్ధం లాంటి పరిస్థితిని సృష్టించేందుకు కొన్ని దేశాలు చేస్తున్న ప్రయత్నాలపై ఇటలీ ప్రభుత్వం ఆందోళన చెందుతోందన్నారు. లిబియాలో చేసిన తప్పునే మళ్లీ ఇక్కడ కూడా చేస్తున్నారన్న విషయాన్ని ఇప్పుడు ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారని ఆయన చెప్పారు.

అమెరికా జోక్యానికి గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ఖండన

ఏథెన్స్ : దేశ ప్రయోజనాలను ఎలా పరిరక్షించుకోవాలి, నాయకత్వంలో ఎవరు ఉండాలి అనేది నిర్ణయించుకునే అధికారం వెనిజులా ప్రజలకే వదిలేయాలని గ్రీస్ కమ్యూనిస్టుపార్టీ (కెకెఇ) పేర్కొంది. వెనిజులా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునేందుకు అమెరికా, ఇయు, నాటో, లాటిన్ అమెరికాలోని కొన్ని ప్రభుత్వాలు బాహాటంగా జోక్యం చేసుకోవడం, తిరుగుబాటు ద్వారా తమ తొత్తును అధ్యక్షుడిగా ప్రతిష్టించేందుకు చేస్తున్న యత్నాలను, సామ్రాజ్యవాదులు వివిధ దేశాల్లో అనుసరిస్తున్న ప్రమాదకర పన్నాగాలను వెనిజులాలోను సాగించేందుకు అది సైనిక బెదిరింపులకు దిగడాన్ని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ విషయంలో జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్ తదితర దేశాలు తీసుకున్న వైఖరిని కెకెఇ ఆక్షేపించింది. వెనిజులాలో అమెరికా బాహాటంగా జోక్యం చేసుకోవడాన్ని గ్రీస్ ప్రభుత్వం సూటిగా ఖండించలేకపోయిందని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ విమర్శించింది. మదురోను తాము గుర్తించడం లేదని, వెనిజులా ప్రభుత్వాన్ని బెదిరిస్తూ ఇయు హుకుమ్‌లు జారీ చేస్తుంటే ఈ కూటమి సరైన విదేశాంగ విధానాన్ని రూపొందించుకోలేకపోయిందని గ్రీస్ ప్రభుత్వం పేర్కొనడంలో అర్థం లేదని పేర్కొంది. ప్రస్తుతం పెట్టుబడిదారీ దోపిడీని, సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వెనిజులా ప్రజలకు తాము పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నామని, వెనిజులా ప్రజలు దోపిడీ, సామ్రాజ్యవాద కుట్రలకు బలికాకుండా, శ్రామిక వర్గ హక్కుల కోసం పోరాడుతున్న వెనిజులా కమ్యూనిస్టు పార్టీని తాము గట్టిగా సమర్థిస్తున్నామని కెకెఇ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

రష్యాతో అణ్వస్త్ర నియంత్రణ ఒప్పందం రద్దు

నేడు వెల్లడించనున్న ట్రంప్



వాషింగ్టన్ : అంతర్జాతీయ ఒప్పందాలను, నియమావళికి తూట్లు పొడవడంలో పేరుమోసిన ట్రంప్ ప్రభుత్వం మరో మరో కీలకమైన ఒప్పందాన్ని రద్దు చేసేందుకు సిద్ధమైంది. మధ్యంతర శ్రేణి అణ్వస్త్ర నియంత్రణకు సంబంధించి రష్యాతో 1987లో కుదుర్చుకున్న ఒప్పందం నుంచి వైదొలిగే విషయమై శనివారం ఒక ప్రకటన చేయనుంది. అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మైక్ పాంపియో శుక్రవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ, రష్యా ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ఆరు మాసాల్లో ఐఎన్ఎఫ్ ఒప్పందం నుంచి ఉపసంహరించుకుంటామని, ఇందుకు సంబంధించి రష్యాకు లాంఛనంగా ఒక నోటీస్ జారీ చేస్తామని, దానికి మాస్కో కట్టుబడి ఉండకపోతే ఒప్పందాన్ని రద్దు అయినట్టేనని పాంపియో పేర్కొన్నారు. రష్యా ఈ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోందని, నిషేధిత అణు క్షిపణి వ్యవస్థల తయారీకి రహస్యంగా పూనుకుంటోందని, విదేశాల్లో వున్న తమ మిత్ర దేశాల బలగాలకు పెను ముప్పుగా పరిణమిస్తోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా ఆరోపణలను రష్యా ఖండించిన తరువాత కూడా ట్రంప్ అవే ఆరోపణలు పదే పదే చేస్తున్నప్పుడే ఇటువంటిదేదో జరగబోతోందని పరిశీలకులు భావించారు. 1987లో అప్పటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడు మిఖాయిల్ గొర్బచెవ్, అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ మధ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం భూ ఉపరి తలం నుంచి 5వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలిగే క్రూయిజ్ క్షిపణుల తయారీని నిషేధించారు. అమెరికా, రష్యా రెండు దేశాలు తమ వద్ద ఉన్న నూతన అణు క్షిపణి వ్యవస్థలనన్నిటినీ నాశనం చేయాలి. కానీ, అలా జరగలేదు. ఒప్పందం అతిక్రమణకు మీరు కారణమంటే మీరే కారణమని అమెరికా, రష్యాలు నిందించుకుంటున్నాయి. ట్రంప్ ప్రభుత్వం నాటోతో కలిసి అణ్వస్త్రాల తయారీకి మళ్లీ సిద్ధమైంది. దీనికి అడ్డంకిగా ఐఎన్ఎఫ్ ఒప్పందం వుండడంతో కుంటి సాకులు చూపి దానిని రద్దు చేయాలని చూస్తోంది.

కిమ్‌తో భేటీకి ముహూర్తం వచ్చే వారం ఖరారు

ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్‌తో జరుగనున్న మలి విడత భేటీ ఎప్పుడు, ఎక్కడ జరిగేది వచ్చే వారం తాను వెల్లడిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. గురువారం ఆయన వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ కిమ్‌తో రెండో విడత ముఖాముఖి చర్చలు జరిగే ప్రదేశం, తేదీ ఇప్పటికే నిర్ణయించామని, వాటిని వచ్చేవారం వెల్లడిస్తామని చెప్పారు.

పెమెక్స్ చీఫ్ రాజీనామా కోరిన మెక్సికో అధ్యక్షుడు అమ్లో



మెక్సికో : మెక్సికో ప్రభుత్వ ఆధ్వర్యంలోని చమురు కంపెనీ పెమెక్స్ సీనియర్ అధికారి మిగుయెల్ ఏంజెల్ లొజాడాపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరుగనున్నందున ఆ బాధ్యతల నుంచి ఆయన వెంటనే తప్పుకోవాలని దేశాధ్యక్షుడు మాన్యుయెల్ లోపెజ్ ఓబ్రడార్ (ఆమ్లో) ఆదేశించారు. పెమెక్స్ చీఫ్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు హెక్టార్ సాల్వడార్, లూయిస్ గల్వాన్ ఆర్కోస్‌లపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమ్లో చెప్పారు. గత అధ్యక్షుడు ఎన్రిక్ పెనా నీటో నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో వీరు ముగ్గురూ కోట్లాది డాలర్ల ప్రజా ధనాన్ని అక్రమంగా దారి మళ్లించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ మెక్సికన్ మీడియా ఇటీవల వార్తా కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు తెలిసినా, కనీసం అనుమానం వచ్చినా తాము ఏ మాత్రం సహించబోమని ఆమ్లో స్పష్టం చేశారు.

బ్రిటన్ నిష్క్రమణ మరింత జాప్యం!



లండన్ : యూరోపియన్ యూనియన్ నుంచి నిష్క్రమణ మరింత జాప్యం చేయాలని బ్రిటన్ చూస్తోంది. బ్రిటన్ విదేశాంగ మంత్రి జెరిమి హంట్ గురువారం నాడిక్కడ మాట్లాడుతూ, ఇయు నుంచి విడాకుల అమలుకు సంబంధించిన చట్టం ఆమోదానికి కొంత సమయం పడుతుందని అన్నారు. నిష్క్రమణ గడువు (మార్చి29) దగ్గర పడుతుండగా ఇయుతో కుదిరిన విడాకుల బిల్లుకు ఎంపీల మద్దతును కూడగట్టే పనిలోనే థెరిసా ప్రభుత్వం ఉన్నది. ఒప్పందాన్ని అమల్లోకి తెచ్చే చట్టాన్ని ఆమోదించినా, ఈ ఒప్పందంపై పార్లమెంటులోని ఉభయ సభల్లో చర్చ జరగాల్సి వుంటుంది. మార్చి 29కి ముందే డీల్‌కు సమ్మతి తెలిపినా, కీలకమైన చట్టాన్ని ఆమోదించేందుకు మరి కొంత అదనపు సమయం అవసరమవుతుందని హంట్ బిబిసి రేడియోకిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. దీనిపై చర్చల్లో సత్వర పురోగతి సాధిస్తే ఏ సమస్య వుండదు. అయితే వీటిలో ఏది సాధ్యమో, ఏది కాదో అప్పుడే చెప్పలేమని ఆయన అన్నారు. బ్రెగ్జిట్ చట్టంపై పార్లమెంటులో చర్చకు మరింత సమయం కేటాయించేందుకు వీలుగా ఫిబ్రవరిలో ఎంపీల సెలవులను రద్దు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని హంట్ చెప్పారు. బ్రెగ్జిట్ కు సిద్ధమయ్యేందుకు డీల్ ఒక్కటే కాదు, దీంతోబాటు వాణిజ్యం, వ్యవసాయం, వలసలకు సంబంధించిన మరో ఎనిమిది చట్టాలను పార్లమెంటు ఆమోదించాల్సి వుంది. హౌస్ ఆఫ్ కామన్స్ నాయకుడు ఆండ్రియా లీడ్‌సమ్ అంతకుముందు మాట్లాడుతూ, బ్రెగ్జిట్ డీల్, సంబంధిత చట్టాల ఆమోదానికి అవసరమైతే పార్లమెంటు రెండు మూడు వారాల పాటు అదనంగా పనిచేయాల్సి వుంటుందన్నారు. బ్రెగ్జిట్ జాప్యానికి సంబంధించిన ఎలాంటి ప్రతిపాదననైనా ఇయులోని 27 సభ్య దేశాలు ఆమోదం తెలపాల్సి వుంటుంది. బ్రెగ్జిట్ డీల్‌కు ఎంపీల మద్దతు పొందేందుకు వీలుగా బ్రస్సెల్స్‌లో ఇయు నాయకులతో చర్చించి తగు మార్పులు తీసుకొస్తానని బ్రిటన్ ప్రధాని థెరిసా మే హామీ ఇచ్చారు. ఆ వెంటనే ఇయు ఒక ప్రకటన చేస్తూ బ్రెగ్జిట్ డీల్‌ను తిరగదోడే ఎలాంటి యత్నాలను తాము అనుమతించేది లేదని హెచ్చరించింది. సీనియర్ ఇయు పార్లమెంటేరియన్ మాట్లాడుతూ, శాశ్వత కస్టమ్స్ యూనియన్ ఏర్పాటుతో సహా ఐరిష్ సరిహద్దు 'బ్యాక్ స్టాప్'కు సంబంధించిన ఏవైనా హామీలు కావాలనుకుంటే రాజకీయ డిక్లరేషన్‌లో కల్పించగలమని అన్నారు. రాజకీయ డిక్లరేషన్ బ్రెగ్జిట్ అనంతర సంబంధాలు ఎలా వుండాలనే దానికి ఉద్దేశించినది. ఈ డిక్లరేషన్‌కు ఎలాంటి చట్టబద్ధత ఉండదు.

చికాగోలో ఎముకలు కొరికే చలి

- రికార్డు స్థాయిలో శీతల గాలులు
- ఇలినాయిస్, మిచిగాన్, విస్కిన్‌సన్‌లలో ఎమర్జెన్సీ

చికాగో : అమెరికాలోని చికాగో నగరం చలితో వణికిపోతోంది. ఈ ప్రాంతంలోకి ఆర్కిటిక్ ప్రాంతం నుంచి విపరీతంగా చలిగాలులు వీస్తున్నాయి. ఈ శీతల గాలుల కారణంగా ఉష్ణోగ్రతలు భారీస్థాయిలో పడిపోయాయి. దీంతో అమెరికా మధ్య పశ్చిమ ప్రాంతం గడ్డకట్టుకుపోతోంది. ఈ నేపథ్యంలోనే మధ్య పశ్చిమ రాష్ట్రాలు ఎమర్జెన్సీని విధించాయి. మిచిగాన్, విస్కిన్‌సన్, ఇల్లినాయిస్ రాష్ట్రాలలో అత్యయిక పరిస్థితి కొనసాగుతోంది. బయటకు వెళ్లేవాళ్లు దీర్ఘమైన శ్వాస తీసుకోవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పోలార్ వర్టెక్స్ ప్రభావంతో ఉత్తర ధ్రువంలోని ఆర్కిటిక్ నుంచి వస్తున్న తీవ్ర చలిగాలులతో అమెరికా పశ్చిమ మధ్య (మిడ్ వెస్ట్) ప్రాంతం హిమఖండంలా మారింది. దీంతో లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. మొత్తానికి ఈ ప్రభావం కోట్లాది మందిపై చూపుతోంది. డకోటా నుంచి ఓహియో వరకు పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా చలి గజగజ వణికిస్తోంది. చికాగోతో పాటు పలు ప్రాంతాల్లో మైనస్ 27 డిగ్రీల సెల్సియస్, అంతకంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదయింది. శీతల గాలులు మరింత విస్తరించే అవకాశం ఉండటంతో పాఠశాలలు, కార్యాలయాలను, వాణిజ్య సముదాయాలను మూసివేశారు.

మొదటి పేజీ తరువాయి

కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ జయరామ్ హత్య

ఇంటి నుంచి విజయవాడ బయలుదేరబోతున్నట్లుగా సహచరులు, కుటుంబ సభ్యులకు చెప్పారు. అప్పటి నుండి ఎవ్వరికీ అందుబాటులో లేరని, గురువారం సాయంత్రం విజయవాడలోని కోస్టల్ బ్యాంకు మేనేజర్‌కి ఫోన్ చేసి తాను విజయవాడ వస్తున్నానని, బస ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై కారులో శవమై పడి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని డిఎస్‌పి చెప్పారు. సూర్యపేట జిల్లాలోని వివిధ టోల్‌గేట్ల వద్ద సిసిటివి ఫుటేజీలను పరిశీలిస్తున్నామన్నారు. జయరామ్ కారు డ్రైవరు సతీష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇవిఎంలపై అనుమానాలున్నాయి

రూ.17 రూపాయలు మాత్రమే ఇస్తారా? ఏమిటిది? అని ప్రశ్నించారు. ఇవిఎంలపై సందేహాలున్నాయని, ఈ మేరకు సోమవారం ఎన్నికల సంఘం అధికారులను కలిసి అభిప్రాయాలు చెబుతామని తెలిపారు. ఈవిఎంలకు సంబంధించిన డాక్యుమెంట్‌ను కూడా ఎన్నికల సంఘానికి అందజేస్తామన్నారు.

రాహుల్‌తో చంద్రబాబు ఏకాంత భేటీ

బిజెపియేతర పార్టీల సమావేశం అనంతరం నేరుగా రాహుల్ గాంధీతో కలిసి చంద్రబాబు ఆయన కారులోనే రాహుల్ నివాసానికి వెళ్లారు. అక్కడ వారిద్దరు ఏకాంతంగా భేటీ అయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియాతో మాట్లాడుతూ ఈవిఎంలపై ఎన్నికల సంఘానికి ఇచ్చే రిపోర్టుపై చర్చించామని అన్నారు. ఓటరకు తమ ఓటు ఎవరికి వేస్తున్నారో తెలియడం లేదని, ఈవిఎంలను మార్చవచ్చునని చాలా మంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, దీనిపై ఎన్నికల సంఘం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. నాలుగేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న బిజెపి ప్రభుత్వం చేయలేదని, వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. వ్యవసాయాభివృద్ధి 2.4 శాతానికి పడిపోయిందని, ఇలాఅయితే ఎన్నేళ్లైనా వ్యవసాయం సంక్షోభంలోనే ఉంటుందని పేర్కొన్నారు.

1900 ఎఎన్ఎమ్ పోస్టులకు నోటిఫికేషన్

చేసుకోవచ్చు. ఖాళీల ఎంపిక ఆయా జిల్లాల వైద్యఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఉంటుంది. అభ్యర్థులు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారికి ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. పోస్టుల భర్తీలో రిజర్వేషన్ పరిగణలోకి తీసుకుంటారు. వైద్యఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి వెయిటేజీ ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఏ ప్రాతిపదికన ఇస్తారనే పూర్తి వివరాలు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి వెయిటేజి ఇచ్చే అంశం పై స్పష్టం చేయలేదు. పూర్తి వివరాలు cfrv.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి.

దిగజారుడు రాజకీయాల్లో కొత్త ఒరవడి

మధ్యంతర బడ్జెట్‌పై జగన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగజారుడు రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టిస్తున్నాయని ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ అన్నారు. కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం ఇంతగా ప్రలోభాలకు దిగుతున్నారంటే...రాజకీయాలు ఎంతగా దిగజారాయనేది అర్థమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు నెలలకు ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్‌లో వాగ్దానాలు, వరాలు, పథకాలు పెడుతున్నారంటే... ప్రజల్ని మోసం చేయటంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలోని పెద్దలు పీహెచ్‌డీలు తీసుకున్నట్లుగా అర్థమవుతోందన్నారు. శుక్రవారం కేంద్ర బడ్జెట్, అసెంబ్లీలో ప్రత్యేక హోదాపై చర్చల నేపథ్యంలో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో అందు బాటులో ఉన్న ముఖ్య నేతలతో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చేతకానివాడు అయితే రాష్ట్ర ప్రయోజనాలు ఎలా దెబ్బతింటాయనే దానికి చంద్రబాబు పెద్ద ఉదాహరణ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా ఇవ్వనిది ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో ఇస్తుందని ఎలా అనుకుంటారని నిలదీశారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన పార్టీలన్నింటికీ గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

రైతులను అవమానించారు

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

మోడీ తన చివరి బడ్జెట్‌లో ఐదు ఎకరాల్లోపు రైతులకు ఏటా రూ.6000 సబ్సిడీగా ఇస్తానని ప్రకటిం చటం రైతాంగాన్ని అవమానించేలా ఉందని, ఇలాంటి తాయిలాలు రైతాంగాన్ని కాపాడలేవని ఎపి రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.కేశవరావు, పి.పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగేళ్లలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు లేక తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. రైతాంగాన్ని పూర్తిగా రుణవిముక్తులు చేసిన కేరళ నమూ నాలో శాశ్వత రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పరచాలని, ఎకరాకు పదివేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు.

కౌలు రైతుల ప్రస్తావనే లేని కేంద్ర బడ్జెట్ -ఎపి కౌలు రైతుల సంఘం

ఐదు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేదని, మోడీ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కౌలు రైతుల ప్రస్తావనే లేదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ రంగారావు, పి.జమలయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారస్సుల ప్రకారం పంటలకు మద్దతు ధరలు ఇవ్వలేదని, కౌలు రౌతులను అసలు పట్టించుకోలేదని, రుణ విమోచన చట్టం తీసుకురావాలని రైతులు ఉద్యమాలు చేస్తే బడ్జెట్ దాని ఊసే లేదని తెలిపారు. గతంలో కంటే రైతుల ఆత్మహత్యలు 26 శాతం పెరిగాయని, జిఎస్‌టి వల్ల ఇన్‌పుట్స్ ధరలూ పెరిగాయని తెలిపారు.

వ్యవసాయ కార్మికులకు మొండిచేయి : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

మోడీ ప్రవేశపెట్టిన 2019-20 బడ్జెట్ వ్యవసాయ కార్మికులకు మొండిచేయి చూపించిందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వరులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

22 కోట్ల మంది వ్యవసాయ కార్మికులను పూర్తిగా విస్మరించిందని, 12 కోట్ల మందికి ఉపయోగపడే గ్రామీణ ఉపాధి హామి చట్టానికి తగినన్ని నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్ ఆహ్వానించదగిందే : వడ్డే శోభనాద్రీశ్వర రావు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని కిసాన్ సమ్మాన్ పథకం కింద 12 వేల కోట్ల వ్యవసాయ కమతాలకు సాలుకు రూ.6000 చొప్పున రూ.75 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్టు ప్రకటించడం ఆహ్వానించదగ్గ విషయమని మాజీ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానమైన వరి,గోధుమ ప్రత్తి పంటలకు మన దేశంలో మద్దతు ధరలు డబ్ల్యూటివో విధించిన నిబంధనలను అతిక్రమించి ఉంటున్నాయని అమెరికా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పేర్కొన్నారు.

మోడీ ప్రలోభాల బడ్జెట్ : సిఐటియు

మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాలతో సాగిందని, కార్మికులకు, రైతాంగానికి, తీవ్ర నిరాశ మిగిల్చిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, ఎంఎ గఫూర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు మూడు వేల రూపాయల పెన్షన్ అంటూ భారాన్ని కార్మికుల పైనే మోపిందని తెలిపారు. తమది అవినీతి రహిత ప్రభుత్వమని, స్వచ్ఛ భారత్ అంటూ గొప్పలకుపోయిందని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ద.మ.రైల్వేకు రూ.5,924కోట్లు కేటాయింపు

- నడికుడి-శ్రీకాళహస్తి కొత్త లైన్‌కు రూ.700కోట్లు
- కడప - బెంగుళూరు లైన్‌కు రూ.210కోట్లు
- ఖాజీపేట - విజయవాడ మూడో లైన్‌కు రూ.110 కోట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2019-20 సంవత్సర కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు రూ.5,924కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్ కంటే ఇది రూ.172కోట్లు అధికం. ఈ బడ్జెట్‌లో బడ్లింగ్ ప్రాజెక్టులు, కొత్త లైన్లకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులను ద.మ.రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ జాన్ థామస్ శుక్రవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో మీడియాకు వెల్లడించారు. డబ్లింగ్ పనులకు రూ.1905కోట్లు, కొత్త లైన్లకు రూ.834కోట్లు, ప్రయాణికుల సౌకర్యాలకు రూ.229 కోట్లు, రైల్వే బ్రిడ్జిలకు రూ.397కోట్లు కేటాయించారు.

ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు...

- నడికుడి - శ్రీకాళహసి (కొత్తలైను) రూ.700కోట్లు
- కడప - బెంటుళూరు (కొత్తలైను) రూ.210 కోట్లు
- ఓబులవారిపల్లె - కృష్ణపట్నం (కొత్తలైను) రూ.30కోట్లు
- కోటిపల్లి-నర్సాపూర్ (కొత్తలైను) రూ.200కోట్లు
- మనోహరాబాద్-కొత్తపల్లి (కొత్తలైను) రూ.200కోట్లు
- మునీరాబాద్-మహబూబ్‌నగర్ (కొత్తలైను) రూ.275కోట్లు
- భద్రాచలం - సత్తుపల్లి (కొత్తలైను) రూ.405కోట్లు
- గుంతకల్లు - కల్లూరు (డబ్లింగ్) రూ.15కోట్లు
- గుంటూరు - గుంతకల్లు (డబ్లింగ్) రూ.280కోట్లు
- విజయవాడ-భీమవరం-నిడదవోలు (డబ్లింగ్) రూ.175కోట్లు
- గుంటూరు - తెనాలి (డబ్లింగ్) రూ.5కోట్లు
- గూటి-ధర్మవరం (డబ్లింగ్) రూ.126కోట్లు
- ఖాజీపేట - విజయవాడ మూడోలైను రూ.110కోట్లు
- విజయవాడ-గూడూరు మూడోలైను రూ.350కోట్లు
- ఖాజీపేట - బల్లార్ష మూడోలైను రూ. 265కోట్లు
- ఘట్‌కేసర్ - యాదాద్రి లైనుకు రూ.20కోట్లు
- విజయబాడ,ఖాజీపేట,రేణిగుంట,వాడి స్టేషన్లకు బైపాస్ లైన్ల నిర్మాణానికి రూ.143కోట్లు
- కర్నూల్‌లో మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రూ.80కోట్లు
- తిరుపతి రైల్వే స్టేషన్ రెండో ప్రవేశద్వారం అభివృద్ధికి రూ.12.45కోట్లు
- తిరుచానూరు స్టేషన్ అభివృద్ధికి రూ.6కోట్లు నిధులు కేటాయించారు.

ఎన్నికల బడ్జెట్ : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బడ్జెట్ తెలుగువారిని పూర్తిగా నిరాశపర్చిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు గురించి కానీ, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజక్టుకు సవరించిన అంచనాల ప్రకారం నిధుల కేటాయింపు గురించి లేకపోవడం బాధకరమన్నారు. ఇది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లా లేదని, అకౌంట్ ఫర్ ఓట్స్‌గా ఉందని తెలిపారు. బడ్జెట్‌లో మధ్యతరగతి వర్గాలకు, ఉద్యోగులకు పెద్ద ఊరట కల్పించినట్లు చెప్పడం మోడీ ఎన్నికల జిమ్మిక్‌గా పేర్కొన్నారు. రైతులకు రూ.75వేల కోట్లు కేటాయించడం, ఐదు ఎకరాలలోపు వారికి రూ. ఆరువేల సాయం మూడు విడతలుగా అందిస్తామనడం కూడా కంటి తుడుపు చర్యలేనని తెలిపారు.

పంటకు మద్దతు ధర ఇవ్వాలి

ధర్నాలో ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని అఖిల భారత కిసాన్ సభ(ఎఐకెఎస్) జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సమస్యలపై దృష్టి సారించలేదని అన్నారు. కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిన రైతుబంధు వంటి పథకాలు శాశ్వత పరిష్కారం కాదని అన్నారు. ఇటువంటి నిర్ణయాలు కేవలం ఉపశమనం మాత్రమే ఇస్తాయన్నారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తే వ్యవసాయం రంగం సంక్షోభం నుండి బయట పడుతుందన్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు పలు ప్రజా, సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వ్యవసాయ రంగంపై కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ జంతర్ మంతర్ వద్ద ఎఐకెఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే మాట్లాడుతూ ప్రజా కంటక విధానాలు అవలంబిస్తున్న మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు.

జనసేన వీర మహిళ ఛైర్మన్‌గా రేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్టీ కోసం పని చేసి, మద్దతుగా నిలిచిన మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలని నిర్ణయించామని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తెలిపారు. హైదరాబాదులో జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం వీర మహిళ, ఇతర కమిటీల తొలిజాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కుబడిగా కమిటీలను నింపడం కాదని, ప్రతి విభాగంలో వారు ప్రభావశీలంగా పని చేసేలా వీరిని ఎంపక చేసి నియమించినట్లు తెలిపారు. మధ్య తరగతి, చదువుకున్న మహిళలకు, మేధావులైన ఆడపచుచులకి తనగి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. వీర మహిళ ఛైర్మన్‌గా రేఖ జవ్వాజి, వైస్ ఛైర్మన్‌లుగా కవిత సిందూరి, షేక్ జరీనా, ఎన్.ప్రియాసౌజన్య, జి.శ్రీవాణిలను నియమించారు.

ఎన్నికల మ్యానిపెస్టోలా ఉంది : సుజనా చౌదరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టోలా ఉందని మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి అన్నారు.

ఎన్నికలను దృష్టి పెట్టుకొని తాయిలాలు ప్రకటించారే తప్ప, అమలులో ఉండదని ఎంపి తోట నరసింహం అన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఆర్థిక వ్యవస్థకు చేసిన గాయాలను కనబడకుండా కప్పేందుకు కట్టిన బ్యాండేజ్‌లా బడ్జెట్ ఉందని ఎంపి గల్లా జయదేవ్ ఎద్దేవా చేశారు.

నిరాశ పరిచింది: విజయసాయి రెడ్డి, వైసిపి

కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై వైసిపి పార్లమెంటరీ నేత విజయసాయి రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులు లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు.

ఇది ఎన్నికల స్టంటే: సుబ్బిరామి రెడ్డి, కాంగ్రెస్

కేంద్ర బడ్జెట్ ఎన్నికల స్టంటేనని కాంగ్రెస్ ఎంపి సుబ్బిరామి రెడ్డి విమర్శించారు. ప్రజలను ఆకర్షించేందుకు మాత్రమే పథకాలు పెట్టారని, రాబోయే ఎన్నికలకు ప్లాన్ చేసి బడ్జెట్‌ను పెట్టారని అన్నారు. గత బడ్జెట్‌లో ఈ పథకాలు ఎందుకు ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు. రైతుల పంట సహాయం అమలు అసంభవమని అన్నారు.

సినిమాలే నా రాజకీయం



- మమ్ముట్టి

" నేనే 350పైగా చిత్రాల్లో నటించా. దాదాపు 70 మంది నూతన దర్శకులతో పని చేశాను. మహి అప్పటికే 2 సినిమాలు చేసి ఉన్నాడు. కొత్త డైరెక్టర్ అనగానే వీళ్లేదో కొత్తగా చెప్పడానికి ట్రై చేస్తారనే అనిపిస్తుంది. కంప్లీట్ స్క్రిప్ట్, స్ట్రాంగ్ ప్రొడ్యూసర్, లెజెండ్రీ క్యారెక్టర్... ఒక సినిమా ఓకె చెప్పడానికి ఉండాల్సిన ఎలిమెంట్స్. అన్నీ ఉన్నాయనిపించింది కాబట్టే ఈ సినిమా చేశా. పాదయాత్ర అంటే జస్ట్ వాకింగ్ కాదు. జనాల్ని కలవడం, వారి గురించి తెలుసుకోవడం. ఆ ప్రయాణంలో వై.ఎస్.అనుభవాలు, భావోద్వేగ దశ ఈ 'యాత్ర'లో చూస్తారు. మనిషి ఎక్కడుంటే సమస్యలు అక్కడుంటాయనేందుకు ఈ యాత్ర సినిమా నాకు బాగా ఉపయోగపడింది. అలా అని రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన కలగలేదు" అని 'యాత్ర' సినిమా అనుభవాలను వై.ఎస్. పాత్రధారి మమ్ముట్టి తెలిపారు.

తెలుగులో సినిమా చేయడానికి నిజంగానే చాలా టైమ్ పట్టింది. నచ్చిన స్క్రిప్ట్ దొరకపోవడమే దానికి కారణం. స్క్రిప్ట్ బావుంటే ఎప్పుడైనా సినిమా చేయడానికి రెడీ. ముందు కథ, దర్శక నిర్మాతలు, ఆ తర్వాత పారితోషికం గురించి ఆలోచిస్తా. 'స్వాతి కిరణం'లో ఎలా ఉన్నానో ఇప్పుడు అలాగే ఉన్నానని అంటున్నారు. అందుకు కారణం ఏంటో నాకు తెలియదు. అయితే నేను ఎప్పుడూ మంచి గురించే ఆలోచిస్తాను. నేను ఈ క్యారెక్టర్‌ని ప్లే చేయడానికి పెద్దగా ఏమీ కష్టపడలేదు. మహి సినిమాకి కావాల్సినంత రీసర్చ్ చేసి, స్క్రిప్ట్ రెడీ చేసుకున్నాడు. నేను మహి రాసుకున్నది, చెప్పిందే చేశాను. ఇక 40 ఏళ్లుగా సినిమాల్లో ఉన్నాను. రాజకీయాల్లోకి వెళ్లాలనే ఆలోచన లేదు. కానీ సినిమాలే నా ప్రపంచం, అవే నా రాజకీయం

తెలుగు సినిమాలు చూస్తా. రీసెంట్‌గా రామ్ చరణ్ 'రంగస్థలం', మహేష్ బాబు 'భరత్ అనే నేను' చూశాను. యూట్యూబ్‌లో తెలుగు వీడియోస్ కూడా చూస్తుంటాను. నేను చేసే ప్రతి రోల్ నా డ్రీమ్ రోలే. నాకు తెలిసి ఏ యాక్టర్ అయినా తను కంఫర్ట్‌గా ఫీలయ్యే క్యారెక్టర్‌ని చేసుకుంటూ వెళ్లిపోతాడు. కంఫర్ట్‌గా ఫీలయ్యేవే డ్రీమ్ రోల్స్ అనే నా ఫీలింగ్.

తెలుగు, తమిళ, మలయాళ ఇండస్ట్రీస్‌లో పెద్దగా తేడా ఏం లేదు. ఎక్కడైనా మంచి సినిమాలు ఆడుతున్నాయి. ఆడియెన్స్ కూడా కొత్తగా ఆలోచిస్తున్నారు. ప్రతి ఆర్టిస్టూ పాత్రల ఎంపికలో సెలక్టివ్‌గానే ఉంటున్నారు. నేను ఒకప్పుడు కె.విశ్వనాథ్‌గారి సినిమాలో నటించాను. ఓ రకంగా చెప్పాలంటే అందులో గ్రేషేడ్ ఉన్న పాత్రలో నటించాను. తర్వాత కోడి రామకృష్ణగారి దర్శకత్వంలో 'రైల్వే కూలి' సినిమా చేయాల్సింది. కానీ కుదరలేదు. ఇప్పుడు చేశాను. అయితే ఏదీ ప్లాన్ చేయలేదు. ఈ మధ్యలో ప్రతి సినిమా పరిశ్రమలోనూ చాలా మార్పులే వచ్చాయి. తెలుగు సినిమా గురించి చెప్పాలంటే వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తుంది. మంచి పరిణామమే. నాకు టాలీవుడ్‌లో కూడా మంచి స్నేహితులు ఉన్నారు. గతంలో సినిమాలన్నీ చెన్నైలోనే జరిగేవి కాబట్టి, అప్పుడు కలుస్తూనే ఉండేవాళ్లం. ఇప్పటికీ ఆ పరిచయాలు ఉన్నాయి. ఇప్పటి వరకు నేను అంబేద్కర్, బషీర్ అనే వారి బయోపిక్స్‌లో మాత్రమే నటించాను. కానీ వై.ఎస్. బయోపిక్ అనేది ఓ సంఘటన ఆధారంగా చేసిందే. దాన్ని కూడా బయోపిక్ అనవచ్చు. తెలుగు, మలయాళంలో చాలా పదాలు ఒకేలా ఉంటాయి. కొన్ని చోట్ల కొన్ని పదాలను ఒత్తి పలకాల్సి ఉంటాయి. వాటి విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకుంటూ డబ్బింగ్ చెప్పాను.

'మణికర్ణిక'కు నష్టం కలిగించాలనే

క్రిష్ వ్యాఖ్యలపై నిర్మాత కమల్ జైన్ ఆగ్రహం




కంగనా, కమల్ జైన్

'మణికర్ణిక' సినిమా 70 శాతం షూటింగ్ తనే చేశానని ఇటీవల కంగన అన్న వ్యాఖ్యలపై క్రిష్ స్పందించిన సంగతి తెలిసిందే. ఆమె చెబుతోంది అబద్ధమని, సినిమా ఎడిటింగ్ సమయంలో చాలా మూర్ఖంగా ప్రవర్తించారని.. మిగిలిన నటీనటుల పాత్రల్ని కట్ చేశారని ఇటీవల క్రిష్ అన్నారు. దీనిపై కొన్ని రోజులుగా పెద్ద చర్చే నడుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా కమల్ జైన్ మాట్లాడుతూ.. "క్రిష్ చేయని పనికి కూడా క్రెడిట్ అడగడం చాలా బాధాకరం. స్టూడియో, నేను కలిసి క్రెడిట్ ఎవరికి ఇవ్వాలనే విషయాన్ని నిర్ణయించాం. సినిమా మొదటి నుంచి తుది వరకూ కష్టపడ్డ కంగనాను అందరూ ఎటాక్ చేయడం బాధిస్తోంది. కంగనా ఏ నిర్ణయం తీసుకున్నా ప్రొడక్షన్ బృందాన్ని సంప్రదించే తీసుకున్నారు. సినిమా ప్రశంసలు అందుకుని, బాక్సాఫీసు వద్ద విజయం సాధించిన తర్వాత క్రిష్ మీడియా ముందుకొచ్చారు. మా సినిమాకు నష్టం కలిగించడానికి ఆయన ఇలా చేస్తున్నారు. ఆయన మాట్లాడేది నిజమైతే, ఆధారాలు ఉంటే ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకుని నిరూపించుకోకూడదు. క్రిష్‌కు చెప్పకుండా మేం ఏమీ చేయలేదు. అలాంటిది ఇప్పుడు ఆయన ఈ విషయాన్ని రచ్చ చేయడం బాధాకరం" అని పేర్కొన్నారు.

ప్యాచ్‌వర్క్‌కి క్రిష్ రాలేదు : మిస్తీ చక్రవర్తి

'మణికర్ణిక' చిత్రంలో కాశీ బాయిగా నటించిన మిస్తీ చక్రవర్తి స్పందించింది.'ఈ సినిమా విడుదలైన రెండు వారాల తర్వాత క్రిష్ మాట్లాడుతున్నారు. నాకు, 90శాతం మందికి నిజమేమిటో తెలుసు. ఈ సినిమాను క్రిష్ పూర్తి చేశారు. ఈ సినిమా పూర్తయ్యేవరకూ నేను అక్కడే ఉన్నాను. కాబట్టి ఎవరు పూర్తిగా షూట్ చేశారో? ఎవరు చేయలేదో నాకు తెలుసు. సినిమా షూటింగ్ అంతా పూర్తయ్యాక క్రిష్ గారు కంగనా, నిర్మాతలతో మాట్లాడుతూ 'ఎన్టీఆర్' బయోపిక్ షూటింగ్‌కు వెళ్లాల్సి ఉందని చెప్పారు. కానీ 'మణికర్ణిక' ప్యాచ్‌వర్క్‌కి రావడానికి ఆయన ఇష్టపడలేదు. ఆ పరిస్థితుల్లో ఏ క్యారెక్టర్ ఏం చేస్తుందో తెలియదు. ఆయనేమో రానంటున్నారు" అని చెప్పింది.



'మణికర్ణిక'లో మిస్తీ చక్రవర్తి

మార్చిలో ఆర్య, సయేసా వివాహం



దిలీప్‌కుమార్ మనవరాలు, నటి సయేసా సైగల్‌కు, తమిళ నటుడు ఆర్యకు త్వరలో వివాహం జరగనుందని సమాచారం. వచ్చేనెలలో వీరి పెళ్లి ఉండనుంది. ఇస్లాం సంప్రదాయం ప్రకారం మార్చి తొమ్మిదో తేదీన హైదరాబాద్‌లో వివాహం చేసుకోనున్నారు. వివాహం అనంతరం రిసెప్షన్ ఉండనుంది. సయేషా తెలుగులో 'అఖిల్' చిత్రంలో నటించింది. బాలీవుడ్‌లో అజయ్ దేవగన్ సరసన 'శివాయ్'లో కథానాయికగా చేసింది. గత ఏడాది తమిళంలో ఆర్యతో కలసి 'ఘజినికాంత్'లో హీరోయిన్‌గా చేసింది. ఆర్య తమిళంలో ప్రముఖ నటుడు.

నీతి, నిహార్ పెళ్లి

బాలీవుడ్‌లో సెలబ్రిటీల ప్రేమ పెళ్లిళ్లకు కొదవ లేదు. గత ఏడాదంతా వారి వివాహాలతోనే సందడి నెలకొంది. ఈ ఏడాదీ అదే పరిస్థితి కనిపిస్తుంది. త్వరలో ఆలియా భట్, రణబీర్ కపూర్ వివాహం చేసుకోబోతున్నారు. దీనిలో భాగంగా ఆలియా రూ.13కోట్లు పెట్టి ప్రత్యేకంగా ఇల్లును కూడా కొన్నది. తాజాగా గాయిని, బాలీవుడ్ సెలబ్రిటీ పెళ్లికి సిద్ధమయ్యారు. గాయని నీతి మోహన్, బాలీవుడ్ నటుడు నిహార్ పాండే వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. ప్రేమికుల రోజున వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారు. ది కపిల్ శర్మ షోలో పాల్గొన్న వీరిద్దరూ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. నిహార్‌ని ప్రత్యక్షంగా చూడకుండానే ప్రేమించాను. నిహార్ మాట్లాడుతూ 'అసామా(ఇండియన్ పాప్ గ్రూప్)లో ఒకరు మా స్నేహితుడు ఉండేవాడు. అసామా ద్వారానే ఆమె కెరీర్ ప్రారంభం అయింది. ఆమెను నాకు పరిచయం చేయమని చాలాసార్లు అతన్ని అడిగాను. కానీ ఎప్పుడూ పరిచయం చేయలేదు. ఏడాది క్రితం గోవాలో మా స్నేహితుడు వివాహంలో అనుకోకుండా ఆమెను కలిశాను. అప్పటి నుంచి మా ప్రేమ మొదలైంది" అని అన్నారు. నిహార్ గతంలో దీపికా పదుకొనేతో ప్రేమాయణం నడిపారు.



కొటేషన్ నుంచే ఆ కథ పుట్టింది



ఉదయ్ కుమార్, రఘురాజ్

"4 లెటర్స్' మూవీ ఇంజినీరింగ్ విద్యార్థులని దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా. అందుకే వారికే అంకితం ఇస్తున్నాం. కథ ఎలా పుట్టిందంటే.. ఎయిర్‌పోర్టు నుంచి క్యాబ్‌లో వెళుతుండగా.. 'సైన్స్ ఈజ్ అబౌట్ నోయింగ్. ఇంజనీర్స్ ఈజ్ అబౌట్ డూయింగ్. బట్ ఆల్ ఇంజనీర్స్ ఆర్ డయింగ్..' అనే కొటేషన్ ఓ చోట కనిపించింది. అర్థమేమిటని డ్రైవర్‌ను అడిగాను. మేమంతా ఇంజనీర్ అయి ఉద్యోగాలు లేక డ్రైవర్లగా చేస్తున్నాం. ఇంజనీర్ అంటే విలువలేదన్నాడు. దాంతో ఆయన్నుంచి మరిన్ని వివరాలు తీసుకున్నా. అప్పుడే దీనిపై సినిమా చేయాలనిపించింది" అంటూ చిత్ర నిర్మాత ఉదయకుమార్ తెలిపారు. దర్శకుడు ఆర్.రఘురాజ్ కూడా ఇంజనీర్ చదివాడు. అందుకే కథను అద్భుతంగా తెరకెక్కించాడు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడారు.

'లవ్ ఎట్ ఫస్ట్‌సైట్' అంటారు కానీ అవన్నీ బ్రేకప్ అవుతున్నాయి. అందుకే 'లవ్ ఎట్ సెకండ్ లుక్' అనే కొత్త కాన్సెప్ట్‌తో మీ ముందుకు వస్తున్నాం. ఈ సినిమా యూత్‌కే కాదు పెద్దవాళ్లకూ నచ్చుతుంది. ఎవరూ చేయని సాహసం చేశాం, అది మీరు థియేటర్‌లో చూసినప్పుడు మీకు అర్థమవుతుంది. 'రఘువరన్ బీటెక్' చిత్రం కూడా ఇంజనీర్లపైనే కానీ అది చదువుపూర్తయ్యాక పడే వేదనలోంచి కథ పుట్టింది. కానీ మా సినిమా చదువుతుండగానే ఎటువంటి పరిస్థితులు కుర్రాళ్లకు కలిగాయనే కోణంలో చెప్పాం. థాయిలాండ్‌లోని ప్రత్యేకమైన ప్రదేశాల్లో పాటలు చేశాం. ప్రీ-ప్రొడక్షన్, పోస్ట్-ప్రొడక్షన్‌తో కలిపి మొత్తం 75 రోజుల్లో ఫస్ట్ కాపీ రెడీ చేశాం. సినిమాలో హీరో ఈశ్వర్, హీరోయిన్లు తువా చక్రవర్తి, అంకిత మహారాణాలకు మొదటి సినిమా అయినా చాలా చక్కగా నటించారు. ముందు రెండు నెలలు వర్క్ షాప్ పెట్టడం వలన ఇంత త్వరగా పూర్తి చేయగలిగాం. మార్కెట్‌లోకి వచ్చిన పాటలు ఆదరణ పొందుతున్నాయి. భీమ్స్ సిసిరోలియో ఇచ్చిన బాణీలే అందుకు కారణం" అని వారు చెప్పారు.

ఒకటే లైఫ్



జితన్, శృతి యుగల్

సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా రూపొందుతోన్న సినిమా 'ఒకటే లైఫ్'. లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మిస్తున్నారు. 'హ్యాండిల్ విత్ కేర్' అనేది ఉప శీర్షిక. ఎం.వెంకట్ దర్శకుడు. శృతి యుగల్ కథానాయిక. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుంది. దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ 'టెక్నాలజీ పేరుతో పరుగులెడుతోన్న నేటి తరం మానవ సంబంధాలకు, భావోద్వేగాలను ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రమిది. అమ్రీష్ అందించిన పాటలకు ఆదరణ బాగుంది. రీరికార్డింగ్ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. సెన్సార్ ప్రశంసలు దక్కాయి. అని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా అలరిస్తుంద'ని అన్నారు. నిర్మాత నారాయణ్ రామ్ మాట్లాడుతూ 'దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించిన విధానం హైలైట్‌గా నిలుస్తుంది. హరీష్ రావు మా ట్రైలర్‌ను విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్ పాటలు చాలా బాగావచ్చాయి. ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా రావటంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి' అని అన్నారు.

'కొత్తగా మా ప్రయాణం' బాగా నచ్చింది

నూతన కథానాయకుడు ప్రియాంత్ హీరోగా యామిని భాస్కర్ హీరోయిన్‌గా చేసిన చిత్రం ' కొత్తగా మా ప్రయాణం'. 'ఈ వర్షం సాక్షిగా' ఫేమ్ రమణ మొగిలి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జనవరి25న విడుదలైంది. హీరో ప్రియాంత్ మాట్లాడుతూ 'కేవలం 30 థియేటర్లలో మాత్రమే రిలీజ్ చెయ్యగలిగాం. అయినా రెండో వారం కూడా ఇంత సక్సెస్‌గా నడుస్తుందంటే చాలా ఆనందంగా ఉంది. ఈ రోజు నుంచి 55 థియేటర్ల వరకు పెంచుతున్నాం. ప్రేక్షకులకు ఈ చిత్రం చాలా బాగా నచ్చింది. కథ కథనం బాగా వచ్చాయి. ఇంకా ఈ చిత్రం చాలా మందికి రీచ్ కావాలని కోరుకుంటున్నాన'ని అన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ ' మన సంస్కృతి ప్రకారం ఆడ, మగ కలిసి బతకాలంటే పెళ్లి చేసుకుని ఉండాలి. లేదంటే ఈ సమాజంలో ఎదురయ్యే సమస్యల గురించి ఈ చిత్రంలో ఆవిష్కరించాం, చిన్న సినిమా అయినా ఇంత పెద్ద సక్సెస్ సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది' అని తెలిపారు.



మహానగరంలో అమ్మాయిలు



త్రిధా చౌదరి, ధన్య బాలకృష్ణ, సిద్ధి ఇద్నాని, కోమలి

బ్లాక్ అండ్ వైట్ పిక్చర్స్ పతాకంపై బాలు దర్శకత్వంలో హిమబిందు వెలగపూడి 'నలుగురు అమ్మాయిల కథ' నిర్మిస్తున్నారు. త్రిధా చౌదరి, ధన్య బాలకృష్ణ, సిద్ధి ఇద్నాని, కోమలి ప్రసాద్ ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ ఇటీవల పూర్తయింది. ఫిబ్రవరి రెండో వారంలో కీలక సన్నివేశాలు, పాటలు, పోరాట దృశ్యాల చిత్రీకరణకు చిత్రబృందం గోవా వెళ్లనుంది. ఈ సందర్భంగా దర్శకుడు బాలు మాట్లాడుతూ "మహానగరంలో నివసించే నలుగురు అమ్మాయిల కథే ఈ సినిమా. స్వతంత్ర్య భావాలున్న నలుగురి జీవితాల్లో ఏం జరిగిందనేది ఆసక్తికరం. జనవరిలో హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేశాం. ఈ నెల రెండో వారంలో గోవాలో మొదలు కానున్న సెకండ్ షెడ్యూల్‌లో రెండు పాటలు, కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నాం. నెలాఖరుకు గోవా షెడ్యూల్ పూర్తవుతుంది. మార్చిలో హైదరాబాదులో మూడో షెడ్యూల్ ప్లాన్ చేశాం. మే నెలలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం. వినోదాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కథానుగుణంగా వచ్చే మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రఘుకుంచె, సినిమాటోగ్రఫీ: శేఖర్ గంగమోని, సహ నిర్మాతలు : రాధికా శ్రీనివాస్ వెత్సా, ఉమా కూచిపూడి, నిర్మాత: హిమ బిందు వెలగపూడి, రచన, దర్శకత్వం: బాలు.

హాలీవుడ్‌కు రాహుల్ రామకృష్ణ




'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం', 'హుషారు' వంటి చిత్రాల్లో తన హాస్యంతో ప్రేక్షకులను మెప్పించిన నటుడు రాహుల్ రామకృష్ణ. త్వరలో 'మిఠాయి' చిత్రంలో కనిపించనున్నారు. తెలుగులో బిజీగా ఉన్న ఈ కమెడియన్ త్వరలో హాలీవుడ్ చిత్రంలో నటించబోతున్నాడు. అమెరికాకు చెందిన 'సిల్క్ రోడ్డు' చిత్రంలో నటిస్తున్నారు. ఆ చిత్రంలో ప్రదీప్ కాటశాని లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ విషయాన్ని రాహుల్ రామకృష్ణ తన ట్విట్టర్‌లో పంచుకున్నాడు.

సయ్యద్ కిర్మానిగా సాహిల్ ఖత్తర్



సయ్యద్ కిర్మానీ... 1983లో ఇండియాకు, జింబాబ్వేకు మధ్య జరిగిన వరల్డ్ కప్ మ్యాచ్‌లో సయ్యద్ కిర్మాని పార్టనర్‌షిప్‌లో 126 పరుగులు, తొమ్మిది వికెట్లు తీసి జట్టును కష్టకాలం నుంచి గట్టెక్కించాడు. ఇప్పుడు ఆ మ్యాచ్‌ని మళ్లీ వెండితెరపై చూడబోతున్నాం. రణవీర్ సింగ్ హీరోగా నటిస్తున్న '83' చిత్రంలో మరో స్టార్ యాడ్ అయ్యాడు. అతనే నటుడు, యూట్యూబర్, టీవీ హోస్ట్ సాహిల్ ఖత్తర్. 1983లో క్రికెట్‌లో వరల్డ్ కప్ సాధించిన జట్టులో వికెట్ కీపర్‌గా చేసిన సయ్యద్ కిర్మానిగా చేయబోతున్నాడు. ఈ విషయాన్ని చిత్రబృందం ట్విట్టర్ ద్వారా శుక్రవారం తెలియజేసింది. కపిల్ దేవ్ జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది.

జర్నీ



అనంతపురం జిల్లాలో చారిత్రక రాతి నిర్మాణాలు అనేకం ఉన్నాయి. వాటిలో ప్రధానంగా చెప్పుకోదగ్గది రత్నగిరి. అటు కర్నాటకకు, ఇటు ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దు ప్రాంతంలోని మడకశిర, రోళ్ల ప్రాంతంలో ఉంది. ప్రధానంగా రత్నగిరి కోటలో అంతఃపుర భవనం చారిత్రక వైభవ ఘట్టాలకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అంతటి గొప్ప చరిత్ర కలిగిన రత్నగిరి ప్రాంతాన్ని మిత్రులతో కలిసి సందర్శించేందుకు మా ప్రయాణం మొదలుపెట్టాం.
అనంతపురం నుంచి రత్నగిరిని చేరుకునేందుకు బస్సులు అందుబాటులో ఉంటాయి. దాంతో బస్సు ప్రయాణాన్నే ఎంచుకుని, ఉదయాన్నే బయలుదేరాం. ఆ.. అనంత రత్నగిరి వైభవ విశేషాలే ఈ వారం 'జర్నీ'!

వన్నెతరగని.. చారిత్రక గిరి

అనంతపురం నుంచి పెనుకొండ, మడకశిర మీదుగా రోళ్లకు ఐదు కిలోమీటర్లు ప్రయాణించి, రత్నగిరి చేరుకున్నాం. ఈ కోటను కొండ శిఖరాగ్రాన అన్నివిధాలా సురక్షితమైన ప్రదేశంలో నిర్మించారు. ఆత్రుతగానే కోటవైపు మా అడుగులు పడ్డాయి. ప్రస్తుతం పైకప్పు కూలిపోయి, రాతి గోడలతో శిథిలావస్థలో కనిపించింది. ఈశాన్యంలో లోతట్టు నిర్మాణంలో నేలమాళిగను నిర్మించారు. ఇది ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. చుట్టూ రాళ్లగుట్టలతో నిండిన ఆ ప్రదేశం నిర్మానుష్యంగా కనిపించింది. కోట చుట్టూ ఎత్తయిన బురుజులు, గజశాలలు, రాతి ఏనుగుల నిర్మాణాలు, కల్యాణిబావులు, మంటపాలు, పురాతన కట్టడాలతో గల ఈ రత్నగిరి క్షేత్రం రాయలసీమకే తలమానికంగా నిలుస్తోందని చెప్పొచ్చు.



రత్నగిరికి 1900 ఏళ్ల నాటి చరిత్ర ఉంది. రత్నగిరి సంస్థానాన్ని మొదట రాజుగా తిమ్మప్పనాయక పాలించారని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.1799లో ఇక్కడికి వచ్చిన కర్ణాటక ప్రాంతం మైసూరు శ్రీరంగపట్టణం టిప్పుసుల్తాన్ రాజు రత్నగిరికి 'ముస్తాఫాబాద్' అని నామకరణం కూడా చేశారు. అలనాటి రాజుల పాలనకు గుర్తుగా ఎన్నో దేవాలయాలు, భవనాలు, కోట ముఖద్వారాలతోపాటు రెండువైపులా రాతి ఏనుగులు, కల్యాణి బావులు నిర్మించారు. రాజులు నిర్మించిన శత్రు దుర్భేద్యమైన కోటలు, రాణులు స్నానం ఆచరించడానికి ప్రత్యేకంగా నిర్మించిన ఈత కొలనులు, కొండ పైకి ఎక్కేందుకు ఒక్కొక్కటిగా చూస్తుంటే మా కళ్లను మేమే నమ్మలేకపోయాం. ప్రత్యేకంగా శత్రువుల రాకను పసిగట్టి రాజును, సైనికులను అప్రమత్తం చేసేందుకు ఏర్పాటు చేసిన స్థలం, రాణి నివసించేందుకు ఏర్పాటు చేసిన విశాలమైన భవంతి, శత్రువులు ప్రవేశించడానికి వీలుకాకుండా కొండపైన చుట్టూ 35 అడుగుల ఎత్తులో ప్రహరీ.. ఇవన్నీ చూశాక.. 'అద్భుతం' అనకుండా ఉండలేకపోయాం.



బండపై చెక్కిన మెటికెలు ఇలా

అబ్బురపరిచే రాతిబురుజు

ఈ గిరిలో.. ఎత్తయిన రాతి బురుజు మరో ఆకర్షణ. ఆ బురుజులోనే ఒక విశాలమైన గది ఉంది. అప్పట్లో బురుజు పైకి ఆ గది లోపలి నుంచి మాత్రమే ఎక్కేందుకు వీలుగా దారిని ఏర్పాటు చేసుకున్నారు. అంటే, అంతఃపుర వాసులు మాత్రమే ఆ బురుజుపైకి ఎక్కగలరు. ఇతరులు వెళ్ళడానికి అవకాశమే లేదు. అంతేకాదు, అందులో గది ఉన్న విషయం ఇతరులకు తెలియడానికి వీలులేకుండా దాని ద్వారాన్ని అంతఃపురం లోపలికే ఏర్పాటు చేశారు. బయటివారికి అదొక బురుజులా మాత్రమే కనబడుతుంది. అంతఃపురం నైరుతిలో ఇటుకలతో కొన్ని కట్టుదిట్టమైన నిర్మాణాలను చూశాం. అప్పటి నిర్మాణ నైపుణ్యాలు మా బృందానికి ఒకింత ఆశ్చర్యం కలిగించాయి. లోపలకు వెళ్లాక అంతఃపుర భవనానికి నైరుతిలో ఉన్న ఓ చిన్న ద్వారం గుండా బయటికి వచ్చాం. రత్నగిరి కొండను చేరుకునేందుకు చుట్టూ ఉండే ఏడు చిన్న చిన్న కోటలను దాటాల్సి ఉంటుంది. గ్రామంలో అక్కడక్కడా కనిపించే జైన దేవాలయాలను బట్టి చూస్తే రత్నగిరి ప్రాంతాల్లో జైనమతం విలసిల్లినట్లు తెలుస్తోంది.



మధ్యాహ్న భోజనం

అప్పటికే మధ్యాహ్నం కావడంతో భోజనాలకు సిద్ధమయ్యాం. రత్నగిరి ప్రాంతంలో సరైన వసతులు, భోజనశాలలు ఉండవని ముందే తెలియడంతో ముందుగానే అన్నీ పార్సిల్స్ తెచ్చుకున్నాం. రాతి నిర్మాణాలు కావడంతో బహుశా.. అంతటి ఎండలోనూ అక్కడి వాతావరణం చల్లగా అనిపించింది. పూరి, పులిహోర అందులోకి రెండు, మూడు రకాల కర్రీలు, పప్పును మిత్రులతో ముచ్చటించుకుంటూ హాయిగా భుజించాం. చాలామంది పర్యాటకులు ముందుగానే ఇక్కడికి దగ్గరలో ఉన్న రోళ్ల లేదా దగ్గరలోని కర్నాటక ప్రాంతంలో విడిది, ఆహార సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు.

మరిన్ని చూడదగిన ప్రదేశాలు

భోజనాల తర్వాత మళ్లీ కాళ్లకు పని చెప్పాం. కోట అంతఃపురానికి సమీపంలో నైరుతి దిశగా ఓ బండపై జత పాద ముద్రలు కనిపించాయి. వాటి దగ్గర శంఖచక్రాలు స్పష్టంగా చెక్కబడ్డాయి. దాంతో మా వారంతా అవి శ్రీ విష్ణుపాదాలు అని ఫిక్స్ చేశారు. వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేసినా, సాధ్యపడలేదు. అక్కడికి దగ్గరలోనే దాదాపు ఐదు అడుగుల లోతులో వలయాకారంలో గుంతను తవ్వి, దాని చుట్టూ ఇటుక, సున్నపు గారతో గోడను నిర్మించారు. అది గోపురాకారంలో ఉంది. దానికి ఉత్తర దిశగా ద్వారం ఏర్పాటు చేశారు. అది ఒక మనిషి మాత్రమే ప్రవేశించే విధంగా కనిపించింది. అందులో పూర్వము నేతిని నిల్వ చేసుకొనేవారని, అందుకే దీనికి నేతి కోనేరుగా పేరొచ్చిందని కొందరి అభిప్రాయం. ఈ రాతి గుంతలో ఎప్పుడూ దాదాపుగా నేలమట్టానికి నీళ్లు ఉంటాయి. శిఖరాగ్రభాగంలో, ఎక్కువలోతు కూడా లేని రాతి గుంతలో అన్ని కాలాలలో నీళ్లు ఉండడం మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. అంతేకాదు, ఈ నీటిలో ఔషధ గుణాలున్నాయని, ఆ నీటిని సేవిస్తే మూత్రపిండాల్లోని రాళ్లు కరుగుతాయని స్థానికుల నమ్మకం. అయితే, మేం ఆ ప్రయత్నం చేయలేదు. అంతటి ప్రాముఖ్యత కలిగిన నేతి కోనేరును కొందరు అక్రమార్కులు నిధి అన్వేషణలో భాగంగా చాలా వరకూ ధ్వంసం చేశారు. చారిత్రక ఆధారాలకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్న రత్నగిరి కోట పట్ల అధికారుల నిర్లక్ష్యానికి మేం చాలా బాధపడ్డాం. అలా సాయంత్రానికి అయిష్టంగానే తిరుగు ప్రయాణమయ్యాం.


రూట్ మ్యాప్

రోళ్ల మండల కేంద్రం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో గల కర్ణాటక ప్రాంతం మధుగిరి పట్టణానికి వెళ్లే మార్గంలో ఈ కోట ఉంది. జిల్లా కేంద్రం అనంతపురం నుంచి దాదాపు 160 కిలోమీటర్లు. పెనుకొండ వయా మడకశిర నుంచి రోళ్ల మీదుగా కూడా రత్నగిరి చేరుకోవచ్చు. అటు కర్నాటక నుంచి ఈ ప్రాంతాన్ని చేరుకునేందుకు నిత్యం వాహనాలు అందుబాటులో ఉంటాయి.

- రవిచంద్ర, అనంతపురం

బంగారు పూల ద్వారం.. సోనామార్గ్





సోనామార్గ్.. ఇది జమ్మూ కాశ్మీర్‌లో ఉన్న ప్రసిద్ధమైన కొండ ప్రాంతం. సోనామార్గ్ అంటే బంగారపు మైదానం అని అర్థం. ఈ ప్రదేశం సముద్ర మట్టానికి 2,740 మీటర్ల ఎత్తులో ఉంది. సోనామార్గ్ పట్టణం చుట్టూ మంచు పర్వతాలతో కప్పబడి ఉంటుంది. వసంత కాలంలో ఇక్కడ పూసే బంగారువర్ణపు పువ్వుల వల్ల ఈ ప్రాంతానికి సోనామార్గ్ అనే పేరు వచ్చింది. సూర్య కిరణాలు ప్రసరించినప్పుడు బంగారపు వర్ణంతో ఈ పర్వతం మెరిసిపోతుంది. ట్రెక్కింగ్, హైకింగ్ వంటి సాహస క్రీడలపై ఆసక్తి గల పర్యాటకులకు సోనామార్గ్ చక్కటి ప్రాంతం. ముఖ్యంగా అన్ని ట్రెక్కింగ్ మార్గాలు సోనామార్గ్ నుంచే మొదలుకావడం వల్ల ట్రెక్కింగ్‌కు ప్రసిద్ధమైన ప్రాంతంగా పేరుగాంచింది. సహజమైన ప్రకృతి సౌందర్యం పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. కొలనులు, ప్రవాహాలు, పర్వతాలు ఎంతో ఆకట్టుకుంటాయి. అంతేకాదు అమర్‌నాథ్‌కు వెళ్ళే యాత్రీకులకు సోనామార్గ్ మజిలీగా కూడా ఉంటుంది.

ప్రకృతితో మమేకం!

గడ్సర్, క్రిష్ణసర్, సత్సర్, గంగాబల్ వంటి ప్రసిద్ధ సరస్సులు సోనామార్గ్ అందాల్ని మరింత రెట్టింపు చేస్తాయి. మంచు పర్వతాలతో అందంగా ఉండే గడ్సర్ సరస్సు సోనామార్గ్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. శీతాకాలంలో ఈ సరస్సుకు సమీపంలోనే ఉన్న గడ్డకట్టిన సత్సర్ లేక్ అలాగే బల్తాన్ లేక్ అందాలని చూసి ఆనందించవచ్చు. ఈ ప్రాంతంలో ఉండే మరొక ప్రధాన పర్యాటక ఆకర్షణ క్రిష్ణసర్ లేక్. ఇక్కడ మంచినీటి చేపలను పట్టుకోవచ్చు. అందుకే ఫిషింగ్ అంటే ఇష్టపడే పర్యాటకులు ఇక్కడికి ఎక్కువగా రావడానికి ఆసక్తి చూపుతారు. సముద్ర మట్టం నుంచి 3,600 మీటర్ల ఎత్తులో ఉన్న సత్సర్ లేక్‌కు ట్రెక్కింగ్ ద్వారా చేరుకోవచ్చు. పొడవాటి చెట్లు, ఆల్పైన్ పూలు ఈ సరస్సు అందాలను మరింత పెంచుతాయి. ఈ సరస్సులతో పాటు పర్యాటకులను అమితంగా ఆకర్షించే పర్యాటక కేంద్రం తజివాస్ గ్లేసియర్. రావి చెట్లు, దేవదారు చెట్లతో పాటు దట్టమైన అడవులతో ఉండడం వల్ల క్యాంపునకు అనువైన ప్రాంతంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ పర్యాటకులను ఆకర్షించే మరొక ప్రదేశం లోయలో నుంచి ప్రవహించే అందమైన జలపాతం. ఇది ఇండస్ నదిలో కలుస్తుంది. ఔషధ గుణాలు కలిగిన ఈ నీరు ఎరుపు రంగులో ఉంటుంది. వీటన్నిటితోపాటు పర్యాటకులు సముద్రమట్టం నుంచి 3,680 మీటర్ల ఎత్తులో ఉన్న సత్సారాన్‌పాస్‌ని కూడా సందర్శించవచ్చు. ఇది ట్రెక్కింగ్‌లకు ప్రసిద్ధి చెందిన ప్రదేశం.

సోనామార్గ్‌కు సులభంగానే చేరుకోవచ్చు. శ్రీనగర్‌లోని షేక్ ఉల్ ఆలం విమానాశ్రయం నుంచి సోనామార్గ్ 70 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ప్రధాన నగరాలైన న్యూఢిల్లీ, ముంబయి, చండీగఢ్ వంటి ప్రాంతాలకు చక్కటి రవాణా సౌకర్యం ఉంది. సోనామార్గ్ నుంచి శ్రీనగర్, జమ్మూకు ప్రత్యేకమైన, విలాసవంతమైన లగ్జరీ బస్సులు తిరుగుతూ ఉంటాయి. ఏడాది పొడవునా సోనామార్గ్ వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. శీతాకాలంలో ఈ ప్రాంతపు ఉష్ణోగ్రత జీరో డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతూ ఉంటాయి. ★

చిన్నారి



పొడుపు కథ

నీళ్ళల్లో నివసిస్తాను
కళ్ళు తెరిచే నిద్రపోతాను
మొప్పల ద్వారా శ్వాసిస్తాను
ఈతలో నాకు నేనే సాటి
నేనెవరిని?

జవాబు : చేప

జోక్:

చంటి : మా నాన్న వంద కేజీల బస్తా ఎత్తగలరు తెలుసా?
బంటి : మా నాన్న అయితే ఒంటి చేత్తో బస్సుల్ని, లారీలనూ ఆపేస్తారు.. తెలుసా?
చంటి : మీనాన్న శక్తిమానా?
బంటి : కాదు, ట్రాఫిక్ పోలీస్..!

నీడ కనిపెట్టండి

పిల్లలూ! ఈ చిత్రంలో కోడి, కొన్ని నీడలు ఉన్నాయి కోడి అసలు నీడేదో కనిపెట్టండి?



పొదుపు - అదుపు



చేయాలి పొదుపు
ఖర్చులో ఉండాలి అదుపు
భవిష్యత్తు కోసం
అందరూ చేయాలి మదుపు
బతుకులో అది గొప్ప మలుపు
పొదుపుతో భవితయే గెలుపు



పులికొండ
5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల మెయిన్,
హెచ్. మురవణి,
కర్నూలు జిల్లా

రంగులు వేయండి!



పిల్లలూ..! ఇక్కడ మీకెంతో ఇష్టమైన బొమ్మ ఉంది కదా? దానికి రంగులు వేయండి!

నేను గీసిన బొమ్మ





కె. రాజ్‌కుమార్
9వ తరగతి
జడ్.పి.హైస్కూలు, పెనుమాక,
తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన
మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో చివరి వన్డేలో భారత మహిళల జట్టు ఘోరపరాజయం చెందింది. ఇప్పటికే తొలి రెండు వన్డేలు గెలిచిన భారత్ మూడో వన్డేలో తడబడింది. నిన్న పురుషుల జట్టు, నేడు అమ్మాయిల కివీస్ బౌలర్ల దాటికి చేతులెత్తేశారు. ఆఖరి వన్డేలోనూ కివీస్‌ను ఓడించి క్లీన్‌స్వీప్ చేయాలని పట్టుదలగా దిగిన మిథాలీసేనకు ఓటమి తప్పలేదు.



తడబడిన భారత్

• సిరీస్ 2-1తో కైవసం • చివరి వన్డేలో చేతులెత్తేసిన టీమిండియా

హామిల్టన్ : తొలి రెండు వన్డేల్లోనూ అద్భుత విజయాలతో దుమ్ము రేపిన భారత్ మహిళల జట్టు శుక్రవారం న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. ఇప్పటికే రెండు వన్డేల్లో గెలవడంతో నేటిమ్యాచ్‌లోనూ విజయంతో ముగించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేద్దామనుకున్న మిథాలీసేనను కివీస్ బౌలర్లు అడ్డుకట్టవేశారు. ఆఖరి వన్డేలో న్యూజిలాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించడంతో సిరీస్ 2-1తో అంతరాన్ని తగ్గించగల్గింది. టాస్ గెలిచిన కివీస్ భారత జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కివీస్ బౌలర్ల దాటికి తట్టుకోలేక టీమిండియా స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. తొలి రెండు వన్డేల్లో మెరిసిన ఓపెనర్లు మంధాన(1), రోడ్రిగ్స్(12)లు ఐదు ఓవర్లలోనే పెవిలియన్ చేరారు. టీమిండియా సారథి మిథాలీ(9) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయింది. ఈ క్రమంలో వచ్చిన దీప్తి శర్మ, హర్మన్ ప్రీత్ కౌర్‌లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఈ జోడీ 48 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని చేకూర్చారు. అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న దీప్తిశర్మ(52) పీటర్సన్ బౌలింగ్‌లో వెనుదిరిగింది. చివర్లో హేమలత(13), గోస్వామి(12)లు నిరాశపర్చడంతో టీమిండియా 44 ఓవర్లలో 149 స్కోరును మాత్రమే చేయగల్గింది. కివీస్ బౌలర్లు పీటర్సన్ నాలుగు, లీ తహుహు మూడు వికెట్లతో సత్తా చాటారు. అనంతరం భారత్ నిర్దేశించిన 150 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు స్టార్ బ్యాటర్ సజై బేట్స్(57), సారథి సాటర్‌వెయిత్(66) అర్ధసెంచరీలతో చెలరేగడంతో 29.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టీమిండియా ను కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించిన కివీస్ బౌలర్ పీటర్సన్‌కు ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'లు దక్కాయి.

స్కోరుబోర్డు : భారత్ ఇన్నింగ్స్:రోడ్రిగ్స్ (సి) కెర్ (బి)తుహుహు 12, మంధాన (సి) డివైన్ (బి)పీటర్సన్ 1, దీప్తి శర్మ (సి పెర్కిన్స్ (బి)పీటర్సన్ 52, మిథాలీరాజ్ (సి) పీటర్సన్ (బి) కాస్‌పెర్క్ 9, కౌర్ (బి) పీటర్సన్ 24, హేమలత (సి అండ్ బి) కెర్ 13, బాటియా (ఎల్‌బి) కెర్ 0, పాండే (సి) డివైన్ (బి) పీటర్సన్ 8, గోస్వామి (నాటౌట్) 12, బిస్త్ (ఎల్‌బి) తుహుహు 3, పూనమ్ యాదవ్ (సి) బెజ్విదన్‌హుట్ (బి) తుహుహు 1. అదనం 14 మొత్తం 149(44 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి).

బౌలింగ్ : తుహుహు 9-1-26-3, పీటర్సన్ 10-1-28-4, డివైన్ 3-0-8-0. హుద్దీస్టన్ 7-0-23-0, కెస్పెర్క్ 5-0-18-1, కెర్ 10-1-43-2.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : బేట్స్ (బి) పూనమ్ 57, డౌన్ (రనౌట్)గోస్వామి 10, సాటర్‌వెయిట్ (నాటౌట్) 66, డివైన్ (నాటౌట్)

బౌలింగ్ : గోస్వామి 8-0-26-0, బిస్త్ 5-0-29-0. పాండే 5-0-24-0. దీప్తి శర్మ 4.2-0-19-0, పూనమ్ 5-1-31-1. హేమలత 2-0-22-0.



మిథాలీ ఖాతాలో మరో రికార్డు

భారత మహిళల సారథి మిథాలీరాజ్ అరుదైన ఘనతను సాధించింది. శుక్రవారం న్యూజిలాండ్ జట్టుతో ఆడిన భారత్ జట్టు కెప్టెన్ మిథాలీ తన కెరీర్‌లో 200 వన్డే మ్యాచ్‌ను ఆడింది. మహిళల ప్రపంచ చరిత్రలో ఈ ఘనత సాధించిన బ్యాట్స్‌ఉమెన్‌గా రికార్డు సృష్టించింది. 19 ఏళ్లకే వన్డే క్రికెట్‌లో అరంగేట్రం చేసిన 36 ఏళ్ల మిథాలీ 51.33 సగటుతో 6622 పరుగులు చేసింది. ఇప్పటి వరకూ భారత్ 263 వన్డేలు ఆడితే అందులో 200 మ్యాచ్‌ల్లో మిథాలీ ఆడింది. ఈ సందర్భంగా బిసిసిఐ. వివిఎస్ లక్ష్మణ్‌ఆమెను అభినందించారు.

జిబ్రాల్టర్ ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్స్ టోర్నీ

లలిత్‌బాబుకు 8వ స్థానం



జిబ్రాల్టర్ : జిబ్రాల్టర్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్ టోర్నీలో విజయవాడకు చెందిన చదరంగ గ్రాండ్ మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్‌బాబు ఎనిమిదో స్థానంలో నిలిచాడు. జనవరి 22 నుంచి 31 వరకూ జిబ్రాల్టర్‌లో జరిగిన ఈ టోర్నమెంటులో మొత్తం 252 మంది గ్రాండ్‌మాస్టర్లు పాల్గొన్నారు. టోర్నీలో 55వ స్థానంతో ప్రారంభించిన లలిత్‌బాబు 10 రౌండ్లలో 7 పాయింట్లు సాధించి ఎనిమిదో స్థానానికి చేరుకున్నారు. ఈ టోర్నమెంటులో అద్భుతమైన ప్రతిభ కనబర్చిన లలిత్‌బాబు తన ఖాతాలో 29.8 ఫిడే రేటింగ్ పాయింట్లను వేసుకున్నాడు. దీంతో లలిత్ 2586 ఫిడే రేటింగ్ పాయింట్లతో ఉన్నాడు. ఇదే టోర్నీలో రాష్ట్రానికే చెందిన ద్రోణవల్లి హారిక 91వ స్థానం (5.5 పాయింట్లు), విజయవాడకు చెందిన కోనేరు హంపి 49వ స్థానం(6 పాయింట్లు)తో సరిపెట్టుకున్నారు.

శతకంతో చెలరేగిన బర్న్స్

శ్రీలంకతో రెండో టెస్టు



కాన్‌బెర్రా : శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి 384 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ జట్టు ఓపెనర్ హ్యరీస్ జట్టు స్కోర్ 11 పరుగుల వద్ద వైడ్‌గా వెళ్తున్న బంతిని స్కోరుగా మలిచే క్రమంలో కరుణరత్నేకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన ఖ్వాజా డకౌట్ కాగా, లంభచాగ్ని(6) పరుగులకే పెవిలియన్ చేరారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు 28 పరుగులకే మూడు వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడింది. ఈ క్రమంలో మరో ఓపెనర్ బర్న్స్(172 నాటౌట్), హెడ్ (161) శతకాలతో చెలరేగడంతో ఆసీస్ జట్టు భారీస్కోర్ దిశగా దూసుకెళ్తోంది. తొలిరోజు ఆటముగిసే సమయానికి బర్న్స్, పీటర్సన్ (25 నాటౌట్)తో క్రీజులో ఉన్నాడు. శ్రీలంక బౌలర్ ఫెర్నాండోకు మూడు, కరుణరత్నేకు ఒక వికెట్ దక్కాయి. రెండు టెస్టుల సిరీస్‌లో ఆసీస్ 1-0 ఆధిక్యతలో ఉంది.

క్రీడారంగానికి రూ.2216 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రీడారంగానికి 2019-20గానూ అదనంగా రూ214.20 కోట్లు కేటాయించింది. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రీడలకు రూ.2216.92 కోట్లు కేటాయించారు. గతేడాది ఇది 2002.72 కోట్లు. దీని వల్ల భారత క్రీడా ప్రాధికార కేంద్రాల(సాయ్), జాతీయ క్రీడా అభివృద్ధి నిధి(ఎన్ఎస్‌డిఫ్)కి కేటాయింపులు పెరిగాయి. సాయ్‌కి అదనంగా రూ.55 కోట్లు కేటాయించారు. దీంతో ఈ పద్దు రూ.395 కోట్ల నుంచి రూ.450 కోట్లకు పెరిగింది. ఎన్ఎస్‌డిఎఫ్ కేటాయింపులు రూ.2 కోట్ల నుంచి రూ.70 కోట్లకు పెంచారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలను రూ.63 కోట్ల నుంచి రూ.89 కోట్లకు పెంచారు. జాతీయ క్రీడా సమాఖ్య కేటాయింపుల్లో మార్పులేమీ లేవు. రూ.245 కోట్ల నుంచి రూ.245.13 కోట్లకు సరిపెట్టారు. క్రీడాకారులకు పురస్కారాలు ఇచ్చేందుకు అదనంగా రూ.94.07 కోట్లను ప్రకటించారు. ఈ పద్దు రూ.316.93 కోట్ల నుంచి రూ.411 కోట్లకు పెరిగింది. ఖేలో ఇండియా పద్దు సైతం రూ.50 కోట్లు పెరిగి రూ.601 కోట్లకు చేరింది.



భారత్‌లోనే ప్రపంచ కప్

దుబాయ్ : 2021 ఛాంపియన్స్ ట్రోఫీ, 2023 వన్డే ప్రపంచకప్‌లు భారత్‌లోనే జరుగుతాయని ఐసిసి ఛీఫ్ రిచర్డ్సన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి పన్ను మినహాయింపు లేకుంటే ఈ టోర్నీలను ఇతర దేశాలకు తలిస్తామని హెచ్చరిం చిన నేపథ్యంలో తాజాగా ఈ ప్రకటన చేశారు. 'పన్ను మినహాయింపు ప్రపంచ క్రికెట్‌కు చాలా ముఖ్యం. ఐసిసికి వచ్చే ప్రతి రూపాయిని మళ్లీ ఆట కోసమే ఖర్చుపెడ్తాం. ఉదాహరణకు వెస్టిండీస్ వంటి జట్లు రెవెన్యూ పొందలేవు. అలాంటి జట్లకు ఐసిసి అండగా వుంటుంది. ఇక భారత్‌లో నిర్వహించే టోర్నీలను ఇతర దేశాలకు తరలించే ఆలోచనలైతే లేవు. అయితే భారత ప్రభుత్వం నుంచి పన్ను మినహాయింపు లభిస్తోందని ఆశిస్తున్నాం' అని రిచర్డ్సన్ తెలిపారు.

సింగిల్స్‌లో ఓటమి

- ఇటలీకి 2-0 ఆధిక్యత
- దేవిస్‌కప్ పోరు

కోల్‌కతా : డేవిస్ కప్ కొత్త ఫార్మాట్‌తో బరిలోకి దిగిన తొలిరోజు రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఓటమిపాలయ్యారు. శుక్రవారం జరిగిన తొలిమ్యాచ్‌లో రామ్‌కుమార్ రామనాథన్ 4-6, 2-6 సెట్ల తేడాతో ఆండ్రెస్ సెప్పి(ఇటలీ) చేతిలో ఓడాడు. ఆ తర్వాత జరిగిన రెండో సింగిల్స్ మ్యాచ్‌లో ప్రజ్నేష్ గుణేశ్వరన్ 4-6, 3-6 సెట్ల తేడాతో బెరెటిని చేతిలో పరాజయం పాలయ్యాడు. భారత ఆటగాళ్లు తమకంటే బలమైన ప్రత్యర్ధుల చేతిలో చిత్తుగా ఓడారు. శనివారం డబుల్స్ పోటీలో రోహన్‌బొప్పన్న/శరణ్ జోడీ బొలెల్లి/సెచ్చినాటో తలపడనుంది. ఈ మ్యాచ్ ఓడిన పక్షంలో భారత్ దేవిస్‌కప్‌నుంచి నిష్క్రమిస్తుంది.

'సూపర్'లో నెగ్గిన వెస్టిండీస్

కరాచీ: పాకిస్తాన్-వెస్టిండీస్ మహిళల మధ్య జరిగిన శుక్రవారం జరిగిన రెండో టీ20 సూపర్ ఓవర్‌లో వెస్టిండీస్ గెలిచింది. టాస్ గెలిచిన పాకిస్తాన్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. వెస్టిండీస్ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ టై అయ్యింది. సూపర్ ఓవర్‌లో వెస్టిండీస్ గెలిచింది. ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ కాంప్‌బెల్లీకు దక్కింది.

హార్టికల్చర్ నోటిఫికేషన్ రద్దు

నాలుగు పరీక్షల తేదీల మార్పు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హార్టికల్చర్ శాఖలో పోస్టుల భర్తీకోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) రద్దుచేసింది. డిసెంబర్ 13న కమిషన్ 39 హార్టికల్చర్ అధికారుల పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. డిసెంబర్ 14 నుంచి జనవరి 4 వరకు దరఖాస్తులు స్వీకరించింది. ఫీజు కింద అభ్యర్థులు నుంచి వసూలు చేసిన నగదును తిరిగి చెల్లిస్తామని కమిషన్ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరీక్షల తేదీల మార్పు

గ్రూపు-1, ఎఇఇ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్(ఎఫ్‌ఆర్‌ఓ), అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్ పోస్టుల స్క్రీనింగ్ టెస్టుల పరీక్ష తేదీలను ఎపిపిఎస్‌సి మార్పు చేసింది. మార్చి 10 జరగాల్సిన గ్రూపు-1 స్క్రీనింగ్ టెస్టును మార్చి 31కు, ఫిబ్రవరి 17న జరగాల్సిన ఎఇఇ స్క్రీనింగ్ పరీక్షను 17కు, ఫిబ్రవరి 24న జరగాల్సిన ఎఫ్‌ఆర్‌ఓ మార్చి 3కు మార్చారు. ఏప్రిల్ 28,29,30 తేదిల్లో జరగాల్సిన ఎఫ్‌ఆర్‌ఓ మెయిన్ పరీక్షలను మే 14,15,16 తేదిలకు మార్చారు. మార్చి 3,4 తేదిల్లో జరగాల్సిన అసిస్టెంట్ కమిషనర్ స్క్రీనింగ్ టెస్టు పరీక్షను మే 9,10 తేదీలకు మార్చారు.

26వేల మందికి 113 కోట్లు

పెళ్ళికానుక మంజూరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏప్రిల్ 20 నుంచి సెప్టెంబర్ 30, 2018 వరకు పెళ్ళి కానుక కోసం దరఖాస్తులు చేసుకున్న 26,769 మంది వధువులకు రూ. 113.94 కోట్లు మంజూరు చేశారు. ఆ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 2, 3, 4వ తేదీల్లో నిర్వహించే పసుపు కుంకుమ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఈ కానుకను పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. మొత్తం 28769 మందిలో 6,749 మంది ఎస్సీ, కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీలు 1,042 మంది, గిరిపుత్రిక కింద 1,440 మంది ఎస్టీలు, కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్టీలు 175, బిసిలు 12,480, కులాంతర వివాహం చేసుకున్న బిసిలు 1,183, దుల్హన్ కింద 3,077 మంది ముస్లిం, వికలాంగ యువతులు 549 మంది ఉన్నట్టు పేర్కొన్నారు.

దళితుల సంక్షేమానికి తూట్లు

వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు నాయుడు దళితుల సంక్షేమానికి తూట్లు పొడుస్తున్నారని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగర్జున మండిపడ్డారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవార ం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితుల సొమ్మును చంద్రబాబు పూర్తిగా దోచుకుంటున్నారన్నారు. దళితులుగా ఎవరు పుడతారు అన్న సిఎంకు పాలించే అర్హత ఉందా? దళితుల పాఠశాలలు, హాస్టళ్లు మూసేస్తే మా పిల్లలు ఎక్కడ చదవాలి? ఎక్కడ ఉండాలి? అని ప్రశ్నించారు. దళిత ఉద్యోగులు భయపడుతూ బతుకుతున్నారని, దళితుల భూములు లాక్కుంటున్నారని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ఒక దొంగ అని, కార్పొరేషన్ నిధులు కోట్లు దోచుకుతిన్నారని విమర్శించారు. దళితులంతా ఏకమై చంద్రబాబును తరిమి కొడదామని పిలుపునిచ్చారు.

యూనివర్సిటీ ఇన్‌చార్జిల నియామకం

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యూనివర్సిటీలకు వైఎస్సార్ విద్యార్థి విభాగం ఇంఛార్జ్‌లను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ వైఎస్సార్ విద్యార్థి విభాగం ఇంఛార్జ్‌గా బీ. మోహన్ నియమితులయ్యారు. నాగార్జున వర్సిటీ ఇంఛార్జ్‌గా కిరణ్ నియమితులు కాగా, కాకినాడ జేఎన్‌టీయూ, కేఎల్ వర్సిటీల బాధ్యతలను కే రాజశేఖర్‌లకు అప్పగించారు. తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విద్యార్థి విభాగం ఇంఛార్జ్‌గా పీ, మురళీ, ఎస్‌కేయూ, రాయలసీమ, విక్రమసింహపురి వర్సిటీలకు జీ లింగారెడ్డిను నియమించారు.

ఎన్నికలప్పుడే వరాలా?

- అధికార, ప్రతిపక్ష పార్టీలను సాగనంపండి
- ఎర్రసైన్యం, జనసైన్యం కలిశాయి విజయం మనదే
- మంగళగిరి సభలో నాయకులు



అభివాదం చేస్తున్న మధు, రామకృష్ణ, రావెల తదితరులు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా గుర్తుకురాని పసుపు - కుంకాలు, పింఛన్ల పెంపు, వివిధ సామాజిక తరగతులకు కార్పొరేషన్ల ఏర్పాటు ఇప్పుడే గుర్తొచ్చాయా? అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు ప్రశ్నించారు. వైసిపి అసెంబ్లీని వదిలి, ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా మంగళగిరిలో ప్రత్యామ్నాయ కూటమి విజయ దుందుభి మోగించాలన్నారు

గుంటూరు జిల్లా మంగళగిరిలో జనసైన్యం, ఎర్రసైన్యం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సికె బాలిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభకు సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీల నాయకులు జెవి.రాఘవులు, చిన్ని తిరుపతయ్య, చిల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు అవినీతి ఊబిలో కూరుకుపోయిన నేపథ్యంలో సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీల కలయిక చారిత్రాత్మక అవసరమని ఆయా పార్టీల నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి నుండే టిడిపి, వైసిపికి మంగళం పాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి రైతుల ప్రాణాలను పణంగా పెట్టి పాలించాయని మండిపడ్డారు. ప్రత్యేక హోదాకోసం వామపక్షాలు పోరాడితే కేసులు పెట్టి, జైలుపాలు చేసి, హోదా ఏమైనా సంజీవనా అని చంద్రబాబు ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు ప్రజాసమస్యలపై పోరాడుతున్న వామపక్షాలతో పవన్‌కల్యాణ్ కలిసిరావడం శుభపరిణామమని చెప్పారు. ఒకే దేశం, ఒకే ప్రజ అంటూ బిజెపి జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దు తీసుకొచ్చి ప్రజల నడ్డి విరిచారని, వందలాది మంది ప్రాణాలు పోవడానికి కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాజధాని భూములు తాకట్టుపెట్టి మరో రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారన్నారని, 1600 ఎకరాలు సింగపూర్ కంపెనీలకు కట్టబెట్టిన ప్రభుత్వం పేదవాడికి ఇంటి స్థలానికి సెంటు భూమి కూడా ఇవ్వడానికి ముందుకు రాలేదని దుయ్యబట్టారు. మాజీ మంత్రి, జనసేన నాయకులు రావెల కిషోర్‌బాబు మాట్లాడుతూ ఎర్రజన సైన్యం పేరుచెబితే అధికార, ప్రతిపక్ష పార్టీల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, మంగళగిరి నుండే ఈ మూడు పార్టీలు కలిసి విజయశంఖారావం పూరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మార్పు కోసం చేసే తమ ప్రయత్నాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అబద్ధాలు, కుట్ర రాజకీయాలను ఎండకట్టాలని, దోపిడి రాజ్యం, దుర్మార్గుల పాలన పోవాలని, వివక్ష, ఆకలి మంటలు లేని రాజ్యం రావాలని, అది ప్రత్యామ్నాయ కూటమితోనే సాధ్యమని స్పష్టం చేశారు. బహిరంగసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు జొన్నా శివశంకరరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, జనసేన నాయకులు నయాబ్ కమల్, ఆయా పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

ఆర్టీసి సిబ్బందికి డిఎ పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి సిబ్బందికి 3.65 శాతం కరువు భత్యం(డిఎ)ను పెంచుతూ ఆర్టీసి ఎమ్‌డి ఎన్‌వి సురేంద్రబాబు శుక్రవారం ఉత్తర్వు లు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న 37.20 శాతం డిఎను 40.85 శాతానికి పెంచుతు న్నట్లు పేర్కొన్నారు. పెంచిన డిఎ ఈ ఏడాది జనవరి 1 నుంచి వర్తించనున్న ట్లు తెలిపారు. పెరిగిన డిఎను మార్చి 1న సిబ్బంది ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

విజయవాడకు ఆర్టీసి పిఎఫ్ కార్యాలయం

ప్రస్తుతం హైదరాబాద్ బస్‌భవన్ లో కొనసాగుతున్న ఆర్టీసి పిఎఫ్ కార్యాల యం ఈ నెలాఖరులోపు విజయవాడ ఆర్టీసి హౌస్‌కు తరలించనున్నట్లు ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్(ఇయు) రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యాయవాదుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ఎఐఎల్‌యు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

న్యాయవాదుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఎఐఎల్‌యు) ఎపి రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఎమ్‌బి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు న్యాయవాదుల కు ఇచ్చిన హామీల్లో బార్ కౌన్సిల్‌కు మ్యాచింగ్ గ్రాంటు మాత్రమే మంజూరు చేశారని మిగతావి నేరవేర్చలేదని గుర్తుచేశారు. హైకోర్టులో 37 మందికి 14 మందే ఉన్నారని, వివిధ అంశాలతో ఇప్పుడా సంఖ్య 11 కు తగ్గిపోతుందని చెప్పారు. న్యాయవాదులు కొరతతో రాష్ట్రంలో రెండు లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, దీని ప్రభావంతో నాణ్యమైన తీర్పులు రాక ప్రజలు నష్టపోతున్నారని చెప్పారు. దీనికి న్యాయ మూర్తులను, న్యాయవ్యవస్థను విమర్శించటం సరికాదన్నారు. వెంటనే న్యాయశాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు సమర్థవంతంగా పనిచేసే యంత్రాంగాన్ని ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా న్యాయ వాదులుగా గుర్తింపు పొంది పనిచేస్తున వారికి నెలకు ఐదువేలు స్టైఫండ్ ఇవ్వాలని, న్యాయవాదు లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, బార్ కౌన్సిల్‌కు కనీస వసతులు కల్పించాలని, న్యాయవాదుల కోసం లా అకాడమీ, లైబ్రరీలను ఏర్పాటు చేయాలని కోరారు. పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయటం వల్ల వారు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని, కోర్టు రికార్డులు పోతే చాలా నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోస్టులను శాశ్వత ప్రతిపాదికన, రాజకీయ జోక్యం లేకుండా ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలని కోరారు. ఎఐఎల్‌యు రాష్ట్ర హైకోర్టు ఉపాధ్యక్షులు ఎన్.మాధవరావు మాట్లాడు తూ మూడున ఏర్పాటు కానున్న హైకోర్టు లో న్యాయవాదుల కు సౌకర్యాలు కొరవడ్డా యని, వాటిని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంపర శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర నాయకులు ఎస్‌కె సయ్యద్ బాబు, జివిఎల్ మూర్తి, సివి సుబ్రమణ్యేశ్వరావు, ఎస్ రమేష్, బి.రవి, వి.రాజారత్నం, పి.పాల్, లా స్టూడెంట్ వింగ్ స్టేట్ కన్వీనర్ జి.నరసింహారావు పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68